RNI NO. APBIL/2013/50718
LGTV
LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
# లోకల్ గైడ్
ఎడిటర్: చిలకమర్రి రంగారెడ్డి
ద్విభాషా దినపత్రిక
www.localguidenews.com
ప్రచురణ :, తెలంగాణ | సంపుటి 13, | సంచిక ,256 | పేజీలు -12 | ఆదివారం - 11 - అక్టోంబర్ - 2026 | వెల రూ.2/-

లోకల్ గైడ్ తెలంగాణ www.localguidenews.com
విలేకరులు కావలెను
సరికొత్త హంగులతో నూతన ఒరవడితో వెలువడుతున్న లోకల్ గైడ్ జాతీయ తెలుగు దినపత్రికలో పని చేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లా ఇన్చార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల ఆర్సీలు,మరియుమండలాల వారిగా రిపోర్టర్లు కావలెను.
ADVERTISEMENT మేనేజర్లు కావలెను అనుభవము ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును సంప్రదించండి
8977761499/9110308094



### బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మలేదు: మంత్రి పొంగులేటి

- గత ఏడాదితో పోలిస్తే రిజిస్ట్రేషన్ల ఆదాయం 21 శాతానికి పైగా పెరిగిందన్న పొంగులేటి
- ఇదే రేవంత్ రెడ్డి సమర్థ పాలనకు నిదర్శనమని వ్యాఖ్య
- పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోని భూ అక్రమాలను వెలికితీస్తున్నామని వెల్లడి

## కరవుపై 12న మంత్రులతో
# రేవంత్‌రెడ్డి సమీక్ష
### రాష్ట్రంలోని 320 మండలాల్లో తీవ్ర కరవు ప్రభావం

- ఈ నెల 12న ఉన్నతస్థాయి సమావేశం
- ఎల్ నినో ప్రభావంతో 17శాతం తగ్గిన వర్షపాతం
- రాష్ట్రంలోని మొత్తం 33 జిల్లాలకు గాను 18 జిల్లాల్లోని 320 మండలాల్లో తీవ్ర కరవు ఛాయలు అలుముకున్నాయి
- రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 621 మండలాల్లో దాదాపు సగం మండలాలు కరవు ప్రభావానికి గురైనట్లు అధికారిక వర్గాలు భావిస్తున్నాయి



రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వం తక్షణమే చేపట్టాల్సిన చర్యలపై లోతుగా చర్చిస్తారుహైదరాబాద్: తెలంగాణలో నెలకొన్న తీవ్ర కరవు పరిస్థితులు, సహాయక చర్యలపై చర్చించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించనున్నారు. అక్టోబర్ 12న మంత్రులతో ప్రత్యేకంగా భేటీ అయి, మిగతా 2 లో

### హైదరాబాద్ హైస్పీడ్ రైల్.. భూసేకరణపై కేంద్రం కీలక ప్రకటన



- భూసేకరణకు రాష్ట్రాలకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని వెల్లడి
- ప్రస్తుతం జరుగుతున్న భూసేకరణ చట్టవిరుద్ధమని స్పష్టీకరణ
- కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో కిషన్ రెడ్డి భేటీ అనంతరం ప్రకటన
- ప్రస్తుతం కేవలం అలైన్‌మెంట్ అధ్యయనాలు మాత్రమే జరుగుతున్నాయని వెల్లడి

### ఢిల్లీలో హై టెన్షన్.. మమతా, కేజ్రీవాల్ సహా పలువురు మాజీ సీఎంల అరెస్ట్



## ఢిల్లీలో నిరసనల ఉద్రిక్తత.. మమతా, కేజ్రీవాల్ అరెస్ట్

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ విపక్షాల డిమాండ్
- అనుమతి లేదంటూ నేతలను అదుపులోకి తీసుకున్న ఢిల్లీ పోలీసులు
- కేరళ మాజీ సీఎం పినరయి విజయన్‌తో పాటు పలువురు ఎంపీల నిర్బంధం

### 'ఓట్ల దొంగతనం'పై రాష్ట్రపతి ఆధారం అడిగారా?.. రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ ఫైర్!



రాష్ట్రపతితో భేటీపై రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై ఎన్డీఏ ఆగ్రహం
రాష్ట్రపతితో సంభాషణను బయటపెట్టడంపై బీజేపీ తీవ్ర అభ్యంతరం
సాక్ష్యాలు లేకుండా ఆరోపణలు చేస్తున్నారని విపక్షాలపై విమర్శలు
సర్ ప్రక్రియపై 'ఇండియా' కూటమి ఆందోళన

ఢిల్లీ: లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై 'జాతీయ ప్రజాస్వామ్య కూటమి' (ఎన్డీఏ) తీవ్రంగా స్పందించింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో జరిగిన భేటీ వివరాలను రాహుల్ గాంధీ వెల్లడించిన తీరుపై ఎన్డీఏ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. రాహుల్ చేసిన వ్యాఖ్యల వాస్తవికతను వారు ప్రశ్నించారు.

## వేలంలో ప్రధాని మోదీ జ్ఞాపికలు.. జాబితాలో ఏపీకి చెందిన 18 బహుమతులు

- వేలం ద్వారా వచ్చిన నిధులను 'నమామి గంగే' కార్యక్రమానికి వినియోగం
- వేలం జాబితాలో కొండపల్లి బొమ్మ, కలంకారీ వస్త్రం వంటివి
- అందుబాటులో కాకతీయ కళాతోరణం వంటి ఖరీదైన జ్ఞాపికలు
- అక్టోబరు 31 వరకు ఆన్‌లైన్‌లో బిడ్లు దాఖలు చేసే అవకాశం



ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ వివిధ పర్యటనల సందర్భంగా అందుకున్న బహుమతులు, జ్ఞాపికలను కేంద్ర ప్రభుత్వం మరోసారి వేలానికి ఉంచింది. ఈసారి వేలంలో ఏపీకి చెందిన 18 ప్రత్యేక బహుమతులు కూడా మిగతా 2 లో

# స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు ఖరారు..
### రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ సిఫార్సులకు కేబినెట్ ఆమోదం

- ఏపీ కేబినెట్ కీలక నిర్ణయం
- పలు పదవులకు 24 శాతం నుంచి 35 శాతం వరకు రిజర్వేషన్లు
- కూటమి పక్షాల ద్వారా 34 శాతం సీట్లు బీసీలకు కేటాయిస్తామని హామీ



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి బీసీ రిజర్వేషన్లపై చంద్రబాబు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కేబినెట్ మిగతా 2 లో



### జగన్‌కు ఈడీ షాక్.. అక్రమాస్తుల కేసులపై హైకోర్టును ఆశ్రయించిన ఏజెన్సీ

- జగన్ అక్రమాస్తుల కేసులపై తెలంగాణ హైకోర్టులో ఈడీ పిటిషన్
- రోజువారీ విచారణ జరపాలని పిటిషన్‌లో అభ్యర్థన
- దశాబ్దకాలంగా సీబీఐ కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులు
- విచారణకు జగన్ వ్యక్తిగతంగా హాజరు కావాలని వినతి



### సీఈసీ వివాదం: ప్రతిపక్షాల తీరుపై వెంకయ్యనాయుడు అసంతృప్తి

- 13 కోట్ల ఓట్ల తొలగింపు ఆరోపణలు అవాస్తవమన్న వెంకయ్యనాయుడు
- ఓడిపోతే ఈవీఎంలను నిందించడం హాస్యాస్పదమని వ్యాఖ్య
- ప్రతిపక్షాలు అతిగా ప్రవర్తిస్తున్నాయని విమర్శ

## 13న విజయవాడకు రానున్న తమిళనాడు సీఎం విజయ్..

- సీఎం చంద్రబాబుతో కృష్ణా జలాల వాటాపై కీలక చర్చలు
- తెలుగు గంగ ఒప్పందం ప్రకారం నీరు రావడం లేదని తమిళనాడు ఆందోళన
- ఏపీ నిర్మించతలపెట్టిన డ్యామ్‌లపైనా చర్చించనున్న సీఎం విజయ్
- పర్యటనలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తోనూ భేటీ అయ్యే అవకాశం



అమరావతి: ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల మధ్య నెలకొన్న జల వివాదాల పరిష్కారం దిశగా కీలక ముందడుగు పడనుంది. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ఈ నెల 13న విజయవాడలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో మిగతా 2 లో

## పర్యాటక ప్రగతిలో భాగస్వాములు అవ్వండి
### ఐటీ సంస్థలకు ఉప ముఖ్యమంత్రి భట్టి పిలుపు

- ఫ్యూచర్‌సిటీలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానం
- ఐటీ ఉద్యోగులు వారాంతాల్లో కుటుంబాలతో కలిసి పర్యాటక ప్రాంతాల్ని సందర్శించేలా ప్రోత్సహించాలి
- ప్రాణహిత-చేవెళ్ల, కాళేశ్వరం ప్రాజెక్టులకు, కవ్వాల్, అమ్రాబాద్ టైగర్ రిజర్వులకు ప్రాచుర్యం కల్పించాలి



హైదరాబాద్: తెలంగాణలోని ప్రకృతి అందాలకు మరింత ప్రాచుర్యం కల్పించడంతోపాటు పర్యావరణహిత పర్యాటకాన్ని మరింత అభివృద్ధి చేయడానికి మిగతా 2 లో

RNI NO. APBIL/2013/50718
LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్
ద్విభాషా దినపత్రిక
www.localguidenews.com



# సంపాదకీయం

## సహజీవన రాగం సాధ్యమా?

ఆర్థిక రంగం మొదలు కృత్రిమ మేధ (ఏఐ) వరకూ అన్నిటా పరస్పరం హోరాహోరీ తలపడుతున్న బలమైన ప్రత్యర్థులు అమెరికా, చైనాలు నాలుగు నెలల వ్యవధిలో రెండోసారి కరచాలనం చేసుకున్నాయి. మొన్న మేలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్‌ట్రంప్ చైనాలో పర్యటించగా... మూడు రోజుల దౌత్య పర్యటన కోసం చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ బుధవారం వాషింగ్టన్ వచ్చారు. ఆయనకు రెండురోజులూ ఘనసత్కారాలే దక్కాయి. కెమెరాల ఎదుట అధినేతలిద్దరూ చిరునవ్వులు చిందించటం కూడా చూడముచ్చట గానే ఉంది. కానీ రెండు దేశాల మధ్యా ఉన్న సమస్యలు గానీ,వాటి కారణంగా ఇప్పటికే పేరుకు పోయిన విభేదాలు గానీ చిన్నవేం కాదు. అవి సంక్లిష్టమైనవి, సామరస్య పరిష్కారానికి ఓపట్టాన లొంగనివి. 60వ దశకంలో నాటి రష్యా అధినేత నికితా కృశ్చేవ్ ప్రతిపాదించిన 'మూడు శాంతుల' ప్రతిపాదనలో ఒకటైన 'శాంతియుత సహజీవనం' సూత్రాన్ని గుర్తుకు తెచ్చేలా సంఘర్షణకన్నా సహకారమే ఇద్దరికీ లాభదాయకమని షీ జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. అప్పట్లో కృశ్చేవ్‌కు రానట్టే జిన్‌పింగ్‌కు కూడా ట్రంప్‌నుంచి అనుకూల స్పందనేమీ రాలేదు. కానీ ఇరుపక్షాలూమరింత సమతూక వాణిజ్య సంబంధాలు నెలకొల్పుకోవటానికి కలిసి పనిచేస్తున్నాయని ట్రంప్ అన్నారు. ఎగుమతులు పెంచటానికీ, ఆర్థికాభివృద్ధి సాధించటానికీ చైనా ప్రభుత్వం అక్కడి తయారీ రంగ పరిశ్రమలకు భారీయెత్తున సబ్సిడీలిస్తోంది. దాంతో చవగ్గా కార్లు, సౌరశక్తి ప్యానెళ్లు, ఖనిజాలు, ఉక్కు, ఇతర రకాల సరుకులు పాశ్చాత్య మార్కెట్లను ముంచెత్తుతున్నాయి. ఈ వ్యూహం అమెరికానూ, పాశ్చాత్య దేశాలనూ తీవ్రంగా దెబ్బ తీస్తోంది. దీన్ని తగ్గించేందుకు తొలి ఏలుబడిలో ట్రంప్ చేసిన ప్రయత్నాలు కొంత వరకూ ఫలితాన్నిచ్చాయి. నిరుడు దీన్ని మరింత నియంత్రించేందుకు 25 శాతం అదనపు సుంకాలు విధించారు. వాటి కారణంగా సరుకుల వరద తగ్గిన మాట వాస్తవమే అయినా, దాదాపు 40 పాశ్చాత్య దేశాల మీదుగా ఆ వస్తువులు వెల్లువెత్తటం ట్రంప్‌కు తలనొప్పిగా మారింది. అంతర్జాతీయ నిబంధనలకు అనుగుణంగానే చైనా ఇదంతా చేస్తోంది.

ఎవరెంతగా మొత్తుకుంటున్నా విదేశాలతో నిరుడు చైనా వాణిజ్య మిగులు లక్ష కోట్ల డాలర్ల పైమాటే. ఈమధ్యే అమెరికా మాజీ ఆర్థికమంత్రి జానెట్ ఎలెన్ అంతంతమాత్రంగా ఉన్న అమెరికా పారిశ్రామిక రంగం 'చైనా షాక్'తో మరింత కుంగటం ఖాయమని చేసిన హెచ్చరిక వర్తమాన స్థితికి అద్దం పడుతోంది. చైనా సరుకులపై వ్యామోహంతగ్గించుకోమంటూ జనానికి చేసే హితబోధలేమీ పనిచేయటం లేదు. 'మాగా' పేరు చెప్పి ఆవేశంతో ఊగిపోయేవారు సైతం ఈ విషయంలో ట్రంప్ మాటల్ని బేఖాతరు చేస్తున్నారు. దాంతో దిక్కుతోచని స్థితిలో చైనాపై గత నెలలో 12.5 శాతం అదనపు సుంకాలు విధించారు. కానీ వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరుపుకోవాలన్న అవగాహన కుదిరాక గత నెలలో కొన్ని వస్తువులకు దీన్నుంచి మినహాయింపునిచ్చారు. నవంబర్‌తో ముగియాల్సిన ఆ వెసులుబాటును తాజాగా వచ్చే జనవరి 10 వరకూ పొడిగించారు.

అమెరికాతో సంఘర్షణ ముదిరితే జరిగే పర్యవసానాలేమిటో చైనాకు తెలియంది కాదు. అందుకే అది ద్విముఖ వ్యూహం అనుసరిస్తోంది. సుంకాలవల్ల అమెరికాలో కోల్పోయే నష్టాన్ని యూరోప్ దేశాల్లో భర్తీచేసుకుంటోంది. అలాగే తమవల్ల నష్టపోయే దేశాల్లో పరిశ్రమలు స్థాపిస్తామని, పెట్టుబడులు పెడతామని ప్రతిపాదిస్తోంది. ఆ దేశాల్లో భారీయెత్తున ఉద్యోగావకాశాలొస్తాయని ఊరిస్తోంది. ఈ వంకనే ప్రపంచాన్ని మభ్యపెట్టి నిలువు దోపిడీచేసిన చరిత్రగల అమెరికా, యూరోప్ దేశాలు వీటిని అంత తేలిగ్గాఅంగీకరిస్తాయా? ఈ విషయమై చైనాతో ఈయూ వచ్చేనెలలో చర్చించబోతోంది. కానీ ఫలితం ఉంటుందన్న ఆశ మాత్రం లేదు. అమెరికా--చైనా ఘర్షణలు ముదిరితే బాగుండు నని అవి కోరుకుంటున్నాయి. ఆ మాటెలా వున్నా ట్రంప్, జిన్‌పింగ్‌లిద్దరూ చైనాలోనవంబర్‌లో జరిగే ఆసియా పసిఫిక్ ఎకనామిక్ ఫోరం, డిసెంబర్‌లో అమెరికాలో జరిగే జీ20 శిఖరాగ్ర సదస్సుల సందర్భంగా కలుసుకోబోతున్నారు. అప్పటికల్లా వాణిజ్య సమస్య ఉపశమించాలని రెండు దేశాలకూ కోరికైతే ఉంది. కానీ పరస్పర విరుద్ధ శక్తుల మధ్య అదంత సులభం కాదని చరిత్ర చెబుతోంది.

## కరవుపై 12న మంత్రులతో రేవంత్‌రెడ్డి సమీక్ష

హైదరాబాద్: తెలంగాణలో నెలకొన్న తీవ్ర కరవు పరిస్థితులు, సహాయక చర్యలపై చర్చించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించనున్నారు. అక్టోబర్ 12న మంత్రులతో ప్రత్యేకంగా భేటీ అయి, రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం, దాని పర్యవసానాలపై ఆయన సమీక్ష జరపనున్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా వర్షాభావ ప్రాంతాలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వం తక్షణమే చేపట్టాల్సిన చర్యలపై లోతుగా చర్చిస్తారు. వ్యవసాయం, సాగునీరు, తాగునీటి సరఫరా, పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ వంటి కీలక అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించనుంది. ఎల్ నినో ప్రభావంతో ఈసారి రాష్ట్రంలో సాధారణం కంటే 17 శాతం తక్కువ వర్షపాతం నమోదైనట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అక్టోబర్ 6 నాటి ప్రాథమిక అంచనాల ప్రకారం.. రాష్ట్రంలోని మొత్తం 33 జిల్లాలకు గాను 18 జిల్లాల్లోని 320 మండలాల్లో తీవ్ర కరవు ఛాయలు అలుముకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 621 మండలాల్లో దాదాపు సగం మండలాలు కరవు ప్రభావానికి గురైనట్లు అధికారిక వర్గాలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో, రాష్ట్రాన్ని కరవు పీడిత ప్రాంతంగా ప్రకటించాలని కోరుతూ ప్రభుత్వం ఇప్పటికే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపింది. తక్షణ సహాయం కింద రూ. 20,000 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని మంజూరు చేయాలని విజ్ఞప్తి చేసింది. మంత్రివర్గ ఉపసంఘం చేపడుతున్న చర్యలు, అఖిలపక్ష సమావేశం ఏర్పాటు, రైతు సంఘాలు, నిపుణుల నుంచి సలహాలు స్వీకరించడం వంటి అంశాలు కూడా ఈ భేటీలో చర్చకు వచ్చే అవకాశం ఉంది. మరోవైపు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఇప్పటికే అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నిర్దేశించిన 12 ప్రామాణిక అంశాల ఆధారంగా అక్టోబర్ చివరి నాటికి సమగ్ర కరవు నివేదికను సిద్ధం చేయాలని ఆయన సూచించారు.

### పట్టిసీమ ఫలం.. సీఎం చంద్రబాబుకు

## కృష్ణా డెల్టా రైతుల కృతజ్ఞతలు

అమరావతి: పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణా డెల్టాకు జల భరోసా కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి డెల్టా రైతులు, సాగునీటి సంఘాల ప్రతినిధులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. శనివారం సచివాలయంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో కలిసి సీఎంను కలిసిన రైతులు.. ఆయనను శాలువాతో సత్కరించి, తమ అభిమానాన్ని చాటుకున్నారు. చంద్రబాబును 'ఏపీ వాటర్ మ్యాన్'గా, 'జలప్రదాత'గా అభివర్ణిస్తూ ప్రశంసలు కురిపించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. పట్టిసీమ ద్వారా గోదావరి వరద నీటిని కృష్ణా డెల్టాకు తరలించి, అదే సమయంలో శ్రీశైలంలో పొదుపు చేసిన కృష్ణా జలాలను రాయలసీమకు అందించి అన్ని ప్రాంతాలకు న్యాయం చేశారని కొనియాడారు. కేవలం చంద్రబాబు ముందుచూపుతోనే ఇది సాధ్యమైందని, ఆయన కృషితోనే కృష్ణా డెల్టా సస్యశ్యామలమైందని అన్నారు. పట్టిసీమ ద్వారా ఇప్పటివరకు సుమారు 500 టీఎంసీల నీటిని తమ ప్రాంతానికి అందించడం చరిత్రాత్మకమని పేర్కొన్నారు. రైతుల అభినందనలకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందిస్తూ, వారికి ధన్యవాదాలు తెలిపారు. పట్టిసీమ ద్వారా వచ్చిన నీటితో కృష్ణా డెల్టాలో సిరులు పండించిన రైతుల కృషిని ఆయన అభినందించారు. "పట్టిసీమ లిఫ్ట్ ద్వారా గత 11 ఏళ్లలో 500 టీఎంసీల గోదావరి వరద నీటిని కృష్ణా బేసిన్‌కు విజయవంతంగా తరలించాం. ఈ ప్రాజెక్టుతో సాధించిన జలవిజయం ఎంతో సంతోషాన్నిచ్చింది. ఈ ఆలోచన వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశం డెల్టా రైతుల కష్టాలు తీర్చి, సంపద సృష్టించడమే," అని సీఎం వివరించారు. పట్టిసీమ విజయంతో రెండు ప్రాంతాలకు మేలు జరిగిందని చంద్రబాబు తెలిపారు. గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌లో వినియోగించుకోవడం ద్వారా పొదుపు చేసిన కృష్ణా జలాలను రాయలసీమలోని సాగు, తాగునీటి అవసరాలకు మళ్లించగలిగామని చెప్పారు. దీనివల్లే రాయలసీమలో 'కియా' వంటి ప్రతిష్ఠాత్మక పరిశ్రమలకు కూడా నీటిని అందించడం సాధ్యమైందని స్పష్టం చేశారు. రాష్ట్రానికి సంపూర్ణ జల భద్రత కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, ఇరిగేషన్ క్యాలెండర్‌ను పక్కాగా అమలు చేసి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని రైతులకు భరోసా ఇచ్చారు.

## విజయవాడలో టెన్షన్.. షర్మిలను హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు



అమరావతి: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను పోలీసులు ఈరోజు గృహనిర్బంధం చేశారు. గన్నవరం సమీపంలోని కేసరపల్లిలో ఉన్న ఆమె నివాసం వద్ద ఉదయం నుంచే భారీగా పోలీసులను మోహరించారు. ఇండియా కూటమి పార్టీలు విజయవాడలో తలపెట్టిన 'చలో రాజ్‌భవన్' కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు పోలీసులు ఈ చర్యలు తీసుకున్నారు. ఓటర్ల జాబితా నుంచి పెద్ద ఎత్తున పేర్లు తొలగించారని ఆరోపిస్తూ, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి ఈ నిరసనకు పిలుపునిచ్చింది. ఈ ఉదయం 10 గంటలకు విజయవాడలోని లెనిన్ సెంటర్ నుంచి రాజ్‌భవన్ వరకు యాత్ర నిర్వహించాలని నిర్ణయించారు. అయితే, ఈ కార్యక్రమానికి ఎలాంటి అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే షర్మిలతో పాటు పలువురు కాంగ్రెస్, వామపక్ష పార్టీల కీలక నేతలను పోలీసులు ఎక్కడికక్కడ గృహనిర్బంధం చేస్తున్నారు. మరోవైపు, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా రాజ్‌భవన్ వద్ద కూడా భద్రతను కట్టుదిట్టం చేశారు. పోలీసుల ఆంక్షల నడుమ షర్మిల ఇంటి నుంచి బయటకు వస్తారా, లేదా అనే దానిపై ఉత్కంఠ నెలకొంది. తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయోనని సర్వత్ర ఆసక్తి నెలకొంది.

### ఢిల్లీలో హై టెన్షన్.. మమతా, కేజ్రీవాల్ సహా

## పలువురు మాజీ సీఎంల అరెస్ట్

ఢిల్లీ: రాజధాని ఢిల్లీలో నేడు తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసనల్లో పాల్గొన్న పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారితో పాటు తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు, కేరళ మాజీ సీఎం పినరయి విజయన్ సహా పలువురు విపక్ష నేతలను కూడా నిర్బంధించి డిటెన్షన్ సెంటర్‌కు తరలించారు. ఎన్నికల కమిషన్, ఎన్నికల ప్రక్రియలకు సంబంధించిన ఆరోపణలపై విపక్షాలు తలపెట్టిన ఆందోళనల్లో పాల్గొనేందుకు మమతా బెనర్జీ ఢిల్లీకి వచ్చారు. సెంట్రల్ ఢిల్లీలోని సౌత్ అవెన్యూ సమీపంలో పోలీసులు ఆమెను అడ్డుకోవడంతో, సమీపంలోని బస్టాండ్‌లో బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో పోలీసులు ఆమెను, టీఎంసీ ఎంపీలు డెరెక్ ఓబ్రెయిన్, డోలా సేన్‌లను అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు ఇదే నిరసనలో పాల్గొనేందుకు తన నివాసం నుంచి బయటకు వస్తున్న అరవింద్ కేజ్రీవాల్‌ను పోలీసులు మార్గమధ్యంలోనే నిర్బంధించారు. కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, సీపీఎం ఎంపీ జాన్ బ్రిట్టాస్ వంటి ఇతర నేతలను కూడా అరెస్ట్ చేశారు. జంతర్ మంతర్ వద్ద సీజేపీ ఈ నిరసనకు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు ఢిల్లీ వ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేశారు. ఢిల్లీకి చేరుకున్న సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ డిప్కేను కూడా పోలీసులు నిర్బంధించారు. నగరంలో నిరసనలకు ఆంక్షలు అమలులో ఉన్నాయని, ఆందోళనకు ముందస్తు అనుమతి లేనందునే నేతలను అదుపులోకి తీసుకున్నట్టు ఢిల్లీ పోలీసులు తెలిపారు. ఓటర్ల జాబితా సవరణలతో పాటు ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతపై విపక్షాలు కొంతకాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ క్రమంలోనే ఎన్నికల కమిషన్ జవాబుదారీగా ఉండాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టాయి. ఈ అరెస్టుల నేపథ్యంలో భవిష్యత్తులో తమ ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని విపక్ష నేతలు సూచిస్తున్నారు.

## హైదరాబాద్ హైస్పీడ్ రైల్.. భూసేకరణపై కేంద్రం కీలక ప్రకటన

హైదరాబాద్ : హైదరాబాద్ కేంద్రంగా నిర్మించ తలపెట్టిన మూడు హైస్పీడ్ రైల్ కారిడార్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఈ ప్రాజెక్టులకు సంబంధించి ప్రస్తుతం అలైన్‌మెంట్ అధ్యయనాలు మాత్రమే జరుగుతున్నాయని, భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వాలకు ఎటువంటి ప్రతిపాదనలు పంపలేదని స్పష్టం చేసింది. ఈ దశలో హైస్పీడ్ రైల్ పేరుతో ఎవరైనా భూసేకరణకు పాల్పడితే అది చట్టవిరుద్ధం అవుతుందని స్పష్టం చేసింది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి శనివారం ఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశమయ్యారు. ఈ భేటీలో హైదరాబాద్-చెన్నై, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-పుణె హైస్పీడ్ రైల్ కారిడార్ల పురోగతిపై చర్చించారు. సమావేశం అనంతరం ఈ వివరాలను కిషన్ రెడ్డి 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా పంచుకున్నారు. "రైల్వే మంత్రి స్పష్టం చేసిన దాని ప్రకారం.. సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలకు ఎటువంటి భూసేకరణ అభ్యర్థనలు పంపలేదు. ఈ దశలో హైస్పీడ్ రైల్ పేరుతో జరుగుతున్న ఏ భూసేకరణ అయినా చట్టవిరుద్ధం" అని కిషన్ రెడ్డి తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రాజెక్టుల అలైన్‌మెంట్ ఖరారైన తర్వాతే ఆ వివరాలను రాష్ట్ర ప్రభుత్వాలతో, రైతులతో పంచుకోవడం జరుగుతుందని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో రైల్ కారిడార్లతో పాటు ఇతర ప్రాజెక్టుల కోసం భూసేకరణ ప్రయత్నాలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో కేంద్రం చేసిన ఈ ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రభుత్వ భూసేకరణ ప్రయత్నాలను కొందరు రైతులు వ్యతిరేకిస్తున్న తరుణంలో ఈ స్పష్టత రావడం గమనార్హం. మరోవైపు కిషన్ రెడ్డితో జరిగిన సమావేశంపై దక్షిణ మధ్య రైల్వే కూడా స్పందించింది. హైదరాబాద్‌ను మూడు ప్రధాన నగరాలతో అనుసంధానించే హైస్పీడ్ రైల్ కనెక్టివిటీకి సంబంధించిన ప్రతిపాదిత అలైన్‌మెంట్‌పై ఇరువురు మంత్రుల మధ్య ఉన్నత స్థాయి చర్చలు జరిగాయని సోషల్ మీడియాలో పేర్కొంది. ఇదిలా ఉండగా, భారతీయ రైల్వేలు 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను జూలై వరకు బడ్జెట్ కేటాయింపుల్లో రూ. 1.14 లక్షల కోట్లకు పైగా మూలధన వ్యయం చేసినట్లు ప్రభుత్వం గతంలో వెల్లడించింది. అలాగే, దేశీయ పరిజ్ఞానంతో రూపొందించిన 'కవచ్' ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ (ఏటీపీ) వ్యవస్థను 2,633 రూట్ కిలోమీటర్ల మేర ఏర్పాటు చేసినట్లు రైల్వే మంత్రి లోక్‌సభలో తెలిపారు.

## బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మలేదు

హైదరాబాద్: తెలంగాణలో భూముల విషయంలో బీఆర్ఎస్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు తిరస్కరించారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమర్థ పాలనపై విశ్వాసం ఉంచారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్లు గణనీయంగా పెరగడమే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై ఆయన 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందించారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఆగస్టు మధ్య కాలంలో వ్యవసాయ, వ్యవసాయేతర ఆస్తుల రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వ ఆదాయం భారీగా పెరిగిందని వివరించారు. గత ఏడాదితో పోలిస్తే స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం 21.86 శాతం వృద్ధి చెందిందని తెలిపారు. ఈ గణాంకాలే ప్రభుత్వ పనితీరుకు, సీఎం రేవంత్ రెడ్డి పాలనా సామర్థ్యానికి నిదర్శనమని స్పష్టం చేశారు. రాజకీయ లబ్ధి కోసం భూములపై బీఆర్ఎస్ చేసిన అసత్య ప్రచారాలను, ఆరోపణలను ప్రజలు నమ్మలేదని పొంగులేటి అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన భూ అక్రమాలను తమ ప్రభుత్వం వెలికితీస్తోందని తెలిపారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపుతూ, ప్రజలకు వివాదరహిత భూములను అందించేందుకు కృషి చేస్తున్నామని ఆయన వివరించారు.

### జగన్‌కు ఈడీ షాక్.. అక్రమాస్తుల కేసులపై

## హైకోర్టును ఆశ్రయించిన ఏజెన్సీ

అమరావతి: ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి సంబంధించిన అక్రమాస్తుల కేసుల విచారణను వేగవంతం చేయాలని కోరుతూ 'ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్' (ఈడీ) తెలంగాణ హైకోర్టును ఆశ్రయించింది. ఈ కేసుల్లో రోజువారీ విచారణ జరిపి, త్వరితగతిన పరిష్కరించేలా ఆదేశాలు ఇవ్వాలని ఈడీ తన పిటిషన్‌లో అభ్యర్థించింది. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ కేసులకు సంబంధించి ఈడీ దాఖలు చేసిన తొమ్మిది చార్జిషీట్లు దాదాపు దశాబ్ద కాలంగా సీబీఐ ప్రత్యేక కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని ఈడీ తెలిపింది. నిందితులు దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్లు పరిష్కారం కాకపోవడం వల్లే విచారణ ముందుకు సాగడం లేదని పేర్కొంది. విచారణకు జగన్‌తో పాటు ఇతర నిందితులంతా వ్యక్తిగతంగా హాజరయ్యేలా ఆదేశించాలని కూడా ఉన్నత న్యాయస్థానాన్ని కోరింది. గత కొన్నేళ్లుగా ఈ కేసుల్లో ప్రత్యేక కోర్టుల విచారణ, ఉన్నత న్యాయస్థానాల్లో సవాళ్లు వంటి పలు న్యాయపరమైన ప్రక్రియలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌పై తదుపరి విచారణ జరగాల్సి ఉంది.

## 13న విజయవాడకు రానున్న తమిళనాడు సీఎం విజయ్.. కారణమిదే!

అమరావతి: ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల మధ్య నెలకొన్న జల వివాదాల పరిష్కారం దిశగా కీలక ముందడుగు పడనుంది. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ఈ నెల 13న విజయవాడలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో సమావేశమై పలు కీలక అంశాలపై చర్చించనున్నారు. ప్రధానంగా తెలుగు గంగ ప్రాజెక్టు కింద కృష్ణా జలాల సరఫరాలో ఏర్పడిన లోటు, ఏపీ ప్రభుత్వం నిర్మించతలపెట్టిన డ్యామ్‌లు, నదుల అనుసంధానం వంటి అంశాలు ఈ భేటీలో ప్రస్తావనకు రానున్నాయి. తెలుగు గంగ ఒప్పందం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ ఏటా 12 టీఎంసీల కృష్ణా జలాలను తమిళనాడుకు రాష్ట్ర సరిహద్దు వద్ద అందించాల్సి ఉంది. అయితే, ఈ ఏడాది అక్టోబర్ 9 నాటికి కేవలం 2.251 టీఎంసీల నీరు మాత్రమే అందింది. ఒప్పందం ప్రకారం రావాల్సిన నీటికి, ఇప్పటివరకు అందిన నీటికి మధ్య 9.749 టీఎంసీల భారీ వ్యత్యాసం ఉంది. ఈ నీటి కొరత అంశమే ఇద్దరు ముఖ్యమంత్రుల భేటీలో ప్రధాన చర్చనీయాంశంగా మారనుంది. ఈ ఏడాదిలో మిగిలిన కాలానికి తమిళనాడు నీటి అవసరాలను సమీక్షించి, సరఫరాను గాడిన పెట్టేందుకు ఈ సమావేశం ఒక అవకాశంగా నిలవనుంది. కృష్ణా జలాల వాటాతో పాటు తమిళనాడులోకి ప్రవహించే నదులపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డ్యామ్‌లు నిర్మించేందుకు చేస్తున్న కసరత్తుపై కూడా సీఎం విజయ్ తన ఆందోళనలను చంద్రబాబు దృష్టికి తీసుకురానున్నారు. ఈ డ్యామ్‌ల నిర్మాణం వల్ల దిగువ రాష్ట్రమైన తమకు నీటి లభ్యతపై తీవ్ర ప్రభావం పడుతుందని తమిళనాడు భావిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రతిపాదిత డ్యామ్‌ల అంశం కూడా చర్చల ఎజెండాలో కీలకంగా ఉండనుంది. దీంతో పాటు నదుల అనుసంధానంపై కూడా ఇరు రాష్ట్రాల మధ్య సంప్రదింపులు జరిగే అవకాశం ఉంది. ఈ పర్యటనలో భాగంగా సీఎం విజయ్, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో పాటు ఇతర మంత్రులతో కూడా సమావేశం కానున్నారని సమాచారం. ఇరు రాష్ట్రాల రాజకీయ నాయకత్వాల మధ్య ప్రత్యక్ష చర్చల ద్వారా దీర్ఘకాలంగా ఉన్న నీటి సమస్యలకు ఒక పరిష్కారం కనుగొనాలని తమిళనాడు ప్రభుత్వం భావిస్తోంది. ఈ ఉన్నతస్థాయి సమావేశం తర్వాత వెలువడే నిర్ణయాలు రెండు రాష్ట్రాల మధ్య జల సంబంధాలపై స్పష్టతనిస్తాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

## సీఈసీ వివాదం: ప్రతిపక్షాల తీరుపై వెంకయ్యనాయుడు అసంతృప్తి

ఢిల్లీ: చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆందోళనలపై మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు స్పందించారు. విపక్షాలు అతిగా ప్రవర్తిస్తున్నాయని, రాజ్యాంగబద్ధ సంస్థలను రాజకీయ వివాదాల్లోకి లాగడం సరికాదని ఆయన హితవు పలికారు. దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లను తొలగించారంటూ వస్తున్న ఆరోపణలు కేవలం అపోహ మాత్రమేనని వెంకయ్యనాయుడు స్పష్టం చేశారు. నిరాధార ఆరోపణలతో సీఈసీ, ప్రధానమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం సమంజసం కాదన్నారు. "రాజీనామా కోరడం తప్పు కాదు, కానీ రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న వారిపై వ్యక్తిగత విమర్శలు చేయడం సరైన పద్ధతి కాదు" అని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల్లో గెలిస్తే తమ ఘనతగా చెప్పుకోవడం, ఓటమి పాలైతే ఈవీఎంలను నిందించడం కొన్ని పార్టీలకు అలవాటుగా మారిందని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్నికల సంఘం ఒక స్వతంత్ర సంస్థ అని, దానిని వీధుల్లోకి లాగడం దేశ ప్రతిష్టకు మంచిది కాదని అన్నారు. ఎన్నికల సంఘం సభ్యులంతా ఐక్యంగా ఉన్నామని చెబుతున్నా, ప్రతిపక్షాలు ఎందుకు ఆందోళన చేస్తున్నాయో అర్థం కావడం లేదని వెంకయ్యనాయుడు అభిప్రాయపడ్డారు.

## 'ఓట్ల దొంగతనం'పై రాష్ట్రపతి ఆధారం అడిగారా?.. రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ ఫైర్!

ఢిల్లీ: లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై 'జాతీయ ప్రజాస్వామ్య కూటమి' (ఎన్డీఏ) తీవ్రంగా స్పందించింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో జరిగిన భేటీ వివరాలను రాహుల్ గాంధీ వెల్లడించిన తీరుపై ఎన్డీఏ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. రాహుల్ చేసిన వ్యాఖ్యల వాస్తవికతను వారు ప్రశ్నించారు. శుక్రవారం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ నేతృత్వంలోని 'ఇండియా' కూటమి ప్రతినిధి బృందం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో భేటీ అయిన విషయం తెలిసిందే. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ నియామకంలో అవకతవకలు జరిగాయని, భారత ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ వారు రాష్ట్రపతికి ఒక వినతిపత్రం సమర్పించారు. భేటీ అనంతరం రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. 'ఓట్ల దొంగతనం' (ఓట్ చోరీ) ఆరోపణలకు సంబంధించి ఆధారాలు సమర్పించాలని రాష్ట్రపతి తమను కోరినట్లు తెలిపారు. ఈ వ్యాఖ్యలపై ఎన్డీఏ మండిపడింది. బీజేపీ ఎంపీ రాజీవ్ ప్రతాప్ రూడీ మాట్లాడుతూ, దేశ అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తితో జరిగిన సంభాషణ వివరాలను బహిరంగంగా వెల్లడించడం ఎంతవరకు సబబు? అని ప్రశ్నించారు. "రాష్ట్రపతితో ఏం చర్చించారో బయటపెట్టడం రాజ్యాంగ పదవి గౌరవానికి సంబంధించిన ఆందోళనలను రేకెత్తిస్తుంది. రాహుల్ గాంధీ చెబుతున్నవి అబద్ధం కూడా కావచ్చు. ప్రతిపక్ష నేతగా రాష్ట్రపతిని కలిసే హక్కు ఆయనకు ఉంది, కానీ ఆమె ఏం చెప్పారో వ్యాఖ్యానించే హక్కు లేదు" అని రూడీ అన్నారు. బిహార్ బీజేపీ అధ్యక్షుడు సంజయ్ సరౌగి కూడా విపక్షాల ఆరోపణలను తప్పుబట్టారు. "రాష్ట్రపతిని కలవడం రాజ్యాంగ హక్కే, కానీ మీరు ఏమైనా సాక్ష్యాలు సమర్పించారా? ఎన్నికల జాబితాల ప్రత్యేక సవరణ ప్రక్రియపై ఎలాంటి ఆధారాలు చూపలేదు. ఈ ప్రక్రియకు 150 రోజులు పడుతుంది. అభ్యంతరాల కోసం నెల రోజుల సమయం ఇస్తారు. దేశవ్యాప్తంగా 20 లక్షల పేర్లను తొలగించారు" అని ఆయన ప్రక్రియను వివరించారు. జేడీయూ జాతీయ అధికార ప్రతినిధి రాజీవ్ రంజన్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో అభిప్రాయాలు చెప్పే స్వేచ్ఛ ప్రతి పార్టీకి ఉంటుందని, అయితే విపక్షాలు తమ రాజకీయ వైఖరి, ప్రజలతో ఉన్న సంబంధంపై ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. ఈ ప్రతినిధి బృందంలో తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ, జమ్మూకశ్మీర్ మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లా, ఎన్సీపీ-ఎస్పీ ఎంపీ సుప్రియా సూలే, సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. బేబీ, ఆర్జేడీ ఎంపీ మనోజ్ కుమార్ ఝా, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా తదితరులు పాల్గొన్నారు. ఎన్నికల కమిషన్, ఎన్నికల జాబితాల సవరణ, ఎన్నికల ప్రక్రియలో అవకతవకలపై విపక్షాలు కొన్ని రోజులుగా నిరసన తెలుపుతున్న నేపథ్యంలో ఈ భేటీ జరిగింది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## వేలంలో ప్రధాని మోదీ జ్ఞాపికలు.. జాబితాలో ఏపీకి చెందిన 18 బహుమతులు

ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ వివిధ పర్యటనల సందర్భంగా అందుకున్న బహుమతులు, జ్ఞాపికలను కేంద్ర ప్రభుత్వం మరోసారి వేలానికి ఉంచింది. ఈసారి వేలంలో ఏపీకి చెందిన 18 ప్రత్యేక బహుమతులు కూడా ఉండటం విశేషం. ఈ వేలం ద్వారా సమీకరించిన నిధులను గంగానది ప్రక్షాళన కోసం చేపట్టిన ప్రతిష్ఠాత్మక 'నమామి గంగే' కార్యక్రమానికి విరాళంగా ఇవ్వనున్నారు. కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఈ ఈ-వేలం ప్రక్రియను నిర్వహిస్తోంది. ప్రధాని మోదీ తన ఏపీ పర్యటనల సమయంలో పలువురు ప్రముఖులు, సంస్థల నుంచి ఎన్నో కానుకలు స్వీకరించారు. వాటిలో 18 బహుమతులను ప్రస్తుతం వేలంలో ఉంచారు. వీటిలో ప్రధాని ఫొటోతో రూపొందించిన ప్రత్యేకమైన కలంకారీ వస్త్రం, శ్రీశైలంలోని శివాజీ స్ఫూర్తి కేంద్రం అందించిన జ్ఞాపిక, గ్రామీణ జీవనశైలిని ప్రతిబింబించే కళాఖండం, తెలుగు సంస్కృతికి ప్రతీకగా నిలిచే కొండపల్లి ఎద్దులబండి బొమ్మ వంటివి ఉన్నాయి. ఈ బహుమతులను దక్కించుకోవాలనుకునే వారు ఆన్‌లైన్‌లో బిడ్లు దాఖలు చేయవచ్చు. ఇది పీఎం మెమెంటోస్ 8వ విడత వేలం కాగా, ప్రజల నుంచి వస్తున్న స్పందన దృష్ట్యా గడువును అక్టోబరు 31 వరకు పొడిగించారు. ఈ వేలంలో దేశవిదేశాల నుంచి అందిన సుమారు 30 రకాల జ్ఞాపికలు ఉన్నాయి. వీటిలో కొన్నింటికి భారీ ధర పలుకుతోంది. తెలంగాణకు చెందిన కాకతీయ కళాతోరణం వెండి నమూనా ప్రాథమిక ధరను రూ.10 లక్షలుగా నిర్ణయించారు. అలాగే, జగన్నాథ పరివార రథం ప్రతిమ బేస్ ప్రైస్ రూ.21 లక్షలు కాగా, కర్ణాటకకు చెందిన శ్రీరాముడి వెండి విగ్రహానికి రూ.13.50 లక్షల ప్రాథమిక ధర ఉంది. వీటితో పాటు వివిధ ఆలయాలు, చారిత్రక ప్రదేశాల నమూనాలు, సంప్రదాయ చేతివృత్తుల కళారూపాలు, చిత్రాలు, పెయింటింగులు, విగ్రహాలు, శాలువాలు వంటి ఎన్నో అమూల్యమైన వస్తువులు ఈ వేలంలో అందుబాటులో ఉన్నాయి. ఆసక్తి ఉన్నవారు ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ జూఎఎవఎవత్‌శీం.స్త్రశీజ.అఅ ద్వారా తమకు నచ్చిన వస్తువుపై బిడ్ వేసి దక్కించుకోవచ్చని సాంస్కృతిక శాఖ అధికారులు తెలిపారు.

## బీసీ రిజర్వేషన్లపై చంద్రబాబు మోసం చేశారు: వైఎస్ జగన్

అమరావతి: స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు (బీసీ) 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న హామీ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దారుణంగా మోసం చేశారని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ధ్వజమెత్తారు. ఈ అంశంపై సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుతో చంద్రబాబు వైఖరి బహిర్గతమైందని విమర్శించారు. చంద్రబాబును 'మిస్టర్ 420'గా అభివర్ణించిన జగన్, ప్రతి వర్గాన్ని అబద్ధపు హామీలతో మభ్యపెట్టడం ఆయనకు అలవాటేనని 'ఎక్స్' వేదికగా విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి బీసీలను ఆకట్టుకుని, ఇప్పుడు వారిని వంచించారని జగన్ ఆరోపించారు. ఈ మోసానికి గాను చంద్రబాబు వెంటనే బీసీలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదే క్రమంలో సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీల అమలులో వైఫల్యం, గత ప్రభుత్వ సంక్షేమ పథకాల రద్దు, విద్యా దీవెన, వసతి దీవెన పథకాలకు సంబంధించి దాదాపు రూ. 9 వేల కోట్ల బకాయిలను నిలిపివేయడం వంటి అంశాలను జగన్ ప్రస్తావించారు. 143 హామీలతో కూడిన కూటమి మేనిఫెస్టో రాష్ట్ర చరిత్రలోనే అతిపెద్ద మోసమని ఆయన దుయ్యబట్టారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన రెండు జీవోలను అక్టోబర్ 1న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కొట్టివేసిన సంగతి తెలిసిందే. మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించరాదన్న నిబంధనను ఇది ఉల్లంఘిస్తోందని హైకోర్టు స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం రిజర్వేషన్లు పెంచుతున్నట్లు గత ఆగస్టు 18న ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన నేపథ్యంలో ఈ పరిణామాలు చోటు చేసుకున్నాయి.

### స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు ఖరారు..

## ఏపీ కేబినెట్ కీలక నిర్ణయం

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి బీసీ రిజర్వేషన్లపై చంద్రబాబు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. చంద్రబాబు అధ్యక్షతన ఈరోజు జరిగిన కేబినెట్ సమావేశంలో... రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ చేసిన సిఫార్సులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కేబినెట్ ఆమోదించిన వివరాల ప్రకారం... స్థానిక సంస్థల్లో వివిధ పదవులకు కొత్త బీసీ రిజర్వేషన్ల శాతాలను ఖరారు చేశారు. ఇందులో మేయర్లకు 35.29 శాతం, మున్సిపల్ ఛైర్‌పర్సన్లకు 33.02 శాతం, పట్టణ వార్డు సభ్యులకు 32.78 శాతం రిజర్వేషన్లు వర్తిస్తాయి. అలాగే, సర్పంచ్‌లకు 27.95 శాతం, ఎంపీటీసీలకు 25.55 శాతం, ఎంపీపీలు, జెడ్పీటీసీలకు 24.60 శాతం చొప్పున కోటా కేటాయించారు. జెడ్పీ ఛైర్‌పర్సన్లకు మాత్రం 23.08 శాతం రిజర్వేషన్లు అమలు చేయనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న ప్రభుత్వ ప్రతిపాదనను సుప్రీంకోర్టు తిరస్కరించిన నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. కోర్టు తీర్పును గౌరవిస్తూ, నిబంధనలకు అనుగుణంగా బీసీలకు లబ్ధి చేకూర్చేలా ఈ రిజర్వేషన్లను ఖరారు చేసినట్లు మంత్రులు తెలిపారు. గత ప్రభుత్వం అమలు చేసిన రిజర్వేషన్ల కన్నా ఇవి మెరుగ్గా ఉన్నాయని వారు పేర్కొన్నారు. చట్టపరంగా రిజర్వేషన్లు అందిస్తూనే, కూటమి పక్షాల మధ్య సీట్ల పంపకాల ద్వారా మొత్తం మీద 34 శాతం ప్రయోజనం బీసీలకు దక్కేలా చూస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## పర్యాటక ప్రగతిలో భాగస్వాములు అవ్వండి

హైదరాబాద్: తెలంగాణలోని ప్రకృతి అందాలకు మరింత ప్రాచుర్యం కల్పించడంతోపాటు పర్యావరణహిత పర్యాటకాన్ని మరింత అభివృద్ధి చేయడానికి ఐటీ సంస్థల తోడ్పాటు తీసుకోవడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో పలు ఐటీ కంపెనీల సీఈఓలు, ముఖ్య ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, సీఎస్ సంజయ్ జాజుతోపాటు అటవీ, పర్యాటకశాఖల ఉన్నధికారులు హాజరయ్యారు. వివిధ ఐటీ సంస్థల సీఈవోలు, ప్రముఖులు... రాజన్న(టీసీఎస్), కిరణ్ చెరుకూరి(హెచ్‌సీఎల్), చింతలపాటి శ్రీనిరాజు(ఐ ల్యాబ్స్), మమత మద్దిరెడ్డి(హెచ్‌ఎస్‌బీసీ), వినయ్ అగర్వాల్(టెక్ మహీంద్ర), రామ్‌కుమార్(జెన్‌ప్యాక్), చంద్రశేఖర్‌శర్మ(సీటీఆర్‌ఎల్‌ఎస్) తదితరులు పాల్గొన్నట్లు అటవీ శాఖ వెల్లడించింది. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి మాట్లాడుతూ... "తెలంగాణలో ఎకో, ఫారెస్ట్, టెంపుల్ టూరిజం అభివృద్ధిలో ఐటీ సంస్థలు భాగస్వాములు కావాలి. ఐటీ ఉద్యోగులు వారాంతాల్లో కుటుంబాలతో కలిసి పర్యాటక ప్రాంతాల్ని సందర్శించేలా ప్రోత్సహించాలి. ప్రాణహిత-చేవెళ్ల, కాళేశ్వరం ప్రాజెక్టులకు, కవ్వాల్, అమ్రాబాద్ టైగర్ రిజర్వులకు ప్రాచుర్యం కల్పించాలి. ఫ్యూచర్‌సిటీలో ఐటీ సంస్థలు, పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టాలి. డిసెంబరులో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ సదస్సులో భాగంగా దేశంలోని ప్రధాన నగరాల్లో రోడ్‌షోలు నిర్వహిస్తాం" అని తెలిపారు.

### ఇంటర్నెట్, సౌకర్యాల మెరుగుదల

అటవీ ప్రాంతాల్లో పర్యాటక సౌకర్యాల మెరుగుదల, ఇంటర్నెట్ కనెక్టివిటీ, డిజిటల్ వేదికల ద్వారా ప్రచారం చేయడం వంటి అంశాలపై ఐటీ సంస్థల ప్రతినిధులతో ప్రభుత్వం చర్చించింది. తెలంగాణలోని ఎకో టూరిజం ప్రాజెక్టులు, ప్రకృతి అందాలు, పర్యాటక ఆకర్షణలు, సందర్శకులకు అందుబాటులో ఉన్న అవకాశాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఐటీ కంపెనీల ప్రతినిధులకు అటవీశాఖ వివరించింది. ఈ సమావేశంలో అటవీ సంరక్షణ ప్రధాన అధికారి(పీసీసీఎఫ్, హెచ్‌ఓఎఫ్‌ఎఫ్) వినయ్ కుమార్, సీసీఎఫ్‌లు శరవణన్, ప్రియాంక వర్గీస్, క్షితిజ, పర్యాటకశాఖ డైరెక్టర్ రంజిత్‌నాయక్ పాల్గొన్నారు.

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy

లోకల్ గైడ్ ద్విభాషా దినపత్రిక


## నల్గొండ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గా బైరెడ్డి హేమలత వెంకటరెడ్డి.

నూతన పాలకవర్గానికి విషెస్ తెలిపిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి.



**నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి .లోకల్ గైడ్ :** నల్గొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గాన్ని నియమించినట్లు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని వెల్లడించారు.రాష్ట్రంలోని అన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీల ఛైర్మన్ పదవులను ఖరారు చేసిందని,అందులో భాగంగా, నల్గొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవిని ఓ సి (మహిళలు) కేటగిరీకి కేటాయించిందని పేర్కొన్నారు. ఈ కమిటీ ఈ ఉత్తర్వు జారీ చేసిన తేదీ నుంచి రెండు సంవత్సరాల పాటు లేదా తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యే వరకు అమలులో ఉంటుందని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా నూతన వ్యవసాయ మార్కెట్ పాలకవర్గానికి మంత్రి విషెస్ తెలిపారు. నల్గొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం జాబితా. 1. బైరెడ్డి హేమలత, భర్త వెంకట్ రెడ్డి(ఛైర్‌పర్సన్). 2. వడ్డేపల్లి శ్రీరాములు, తండ్రి కొండయ్య(వైస్ ఛైర్మన్). 3.తిరుమల రాము తండ్రి సత్తయ్య, సభ్యుడు. 4 .కత్తుల కృష్ణయ్య, తండ్రి లచ్చయ్య, సభ్యుడు. 5.పిన్నపురెడ్డి శ్రీనివాస్ రెడ్డి, తండ్రి లింగారెడ్డి,సభ్యుడు. 6.మర్రి నరసింహ, తండ్రి లింగయ్య,సభ్యుడు.7. వడ్డె దామోదర్ రెడ్డి, తండ్రి వెంకట్ రెడ్డి,సభ్యుడు. 8.షేక్ సయ్యద్, తండ్రి షేక్ నూర్మొహమ్మద్, సభ్యుడు. 9.గౌని నరేష్, తండ్రి రాములు,సభ్యుడు. 10.నల్గొండ రాణి లింగస్వామి, తండ్రి చిన్నరాములు, సభ్యురాలు. 11.పల్లెబోయిన లింగయ్య, తండ్రి నరసింహ,సభ్యుడు. 12.దేవిరెడ్డి లక్ష్మారెడ్డి, తండ్రి వెంకట్ రెడ్డి, సభ్యుడు. 13. చిట్టిపోలు నాగయ్య, తండ్రి నర్సయ్య,సభ్యుడు. 14 . గుండె రమేష్ బాబు, తండ్రి నర్సయ్య, సభ్యుడు. 15ఛైర్మన్, పిఎసిఎస్, తిప్పర్తి, నల్గొండ జిల్లాసభ్యుడు. 16.జిల్లా మార్కెటింగ్ అధికారి, బీట్ మార్కెట్, నల్గొండసభ్యుడు. 17 .సహాయ వ్యవసాయ సంచాలకులు, నల్గొండ సభ్యుడు. 18నగర మేయర్, నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్, సభ్యురాలు.

## దివ్యాంగ యువతి సోనీకి ఎమ్మెల్యే నవీన్ యాదవ్ చేయూతబిసర్టిఫికెట్ కోసం ఆర్థిక సాయం..

స్వయం ఉపాధికి రుణం ఇప్పిస్తానని హామీ

బిసోనీ కుటుంబానికి అండగా ఉంటానని భరోసా



**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 10 (లోకల్ గైడ్ ప్రతినిధి) :** ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ దివ్యాంగ యువతి సయ్యద్ సోనీకి ఆర్థిక సహాయం అందించారు. దివ్యాంగ ధ్రువీకరణ పత్రం పొందేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సోనీ పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే, తన సొంత ఖర్చులతో సహాయం చేసి ఆమెకు అండగా నిలిచారు.చాలా రోజులుగా దివ్యాంగ ధ్రువీకరణ పత్రం కోసం ఎదురుచూస్తున్న సోనీకి, దానికి సంబంధించిన ఖర్చులు చెల్లించే స్థోమత లేక ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నవీన్ యాదవ్ స్పందించి, తన సొంత డబ్బులతో ఆర్థిక సహాయం అందించి సర్టిఫికెట్ పొందేందుకు తోడ్పడ్డారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న సోనీకి ఈ సహాయం కొంత ఊరటనిచ్చింది.స్వయం ఉపాధి దిశగా ప్రోత్సాహంసోనీకి ఆర్థిక సహాయం అందించడంతో పాటు, ఆమె భవిష్యత్తులో స్వయం ఉపాధి పొందేలా ఎమ్మెల్యే ప్రోత్సహించారు. ఏదైనా చిన్న వ్యాపారం ప్రారంభించుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని సూచించారు. వ్యాపారం చేసేందుకు అవసరమైన రుణం కూడా ఇప్పించేందుకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. కష్టాల నుంచి బయటపడి కుటుంబానికి అండగా నిలవాలని సోనీకి భరోసా కల్పించారు. కుటుంబానికి అండగా ఉంటానని హామీసయ్యద్ సోనీకి లోకోమోటర్ వైకల్యం ఉండగా, ఆమె వైకల్యం శాతం 45గా కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డు ( యు డి ఐ డి)లో నమోదైంది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న దివ్యాంగ యువతికి తన వంతు సహాయం అందించడమే కాకుండా, ఆమె కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఎమ్మెల్యే నవీన్ యాదవ్ భరోసా ఇచ్చారు.దివ్యాంగ యువతికి తన సొంత ఖర్చులతో ఆర్థిక సహాయం అందించి, భవిష్యత్తులో వ్యాపారం ప్రారంభించేందుకు రుణం ఇప్పిస్తానని హామీ ఇవ్వడం ద్వారా సోనీ కుటుంబానికి అండగా నిలిచారు. దివ్యాంగులు, నిరుపేద కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అవసరమైన సహకారం అందించడం ప్రాధాన్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## జీడిమెట్ల డిపో టీజీఎస్ ఆర్టిసి ఎన్నికల్లో జాలిగం రాకేష్ ఘన విజయం

అధ్యక్షుడిగా అత్యధిక మెజార్టీ.. కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తానని హామీ



**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 10 (లోకల్ గైడ్ ప్రతినిధి) :** టి జి ఎస్ ఆర్ టి సి జీడిమెట్ల డిపోలో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్ష పదవికి పోటీ చేసిన జాలిగాం రాకేష్ ఘన విజయం సాధించారు. అత్యధిక మెజార్టీతో ఆయన విజయం సాధించడంతో డిపో పరిధిలోని కార్మికులు, అభిమానుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి.ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే డిపో ఆవరణలో సంబరాలు అంబరాన్నంటాయి. కార్మికులు, అభిమానులు బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచుకుని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. జాలిగాం రాకేష్‌కు పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా జాలిగాం రాకేష్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించిన ప్రతి కార్మికుడికి, డ్రైవర్‌కు, కండక్టర్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన అధ్యక్ష పదవిని బాధ్యతగా నిర్వహిస్తూ కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. డిపో అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తూ, కార్మికుల హక్కులు, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు.ఈ విజయం తన ఒక్కడిదే కాదని, తనపై విశ్వాసం ఉంచిన కార్మికులందరి విజయమని రాకేష్ అన్నారు. కార్మికుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వారి సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్, ఉద్యోగులు, కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వంగూరి వాచకం - నవరత్నాలు

1. మొక్కలు పక్కున నవ్వితే
ఇంపుగా పువ్వులు పూసేను
తీరొక్క పువ్వులు చక్కగా పేర్చితే
సొంపుగా బతకమ్మ వెలిసేను.

2.నోబెల్ పీస్ ప్రైజ్
రాలేదన్న బెంగతో కుంగుబాటు
నోబెల్ వార్ ప్రైజయినా
పొందాలన్న కాంక్షతో సర్దుబాటు.

3.బడాయి
వాలకం
లడాయి
నాటకం.

4.మనసుకెంతో
పసందు
చేరగానే
మన సందు.

5.దాచినది పాచిపోయి
కంపుతో కలవరపెట్టదా చెప్పు
రెప్ప చాటున దాచిన
కన్నీరు కలిగించునుగా ముప్పు.

6.ఎంత జటిల కార్యమైనా
పట్టుదలకు కట్టదా పట్టం
హనుమ కఠోర పరిశ్రమకు
జానకి జాడ వీడలేదా గుట్టు.

7.కొన్ని మరువకపోతే
ఫీల్ అవుతారు
కొన్ని మరిచిపోతే
ఫేలవుతారు.

8.కొందరికి
మధుమాసం
ఎందరికో
మధుమేహం.

9.కలలు లేని జీవితం
నిష్ఫలం
కలలే జీవితమైతే
దుర్భరం.

వంగూరి గంగిరెడ్డి
షాద్ నగర్
9652286270



## తాళ్లచెరువు పల్లె నుంచి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం వరకు..

# చిలుక పద్మావతి విజయ ప్రస్థానం!

అంకితభావం, కృషికి దక్కిన గుర్తింపు..

బ్లూ బెల్స్ హైస్కూల్‌కు గర్వకారణం

**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 10 (లోకల్ గైడ్ ప్రతినిధి) :** మారుమూల పల్లెటూరిలో జన్మించి, తన కృషి, పట్టుదలతో విద్యారంగంలో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న చిలుక పద్మావతి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపికయ్యారు. అచ్చంపేటలోని బ్లూ బెల్స్ హైస్కూల్‌లో ఉపాధ్యాయురాలిగా సేవలందిస్తున్న ఆమెకు ఈ గుర్తింపు లభించడం పాఠశాల వర్గాలతో పాటు కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల్లో ఆనందాన్ని నింపింది. అచ్చంపేట మండలం తాళ్లచెరువు గ్రామానికి చెందిన పద్మావతి ఉపాధ్యాయ వృత్తిని బాధ్యతగా భావిస్తూ విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తున్నారు. పాఠ్యాంశాలను సులభంగా అర్థమయ్యేలా బోధించడంతో పాటు, విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, సమయపాలన, మానవీయ విలువలను పెంపొందించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ప్రతి విద్యార్థిలోని ప్రతిభను గుర్తించి, వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు.విద్యార్థుల పట్ల అంకితభావం, బోధనలో నిబద్ధత, నిరంతర కృషికి గుర్తింపుగా ఆమె ఈ పురస్కారానికి ఎంపిక కావడం విశేషం. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చి విద్యారంగంలో ఉన్నత గుర్తింపు సాధించడం పలువురికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. పద్మావతి విజయానికి కుటుంబ సభ్యుల ప్రోత్సాహం కూడా తోడైంది.



చిలుక హనుమంతరావు, పెద్ద సంజీవరావు, చిన్న సంజీవరావు, లక్ష్మణరావు, అక్కలు అంజమ్మ, సునీత, బావ రామారావు, గర్నెపూడి అఖిల్, గర్నెపూడి మితిల్, చిలుక విజయ్, మ్యాక్స్ తదితరులు ఆమెకు అభినందనలు తెలియజేశారు.రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపిక కావడం బ్లూ బెల్స్ హైస్కూల్‌కు గర్వకారణమని పాఠశాల వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. తాళ్లచెరువు గ్రామానికి మంచి పేరు తీసుకొచ్చిన పద్మావతి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధిస్తూ, విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపాలని కుటుంబ సభ్యులు, తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు ఆకాంక్షిస్తున్నారు.

## బతుకమ్మకు బంగారు కానుక.. మాదారం ఆడబిడ్డలకు అండగా సర్పంచ్ ఉమా నరేష్!

రూ.15 వేల విలువైన 150 కిలోల బంతిపూల పంపిణీ..

నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు

**కారేపల్లి , అక్టోబర్ 10 (లోకల్ గైడ్ న్యూస్):** బతుకమ్మ పండుగను గ్రామ మహిళలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలనే ఉద్దేశంతో మాదారం సర్పంచ్ అజ్మీర ఉమా నరేష్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. గ్రామ ఆడబిడ్డలకు బతుకమ్మ కానుకగా రూ.15 వేల విలువైన 150 కిలోల బంతిపూలను అందించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా ఇప్పటికే 60 కిలోల పూలను అందించగా, చివరి రోజు వేడుకల కోసం మరో 90 కిలోల బంతిపూలను అందించనున్నారు. శనివారం సాయంత్రం రామాలయం ఎదురుగా ప్రారంభం కానున్న బతుకమ్మ వేడుకల్లో గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సర్పంచ్ కోరారు. బతుకమ్మలను ఏర్పాటు చేసుకునే మహిళలు బంతిపూల కోసం కుర్ర నర్మదను ఫోన్‌లో సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు

బతుకమ్మ వేడుకలతో పాటు నిమజ్జనం సందర్భంగా మహిళలు, గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సర్పంచ్ ఉమా




నరేష్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. బతుకమ్మల నిమజ్జనం జరిగే మాదారం చెరువు ప్రాంతాన్ని డోజర్ సహాయంతో శుభ్రం చేయించారు. మహిళలు సౌకర్యవంతంగా నిమజ్జన కార్యక్రమాల్లో పాల్గొనేలా చెరువు పరిసరాలను చదును చేయించి, అవసరమైన చోట్ల గ్రావెల్ వేయించారు. రాత్రి వేళల్లో నిమజ్జనం కోసం చెరువు వద్దకు వెళ్లే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక లైటింగ్ సదుపాయాలను ఏర్పాటు చేశారు. పండుగను సంతోషంగా జరుపుకోవడంతో పాటు నిమజ్జన సమయంలో ప్రజలకు అవసరమైన



సౌకర్యాలు కల్పించడంపై సర్పంచ్ ప్రత్యేక దృష్టి సారించారు. గ్రామ ఆడబిడ్డలకు బంతిపూల కానుక అందించడంతో పాటు, నిమజ్జన ప్రాంతాన్ని శుభ్రం చేయించి, రాత్రివేళల్లో వెలుతురు సదుపాయాలు కల్పించడం ద్వారా సర్పంచ్ అజ్మీర ఉమా నరేష్ బతుకమ్మ వేడుకల నిర్వహణకు ప్రత్యేక చొరవ చూపారు. గ్రామ మహిళలు, ప్రజలు సంతోషంగా పండుగను జరుపుకోవాలనే లక్ష్యంతో చేసిన ఈ ఏర్పాట్లు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## రాష్ట్రస్థాయి కబడ్డీ సమరానికి 'వర్షిణి' సిద్ధం!

అశ్వారావుపేటలో జరిగే జూనియర్

బాలికల పోటీల్లో జిల్లా ప్రాతినిధ్యం

గ్రామీణ ప్రాంతం నుంచి రాష్ట్రస్థాయికి

ఎదిగిన తిప్పర్తి కిరణం

హర్షం వ్యక్తం చేసిన ప్రధానోపాధ్యాయులు

పి. నరసింహ నాయక్,

వ్యాయామ ఉపాధ్యాయుడు లెనిన్ బాబు

**నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి .లోకల్ గైడ్ :** గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభకు సరైన ప్రోత్సాహం లభిస్తే వారు జాతీయ, రాష్ట్ర స్థాయిలలో సత్తా చాటుతారని తిప్పర్తి విద్యార్థిని జెర్రిపోతుల వర్షిణి మరోసారి నిరూపించింది. నల్గొండ జిల్లా తిప్పర్తి మండల కేంద్రంలోని పిఎం శ్రీ జెడ్ పి హెచ్ ఎస్ పాఠశాలలో చదువుతున్న వర్షిణి, తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల కబడ్డీ పోటీలకు ఎంపికైంది. ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపిక పోటీలలో ఆమె ప్రదర్శించిన అత్యుత్తమ రైడింగ్, డిఫెన్స్ మెళకువలు, శారీరక దారఢ్యం క్రీడాభిమానులను, నిర్వాహకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.దాంతో ఆమె రాష్ట్రస్థాయి జట్టులో చోటు దక్కించుకుంది.

**33 జిల్లాల క్రీడాకారుల మధ్య హోరాహోరీ పోరు.**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట ప్రాంగణంలో ఈ నెల



అక్టోబర్ 10 నుండి 13 వరకు నాలుగు రోజుల పాటు జరగనున్న జూనియర్ బాలికల రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో వర్షిణి పాల్గొననుంది. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న 33 జిల్లాల నుంచి అత్యంత ప్రతిభావంతులైన క్రీడాకారులు ఈ టోర్నమెంట్‌లో తలపడనుండగా, మన జిల్లా తరఫున వర్షిణి ముఖ్య భూమిక పోషించనుందని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు నిమ్మల లెనిన్ బాబు తెలిపారు. పాఠశాల స్థాయి నుంచే వర్షిణికి కబడ్డీపై ఉన్న ప్రత్యేక ఆసక్తి, నిరంతర సాధన ఈ స్థాయికి చేర్చాయని ఆయన కొనియాడారు.

**క్రీడల్లో రాణిస్తే బాసటగా నిలుస్తాం హెచ్‌ఎం పి. నరసింహ నాయక్.**

వర్షిణి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. నరసింహ నాయక్ ప్రత్యేక హర్షం వ్యక్తం చేశారు. వర్షిణిని పూలమాలలు, శాలువాతో ఘనంగా అభినందించిన



అనంతరం ఆయన మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం ఎంతో అభినందనీయమన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ వర్షిణి తన ప్రతిభతో ప్రతి ప్రత్యర్థిని చిత్తు చేసి, జిల్లాకు అలాగే పాఠశాలకు బంగారు పతకంతో గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు.

**పాఠశాల వ్యాప్తంగా పండుగ వాతావరణం**

తన ప్రతిభతో రాష్ట్రస్థాయికి ఎంపికైన వర్షిణిని సీనియర్ ఉపాధ్యాయులు దామోదర్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయ బృందం, తోటి విద్యార్థులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు ఆత్మీయంగా అభినందించారు. వర్షిణి విజయం తోటి విద్యార్థులలో నూతన ఉత్సాహాన్ని నింపిందని, క్రీడల పట్ల మరింత ఆసక్తి పెరిగేలా చేసిందని ఉపాధ్యాయులు తెలిపారు.

## జీడిమెట్ల డిపో టీజీఎస్ఆర్టీసీ ఎన్నికల్లో జాలిగం రాకేష్ విజయం

గౌరవ అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును

మర్యాదపూర్వకంగా కలిసిన రాకేష్




**కుందులాపూర్ అక్టోబర్ 10 (లోకల్ గైడ్ ప్రతినిధి) :** జీడిమెట్ల డిపో టీజీఎస్ఆర్టీసీ ఎన్నికల్లో గౌరవ అధ్యక్షుడిగా భారీ మెజార్టీతో విజయం సాధించిన జాలిగం రాకేష్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు శాలువాతో రాకేష్‌ను సత్కరించి, ఎన్నికల్లో విజయం సాధించినందుకు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ధర్మారెడ్డి, మిద్దెల బాల్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, పెప్సీ రాజు, ̆సుదర్శన్, రవి తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ సిబ్బందికి చీరలు , దుప్పట్ల పంపిణీ.. అన్నదాన కార్యక్రమం. శ్రీ వాసవి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో

19 వార్డ్ మున్సిపల్ కౌన్సిలర్ చిద్దిరాల అరుణ-జ్ఞానేశ్వర్





**లోకల్ గైడ్ అక్టోబర్ 10మహబూబాబాద్ :** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పేరాల కట్టయ్య ఫంక్షన్ హాల్‌లో శ్రీ వాసవి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులు.సిబ్బందికి వస్త్ర వితరణ మరియు అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో నిరంతరం శ్రమిస్తున్న సిబ్బంది సేవలను గుర్తించి ట్రస్ట్ సభ్యులు ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి మహబూబాబాద్ టౌన్ సీఐ రఘుపతి రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వినోద్ కుమార్, మరియు 19 వార్డ్ మున్సిపల్ కౌన్సిలర్ చిద్దిరాల అరుణ-జ్ఞానేశ్వర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం అతిథుల చేతుల మీదుగా మున్సిపాలిటీ మహిళా సిబ్బందికి చీరలు, పురుష సిబ్బందికి దుప్పట్లు (బెడ్ షీట్లు) తో పాటు చేతి సంచులను అందజేశారు. సుమారు 150 మందికి పైగా కార్మికులకు వీటిని పంపిణీ చేయడంతో పాటు, విచ్చేసిన వారందరికీ భోజన సదుపాయం (అన్నదానం) ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. బతకమ్మ సంబరాలలో సమయంలో . కరోనా వంటి విపత్కర సమయాల్లో సైతం ప్రాణాలకు తెగించి ప్రజారోగ్యాన్ని కాపాడిన మున్సిపల్ కార్మికుల సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. సమాజంలో వారి శ్రమను గుర్తించి గౌరవిస్తూ ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని శ్రీ వాసవి సేవా ట్రస్ట్ ప్రతినిధులను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు, ప్రతినిధులు మరియు మున్సిపల్ సిబ్బంది తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పెద్దపల్లిలో బీజేపీకి పెరుగుతున్న ఆదరణ

ఎస్టీ మోర్చా ఆధ్వర్యంలో పలువురు యువకులు బీజేపీలో చేరిక



**పెద్దపల్లి: అక్టోబర్, 10:(లోకల్ గైడ్ ) :** భారతీయ జనతా పార్టీ ఎస్టీ మోర్చా ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు కర్రీ సంజీవారెడ్డి సమక్షంలో జిల్లాలోని పలు గ్రామాలకు చెందిన యువకులు బీజేపీ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు నూతనంగా చేరిన యువకులకు కాషాయ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం, యువతకు మెరుగైన భవిష్యత్తు కల్పించడమే లక్ష్యంగా బీజేపీ ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని, ఆ ప్రభావంతోనే వివిధ గ్రామాల నుంచి యువకులు బీజేపీ వైపు ఆకర్షితులవుతున్నారని పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, యువతను పెద్ద సంఖ్యలో పార్టీలోకి ఆహ్వానిస్తామని నాయకులు తెలిపారు. రానున్న రోజుల్లో పెద్దపల్లి నియోజకవర్గంలో బీజేపీ మరింత బలపడటమే కాకుండా, ప్రజల మద్దతుతో బీజేపీ జెండా ఎగురవేస్తామనే ధీమాను నాయకులు వ్యక్తం చేశారు. యువత చేరికతో పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొందని పేర్కొన్నారు.

## కారేపల్లిలో కరువైన పురోహితులు!

ముగ్గురి మృతితో తీవ్ర కొరత..
పూజలకు ముందస్తు బుకింగ్ తప్పనిసరి



**కారేపల్లి, అక్టోబర్ 10 (లోకల్ గైడ్ న్యూస్):** ఖమ్మం జిల్లా కారేపల్లి మండలంలో పురోహితుల కొరత రోజురోజుకూ పెరుగుతోంది. స్వల్ప వ్యవధిలో ముగ్గురు పురోహితులు మృతిచెందడంతో పలు గ్రామాల్లో పూజా కార్యక్రమాల నిర్వహణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అందుబాటులో ఉన్న కొద్దిమంది పురోహితులపైనే ప్రజలు ఆధారపడాల్సి వస్తోంది. వివాహాలు, గృహప్రవేశాలు, నామకరణాలు, వ్రతాలు, పితృకార్యాలు, ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు పురోహితుల అవసరం ఉంటుంది. అయితే వారి సంఖ్య తగ్గడంతో శుభకార్యాల కోసం ముందుగానే సంప్రదించి సమయం ఖరారు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఒకే రోజు పలు కార్యక్రమాలు ఉన్నప్పుడు నిర్ణీత సమయానికి పూజలు నిర్వహించడం కష్టంగా మారుతోంది. వయసు పైబడిన పురోహితులు అనారోగ్య సమస్యలతో సేవలకు దూరమవడం, కొత్త తరం యువత ఈ వృత్తిపై ఆసక్తి చూపకపోవడం కొరతకు ప్రధాన కారణాలుగా స్థానికులు పేర్కొంటున్నారు. గతంలో కుటుంబ వారసత్వంగా కొనసాగిన పురోహిత వృత్తిలోకి ప్రస్తుతం కొత్తవారు రావడం తగ్గిందని చెబుతున్నారు.

యువతకు శిక్షణ ఇవ్వాలి

పురోహితుల కొరతను అధిగమించేందుకు యువతకు వేద, ఆగమ విద్యలో శిక్షణ అందించాలని భక్తులు కోరుతున్నారు. ఈ వృత్తిలోకి వచ్చే యువతను ప్రోత్సహించడంతోపాటు సమీప ప్రాంతాల్లోని పురోహితులతో సమన్వయం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. సకాలంలో పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు సంబంధిత వర్గాలు దృష్టి సారించాలని కోరుతున్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సామా రామ్మోహన్ రెడ్డిని కలిసిన వాసిరెడ్డి నరేష్



**గండిపేట, అక్టోబర్ 10 (లోకల్ గైడ్):** రంగారెడ్డి--హైదరాబాద్--మహబూబ్‌నగర్ పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఉన్న సామా రామ్మోహన్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ (మీడియా అండ్ కమ్యూనికేషన్స్) వాసిరెడ్డి నరేష్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సామా రామ్మోహన్ రెడ్డి నివాసానికి వెళ్లిన వాసిరెడ్డి నరేష్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఆయనను కలుసుకున్నారు. ఈ భేటీలో ఇరువురూ ఆత్మీయంగా ముచ్చటించుకున్నారు.

## వికారాబాద్ జిల్లాలో కేంద్రంలో తీవ్ర ఉద్రిక్తత..

జైదుపల్లి మురళి గృహ నిర్బంధం,

- జిల్లా కేంద్రం లో ఎన్‌టీఆర్ చౌరస్తా వద్ద భారీ పోలీసు మోహరింపు

- కొత్త గడి కి సవాలకు సవాల్ గా బయలుదేరిన మురళి చందనం బ్రదర్స్ దగ్గర పోలీస్ అరెస్ట్




**(లోకల్ గైడ్)వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** జిల్లా లో కాంగ్రెస్ బిఆర్ఎస్ పార్టీ రాజకీయాల్లో ఒక్కసారిగా తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. స్థానిక రాజకీయ పరిణామాల నేపథ్యంలో అధికార/ప్రతిపక్ష నాయకుల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు తీవ్ర రాజకీయ దుమారానికి దారితీశాయి. సవాల్‌తో రేగిన హీట్: బిఆర్ఎస్ నాయకుడు అశోక్ విసిరిన సవాల్ కు సవాలుగా వికారాబాద్ రాజకీయ వర్గాల్లో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. సరిగ్గా ఉదయం 9 గంటలకు వికారాబాద్‌లోని ఎన్‌టీఆర్ చౌరస్తాకు రావాలంటూ ఆయన సవాల్ విసిరారు. ఇంటి వద్దే గృహనిర్బంధం ఈ సవాల్‌ను స్వీకరించి, ఎన్‌టీఆర్ చౌరస్తాకు బయలుదేరేందుకు మాజీ కౌన్సిలర్ జైదుపల్లి మురళి కొత్తగడి కి సిద్ధమైన వికారాబాద్ చందన బ్రదర్స్ దగ్గర పోలీసులు అరెస్టు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ఘర్షణలు తలెత్తకుండా శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా జైదుపల్లి మురళి నివాసాన్ని పోలీసులు చుట్టుముట్టి, ఆయనను ఇంటి వద్దే అడ్డుకుని గృహనిర్బంధం చేశారు. హైటెన్షన్ వాతావరణం:ఈ పరిణామంతో జైదుపల్లి మురళి నివాస ప్రాంతంలో ఒక్కసారిగా హైటెన్షన్ వాతావరణం నెలకొంది. ఎలాంటి ఉద్రిక్తతలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీగా మోహరించి పరిస్థితిని అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. పోలీస్ గట్టి బందోబస్తు : మరోవైపు, ఎన్‌టీఆర్ చౌరస్తా మరియు ప్రధాన రహదారుల వద్ద కూడా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. అనుమానాస్పద కదలికలను నిశితంగా పరిశీలిస్తూ, రాకపోకలపై నిఘా ఉంచారు. ఈ తాజా పరిణామాలు వికారాబాద్ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

## సింగరేణికి ప్రత్యేక ఏఎంసీ.. రాందాస్ నాయక్ కృషికి రైతుల కృతజ్ఞతలు!

41 గ్రామ పంచాయతీల రైతులకు ప్రయోజనం..
వ్యవసాయ అభివృద్ధికి కొత్త దారి




**కారేపల్లి, అక్టోబర్ 10 (లోకల్ గైడ్ న్యూస్):** సింగరేణి మండలానికి ప్రత్యేక వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) మంజూరు కావడంపై మండల ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయానికి కృషి చేసిన వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌కు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటివరకు ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో ఉన్న సింగరేణి మండలానికి ప్రత్యేక మార్కెట్ కమిటీ ఏర్పాటు చేయడం స్థానిక రైతులకు కీలక ముందడుగుగా నిలవనుంది. మండల రైతుల అవసరాలను గుర్తించి ప్రత్యేక ఏఎంసీ ఏర్పాటుకు చొరవ చూపిన ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌పై ప్రజలు ప్రశంసలు వ్యక్తం చేస్తున్నారు.

41 గ్రామ పంచాయతీల రైతులకు ప్రయోజనం

సింగరేణి మండలంలోని 41 గ్రామ పంచాయతీల పరిధిలోని రైతులకు ప్రత్యేక వ్యవసాయ మార్కెట్ కమిటీ అందుబాటులోకి రావడం వల్ల పంటల కొనుగోలు, విక్రయాలకు మెరుగైన సౌకర్యాలు లభించే అవకాశం ఉంది. వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గడంతో పాటు, రైతులకు మార్కెట్ సేవలు మరింత చేరువయ్యే అవకాశం ఉందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పంటల విక్రయాలు, మార్కెట్ సదుపాయాల వినియోగంలో వెసులుబాటు కలగనుంది. స్థానికంగా వ్యవసాయ మార్కెట్ వ్యవస్థ బలోపేతమైతే రైతులకు ప్రయోజనం చేకూరడంతో పాటు మండల వ్యవసాయ రంగ అభివృద్ధికి దోహదపడుతుందని భావిస్తున్నారు.

మండల అభివృద్ధికి ఎమ్మెల్యే చొరవ

సింగరేణి మండల అభివృద్ధితో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ కావడం కూడా ముఖ్యమని మండల ప్రజలు పేర్కొంటున్నారు. రైతుల అవసరాలకు ప్రాధాన్యం ఇస్తూ ప్రత్యేక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఏర్పాటుకు కృషి చేసిన ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రత్యేక ఏఎంసీ ఏర్పాటు సింగరేణి మండల రైతుల ఆర్థిక అభివృద్ధికి దోహదపడాలని, రైతులకు మెరుగైన మార్కెట్ సదుపాయాలు అందుబాటులోకి రావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. మండల అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి భవిష్యత్తులోనూ ఇదే విధంగా ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్యేను కోరారు.

## పారిశుద్ధ్యం ప్రజల హక్కు.. నిర్లక్ష్యం ఇక సహించరాదు!

చెత్త కుప్పలు, మూసుకుపోయిన డ్రైనేజీలతో ప్రజారోగ్యానికి ముప్పు.. జవాబుదారీతనంతోనే పరిశుభ్రమైన పట్టణాల నిర్మాణం

ప్రజారోగ్యమే ప్రగతికి పునాది -- పారిశుద్ధ్య నిర్వహణలో మున్సిపల్ యంత్రాంగం బాధ్యతాయుతంగా వ్యవహరించాలి




పరిశుభ్రమైన పరిసరాలు ప్రతి పౌరుడి హక్కు. ఆరోగ్యకరమైన జీవనానికి అవి పునాది. పట్టణాల అభివృద్ధికి నిజమైన కొలమానం ఎత్తైన భవనాలు, విశాలమైన రహదారులు మాత్రమే కాదు.. చెత్తలేని వీధులు, సక్రమంగా పనిచేసే డ్రైనేజీ వ్యవస్థ, పరిశుభ్రమైన ప్రజా ప్రదేశాలు కూడా. ప్రజలు చెల్లించే పన్నులకు ప్రతిఫలంగా మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించడం మున్సిపల్ పాలనలో కీలక బాధ్యత. అయితే చెత్త నిర్వహణలో లోపాలు, మురుగునీటి సమస్యలు, కాలువల శుభ్రతలో నిర్లక్ష్యం వంటి అంశాలు పట్టణ ప్రజలకు ఇబ్బందులు కలిగించే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో పారిశుద్ధ్య వ్యవస్థ పనితీరుపై సమగ్ర సమీక్ష అవసరం.

చెత్త కుప్పలు.. ప్రజారోగ్యానికి ముప్పు

వీధులు, ఖాళీ స్థలాలు, రహదారుల పక్కన చెత్త పేరుకుపోవడం పట్టణాల్లో ప్రధాన సమస్యగా మారుతోంది. చెత్తను సకాలంలో తొలగించకపోతే దుర్వాసన, ఈగలు, దోమల పెరుగుదలకు అనుకూల పరిస్థితులు ఏర్పడవచ్చు. వర్షాకాలంలో కాలువలు పూడుకుపోవడం, మురుగునీరు రోడ్లపై నిలిచిపోవడం వల్ల స్థానికులు రాకపోకల్లో ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. ఇటువంటి పరిస్థితులు కొనసాగితే ప్రజారోగ్యంపై ప్రతికూల ప్రభావం పడవచ్చు. అందువల్ల పారిశుద్ధ్యాన్ని కేవలం వీధులను శుభ్రం చేయడానికి పరిమితం చేయకూడదు. చెత్త ఉత్పత్తి నుంచి సేకరణ, వేరు చేయడం, రవాణా, శాస్త్రీయ నిర్వహణ వరకు ప్రతి దశలో సమర్థవంతమైన వ్యవస్థ ఉండాలి. సమస్యలు తలెత్తిన తర్వాత స్పందించడం కంటే ముందస్తు చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

వార్డుల వారీగా పనితీరుపై సమీక్ష ఏదీ?

ప్రతి వార్డులో రోజువారీ చెత్త సేకరణ సక్రమంగా జరుగుతోందా? తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరిస్తున్నారా? చెత్త తరలించే వాహనాలు అందుబాటులో ఉన్నాయా? డ్రైనేజీల శుభ్రతకు నిర్దిష్ట కార్యాచరణ ఉందా? పారిశుద్ధ్య కార్మికుల కొరత ఉంటే దాని పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? ఈ ప్రశ్నలకు మున్సిపల్ యంత్రాంగం స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలి. అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించాలి. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, వాటి పరిష్కారానికి గడువులు విధించాలి. చేపట్టిన పనులు కాగితాలపై పూర్తయినట్లు చూపించడం కాకుండా, క్షేత్రస్థాయిలో ఫలితాలు కనిపించేలా పర్యవేక్షణ ఉండాలి. ప్రజల నుంచి అందే ఫిర్యాదులను నమోదు చేసి, వాటి పరిష్కార స్థితిని తెలియజేసే పారదర్శక వ్యవస్థను బలోపేతం చేయాలి.

నిధుల ఖర్చుపై పారదర్శకత అవసరం

పారిశుద్ధ్య నిర్వహణకు కేటాయించే నిధులు, కార్మికుల వేతనాలు, వాహనాల నిర్వహణ, ఇంధన వ్యయం, పరికరాల కొనుగోలు, చెత్త తరలింపు వంటి అంశాల్లో పారదర్శకత అత్యంత ముఖ్యం. ఏ వార్డుకు ఎంత నిధులు కేటాయించారు? ఎంత ఖర్చు చేశారు? ఆ ఖర్చుతో ప్రజలకు ఎలాంటి సేవలు అందాయి? కాంట్రాక్టు పనులు నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం జరుగుతున్నాయా? అనే అంశాలను అధికారులు సమీక్షించాలి. ప్రజాధనం వినియోగంపై తగిన రికార్డులు అందుబాటులో ఉండాలి. అవసరమైన చోట సామాజిక తనిఖీలు, పనుల నాణ్యత పరిశీలన చేపట్టాలి. నిధుల వినియోగాన్ని కేవలం వ్యయ వివరాల ఆధారంగా కాకుండా, సేవల నాణ్యత, సమస్యల పరిష్కారం, ప్రజలకు కలిగిన ప్రయోజనాల ఆధారంగా కూడా అంచనా వేయాలి.

పారిశుద్ధ్య కార్మికుల భద్రతకు ప్రాధాన్యం

పట్టణాలను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకం. వారి సేవలను గుర్తించడంతోపాటు, తగిన రక్షణ పరికరాలు, చేతి తొడుగులు, పాదరక్షలు, అవసరమైన పనిముట్లు అందించాలి. ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేయాల్సి వచ్చినప్పుడు భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలి. యంత్రాల ద్వారా చేయగల పనులను యాంత్రీకరించడం, కార్మికులకు అవసరమైన శిక్షణ కల్పించడం కూడా ముఖ్యం. కార్మికుల సంక్షేమం, భద్రతను విస్మరించి పరిశుభ్రమైన పట్టణాలను నిర్మించడం సాధ్యం కాదు. వారి సమస్యలను పరిష్కరించడంతోపాటు, పనిభారం, సిబ్బంది లభ్యత, పని పరిస్థితులపై నిరంతర సమీక్ష జరగాలి.

ప్రజల భాగస్వామ్యమూ అవసరమే

పారిశుద్ధ్యం మున్సిపల్ సంస్థల బాధ్యత అయినప్పటికీ, ప్రజల సహకారం లేకుండా ఆశించిన ఫలితాలు సాధించడం కష్టం. రోడ్లపై చెత్త వేయకపోవడం, తడి--పొడి చెత్తను వేరు చేయడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, కాలువల్లో వ్యర్థాలు వేయకుండా ఉండటం ప్రతి పౌరుడి బాధ్యత. వ్యాపార సంస్థలు, నివాస సంఘాలు, విద్యాసంస్థలు కూడా స్థానిక పారిశుద్ధ్య నిబంధనలను పాటించాలి. అయితే ప్రజలపై బాధ్యతను నెట్టివేసి మున్సిపల్ యంత్రాంగం తన బాధ్యత నుంచి తప్పించుకోకూడదు. చెత్త సేకరణకు తగిన సమయాలు, స్పష్టమైన మార్గదర్శకాలు, ఫిర్యాదుల పరిష్కారానికి అందుబాటులో ఉండే వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ప్రజల సహకారాన్ని పొందేందుకు అవగాహన కార్యక్రమాలు నిరంతరం నిర్వహించాలి.

సమస్యలపై ప్రకటనలు కాదు.. ఫలితాలు ముఖ్యం

పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించడం, పరిశుభ్రతపై ప్రతిజ్ఞలు చేయించడం, ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టడం అవసరమే. కానీ వాటి ప్రభావం ఎంతకాలం కొనసాగుతుందన్నదే అసలు ప్రశ్న. ఒకరోజు శుభ్రం చేసిన ప్రాంతంలో మరుసటి రోజే చెత్త పేరుకుపోతే, ఆ కార్యక్రమం ఉద్దేశం నెరవేరినట్లు కాదు. రోజువారీ పర్యవేక్షణ, బాధ్యతల స్పష్టమైన కేటాయింపు, ఫిర్యాదుల పరిష్కారం, పనితీరుపై సమీక్షకు ప్రాధాన్యం ఇవ్వాలి. మున్సిపల్ పాలక సంస్థలు ప్రతి వార్డుకు పారిశుద్ధ్య కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, దాని అమలును ప్రజలకు తెలియజేయాలి. సమస్యలు పునరావృతమయ్యే ప్రాంతాలను గుర్తించి శాశ్వత పరిష్కారాలపై దృష్టి సారించాలి. అధికారుల పనితీరును కొలిచే ప్రమాణాలు స్పష్టంగా ఉండాలి.

ముగింపు

పారిశుద్ధ్యం ఒకరోజు నిర్వహించే ప్రత్యేక కార్యక్రమం కాదు.. ప్రతిరోజూ కొనసాగాల్సిన ప్రజాసేవ. పరిశుభ్రమైన పరిసరాలు ప్రజారోగ్యాన్ని కాపాడటంతోపాటు పట్టణ జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తాయి. ఇందుకోసం మున్సిపల్ యంత్రాంగం జవాబుదారీతనంతో పనిచేయాలి. నిధుల వినియోగంలో పారదర్శకత పాటించాలి. పారిశుద్ధ్య కార్మికుల భద్రతను నిర్ధారించాలి. ప్రజల ఫిర్యాదులకు సకాలంలో స్పందించాలి. పట్టణాల అభివృద్ధి ప్రకటనల్లో కాకుండా ప్రజల నిత్యజీవితంలో కనిపించాలి. చెత్త కుప్పలు లేని వీధులు, మురుగునీరు నిల్వ ఉండని రహదారులు, సక్రమంగా పనిచేసే పారిశుద్ధ్య వ్యవస్థ ప్రజలకు అందినప్పుడే పాలన ఫలితవంతమైనదని చెప్పగలం. పరిశుభ్రమైన పట్టణం ప్రజల హక్కు.. దానిని సాధ్యం చేయడం మున్సిపల్ పాలన బాధ్యత. ప్రజారోగ్య పరిరక్షణలో నిర్లక్ష్యానికి తావులేకుండా, జవాబుదారీతనంతో కూడిన నిరంతర పారిశుద్ధ్య నిర్వహణే లక్ష్యంగా ముందుకు సాగాలి.

వనం రామకృష్ణ,
ఉత్తమ సీనియర్ జర్నలిస్ట్ అవార్డ్ గ్రహీత,
మేడ్చల్ జిల్లా ప్రతినిధి,
లోకల్ గైడ్ తెలుగు దినపత్రిక ఓ మీడియా.

## బతుకమ్మ వేళ.. సింగరేణి ప్రజలకు గుడిపూడి తిరుమల రావు శుభాకాంక్షలు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణే బతుకమ్మ పండుగ ప్రత్యేకత..
ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్ష



**కారేపల్లి, అక్టోబర్ 10 (లోకల్ గైడ్ న్యూస్):** బతుకమ్మ పండుగ సందర్భంగా సింగరేణి మండల ప్రజలందరికీ కాంగ్రెస్ నాయకులు గుడిపూడి తిరుమల రావు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, మహిళల ఐక్యతకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రజలంతా ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా తిరుమల రావు మాట్లాడుతూ, బతుకమ్మ తల్లి ఆశీస్సులతో ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. తొమ్మిది రోజుల పాటు జరిగే బతుకమ్మ వేడుకల్లో మహిళలు, ఆడపడుచులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొనాలని పేర్కొన్నారు. సింగరేణి మండలంలోని ప్రతి గ్రామం అభివృద్ధి, సమృద్ధితో ముందుకు సాగాలని, ప్రజల మధ్య ప్రేమాభిమానాలు, ఐక్యత మరింత బలపడాలని గుడిపూడి తిరుమల రావు ఆకాంక్షించారు.

## ఈ నెల 12న మణికొండలో ఆవోపా ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

ముఖ్య అతిథిగా మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి హాజరు




**గండిపేట, అక్టోబర్ 10 (లోకల్ గైడ్):** దసరా పండుగను పురస్కరించుకొని ఆవోపా (ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) నార్సింగి సర్కిల్ మణికొండ డివిజన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 12న బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించనున్నట్లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలు సోమవారం సాయంత్రం 5 గంటలకు మణికొండలోని అల్కాపురి టౌన్‌షిప్, రోడ్ నంబర్ 4లో ఉన్న స్వామి వివేకానంద పార్క్‌లో జరగనున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకురాలు పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కార్తీక్ రెడ్డి, పార్టీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ, ఆవోపా రాష్ట్ర అధ్యక్షుడు మాలిపెద్ది శంకర్ హాజరుకానున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ సందర్భంగా సామూహిక బతుకమ్మ వేడుకలతో పాటు మహిళలకు ప్రత్యేకంగా బతుకమ్మల పోటీలు నిర్వహించనున్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు మొదటి, రెండో, మూడో బహుమతులతో పాటు ప్రత్యేక బహుమతులు అందజేయనున్నారు. మొత్తం సుమారు రూ.30 వేల విలువైన బహుమతులను ప్రదానం చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. మహిళల్లోని సృజనాత్మకతను ప్రోత్సహించడం, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించి భావితరాలకు అందించడం, ప్రకృతి ప్రాధాన్యతను చాటిచెప్పడం ఈ వేడుకల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు, తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. మణికొండ, పుప్పాలగూడ, నెక్నాంపూర్, అల్కాపురి టౌన్‌షిప్ పరిసర ప్రాంతాల మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ సంబరాలను, పోటీలను విజయవంతం చేయాలని ఆవోపా మణికొండ మహిళా విభాగం అధ్యక్షురాలు స్నేహ, కార్యదర్శి మహాలక్ష్మి, కోశాధికారి దేవి ప్రియ కోరారు. ఖమ్మం నగర అభివృద్ధి పనులను దశల వారీగా అన్నీ పూర్తి చేస్తాం... రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రూ.1.55 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లు, సీసీ డ్రైన్ల ప్రారంభం ఇప్పటి వరకు సుమారు రూ.5 కోట్ల విలువైన అభివృద్ధి పనులు పూర్తి, మిగిలిన చిన్న, చిన్న పనులను కూడా త్వరలో చేపడతాం

RNI NO. APBIL/2013/50718
LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్
ద్విభాషా దినపత్రిక



## రూ. 70 కోట్లతో పోలేపల్లి గ్రామంలో అభివృద్ధి పనులు...

రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి

పోలేపల్లి లో రూ. 4.65 కోట్లతో బిటి రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి





**ఖమ్మం, అక్టోబర్ -10: లోకల్ గైడ్ :** ఖమ్మం రూరల్ మండల పరిధిలోని పోలేపల్లి గ్రామంలో అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలలో భాగంగా రూ. 4.65 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న రెండు నూతన బిటి రోడ్ల నిర్మాణ పనులకు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. ఇందులో రూ. 2.42 కోట్ల అంచనా వ్యయంతో పోలేపల్లి నుండి దానవాయిగూడెం (వయా మున్నేరు) వరకు, రూ. 2.20 కోట్ల అంచనా వ్యయంతో పోలేపల్లి నుండి రామునిపేట వరకు బీటీ రోడ్ల నిర్మాణాలు వున్నాయి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యమిస్తున్నదని తెలిపారు. సన్న బియ్యం పంపిణీ, ఉచిత విద్యుత్ (200 యూనిట్లు), ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు వంటి అనేక కార్యక్రమాలు విజయవంతంగా అందిస్తున్నామన్నారు. పోలేపల్లి ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రాబోయే కొద్ది రోజుల్లోనే నూతన రేషన్ డీలర్‌ను ఏర్పాటు చేస్తామని మంత్రి అన్నారు. అర్హులైన ప్రతి పేదవానికి విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని మంత్రి తెలిపారు. ప్రభుత్వ స్కూల్ లో స్థల సమస్య ఉన్నందున, సమీపంలో అనువైన ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి పిల్లలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నూతన స్కూల్ భవనాన్ని నిర్మిస్తామని మంత్రి తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాల అమలకు కట్టుబడి ఉన్నామని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, హౌసింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, పిఆర్ ఈఈ మహేష్ బాబు, స్థానిక సర్పంచ్ బత్తిని మహేష్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం నగర అభివృద్ధి పనులను దశల వారీగా అన్నీ పూర్తి చేస్తాం...

రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రూ.1.55 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లు, సీసీ డ్రైన్ల ప్రారంభం

ఇప్పటి వరకు సుమారు రూ.5 కోట్ల విలువైన అభివృద్ధి పనులు పూర్తి, మిగిలిన చిన్న, చిన్న పనులను కూడా త్వరలో చేపడతాం

పుట్టపాక నుంచి రాజన్నపేట వరకు రహదారి నిర్మాణానికి చర్యలు

నాణ్యతా ప్రమాణాలతో పనులు చేపట్టి ప్రజలకు మెరుగైన మౌళిక వసతులు కల్పించాలి



**ఖమ్మం, అక్టోబర్ 10: లోకల్ గైడ్: :** ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని 9, 12, 13, 14వ డివిజన్లలో రూ.1.55 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లను రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ నగరంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఇప్పటివరకు సుమారు రూ. 5 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఇంకామిగిలి ఉన్న చిన్న, చిన్న పనులను కూడా రానున్న రోజుల్లో చేపట్టి పూర్తి చేస్తామని పేర్కొన్నారు. నగరంలో మౌళిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, ఖమ్మం నగరంలోని అన్ని డివిజన్లలో ప్రజలకు అవసరమైన మౌళిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీ సౌకర్యాలు అందుబాటులోకి తీసుకు వచ్చేలా అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. మిగిలి ఉన్న చిన్న, చిన్న పనులను కూడా గుర్తించి దశల వారీగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని, నిర్మాణాల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని మంత్రి సూచించారు. ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం కలిగేలా పనులు పూర్తి చేయాలని తెలిపారు. పుట్టపాక-రాజన్నపేట రహదారి నిర్మాణానికి చర్యలు: పుట్టపాక నుంచి రాజన్నపేట వరకు రహదారి నిర్మాణానికి పంచాయతీరాజ్ శాఖ ద్వారా నిధులు మంజూరు చేయించి, పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటా మని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో ఇంకా చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించి, వాటి వివరాలను సుడా చైర్మన్ పువ్వాడ దుర్గాప్రసాద్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మిగిలిన పనులను కూడా ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని తెలిపారు.

మత సామరస్యానికి ప్రతీకగా ఖమ్మం నగరం:

ఖమ్మం నగరంలో హిందూ, ముస్లిం, క్రైస్తవ మతాలకు చెందిన ప్రజలంతా సుఖ సంతోషాలతో, పరస్పర సోదరభావంతో కలిసి మెలిసి జీవించేలా నగరాన్ని తీర్చిదిద్దేందుకు తన వంతు కృషి చేస్తున్నానని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పేర్కొన్నారు. ప్రజలందరూ ఐకమత్యంతో ఉంటూ, నగర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. అన్ని వర్గాల ప్రజలు ప్రశాంతంగా, ఆనందంగా జీవించే వాతావరణాన్ని మరింత బలోపేతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## శేరిలింగంపల్లి టిఆర్ఎస్ ఇన్చార్జి వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ ఆధ్వర్యంలో

-సీపీఎం, ఎంసీపీఐ(యు) పార్టీలకు షాక్.. టిఆర్ఎస్ లోకి భారీ చేరికలు

-గూడా లావణ్య, గూడా శ్రీనివాస్ లకు కండువా కప్పి పార్టీలోకి

-ఆహ్వానించిన రాష్ట్ర అధ్యక్షురాలు.. కల్వకుంట్ల కవిత





**శేరిలింగంపల్లి, అక్టోబర్ 10 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ):** శేరిలింగంపల్లి మండలంలోని తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) పార్టీకి భారీ ఊపు వచ్చింది. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో గూడా లావణ్య, గూడా శ్రీనివాస్, వారి అనుచరులు పెద్ద ఎత్తున సీపీఎం, ఎంసీపీఐ(యు) పార్టీలను వీడి తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) పార్టీలో చేరారు. టిఆర్ఎస్ ఈ చేరికల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఉమ్మడి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జి వాసిలి చంద్ర శేఖర్ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్వయంగా నూతనంగా చేరిన గూడా లావణ్య, గూడా శ్రీనివాస్ లకు పార్టీ కండువాలు కప్పి ఘనంగా తెలంగాణ రక్షణ సేన పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వాసిలి చంద్ర శేఖర్ ప్రసాద్ మాట్లాడుతూ.. తెలంగాణ రక్షణ సేన పార్టీ సిద్ధాంతాలు, రాష్ట్ర అధ్యక్షురాలు కవిత నాయకత్వంలో ప్రజల కోసం చేస్తున్న పోరాటాలకు ఆకర్షితులై నేడు సీపీఎం, ఎంసీపీఐ(యు) వంటి ప్రధాన పార్టీల నుండి నాయకులు తమ పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. ఈ చేరిక స్థానిక రాజకీయాలలో ఒక ముఖ్యమైన పరిణామమని, శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి, క్షేత్రస్థాయిలో క్యాడర్ ను విస్తరించడానికి ఈ చేరికలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో తెలంగాణ రక్షణ సేన సత్తా చాటుతుందని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతామని స్పష్టం చేశారు. కొత్తగా చేరిన నాయకులకు పార్టీలో సముచిత గౌరవం, ప్రాధాన్యత కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా స్వర్గీయ రాగం సుజాత యాదవ్ జయంతి వేడుకలు

-మెగా బతుకమ్మ సంబరాలు..

విద్యార్థులకు మెమెంటోలు, సర్టిఫికెట్ల ప్రధానం

-మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్





**శేరిలింగంపల్లి, అక్టోబర్ 10 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ):** శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని చందానగర్ డివిజన్ లో గల పిజెఆర్ స్టేడియంలో రాగం సుజాత నాగేందర్ యాదవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వర్గీయ రాగం సుజాత యాదవ్ జయంతిని పురస్కరించుకుని మెగా బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ముఖ్య అతిథులుగా మాజీ ఎంపీ, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, రాష్ట్ర యాదవ కురుమ కో-ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ ఎం.రఘునాథ్ యాదవ్, ఉమెన్ కమిషన్ మాజీ చైర్పర్సన్ త్రిపురాన వెంకటరత్నం, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.జగదీశ్వర్ గౌడ్, హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్, చందానగర్ సీఐ శ్రీధర్, పురప్రముఖులు హాజరయ్యారు. తొలుత స్వర్గీయ రాగం సుజాత యాదవ్ చిత్రపటానికి నివాళులర్పించి, దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేసి, భారీ బతుకమ్మ వద్ద జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుమారు 5వేల మందికి పైగా విద్యార్థినులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సీనియర్ నాయకులు రంగురంగుల బతుకమ్మలతో ఆటపాటలు, కోలాటాలతో సందడి చేశారు. రాష్ట్ర యువజన నాయకులు రాగం అనిరుధ్ యాదవ్, వారి సతీమణి రాగం జాగృతి సాయి యాదవ్, రాగం అభిషేక్ యాదవ్ పాల్గొని బతుకమ్మ ఆడి విద్యార్థుల్లో జోష్ నింపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ.. మే 9, 1996 నుండి 30 ఏళ్ల పాటు జీవితంలో తోడుగా నిలిచిన సుజాత లేరనే బాధ మాటల్లో చెప్పలేనిదని, ఆమెకు ఇష్టమైన బతుకమ్మను జయంతి రోజున ఘనంగా నిర్వహించడం ఆత్మశాంతినిస్తుందని, మిగిలిన జీవితం ప్రజాసేవకే అంకితమని భావోద్వేగంగా అన్నారు. అనంతరం బతుకమ్మలో పాల్గొన్న విద్యార్థినులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా మెమెంటోలు, సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. వి.హనుమంతరావు విద్యార్థులతో కలిసి బతుకమ్మ డీజే స్టెప్పులు వేసి సందడి చేశారు. 5 వేల మందితో కార్యక్రమాన్ని నిర్వహించిన రాగం నాగేందర్ యాదవ్ ను కొనియాడుతూ ఈ సంబరాలు గిన్నిస్ బుక్ లో నమోదైనా ఆశ్చర్యం లేదన్నారు. రాగం నాగేందర్ యాదవ్ తరలివచ్చిన ప్రతి ఒక్కరికీ బతుకమ్మ శుభాకాంక్షలు, కృతజ్ఞతలు తెలిపారు. శేరిలింగంపల్లి మండల రికగ్నైజ్డ్ ప్రైవేట్ స్కూల్స్ కరస్పాండెంట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ లియోన్ ఏ.ఆర్.పవన్ కుమార్, వారి బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపి అసోసియేషన్ అభివృద్ధికి రూ.1 లక్ష చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని యువ నాయకులు రాగం అనిరుధ్ యాదవ్ స్పాన్సర్ చేయగా, లయన్ ఏ.ఆర్.పవన్ కుమార్ ఆధ్వర్యంలోని శేరిలింగంపల్లి మండల రికగ్నైజ్డ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో మిరియాల రాఘవరావు, కొండల్ రెడ్డి, శ్రీనివాస్ రాజ్ ముదిరాజ్, మిరియాల ప్రీతం, జి.రవీందర్ రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## మూసీ బాధితులకు అండగా బీఆర్ఎస్ పార్టీ

పేదల భూములు లాక్కుంటే ఉద్యమం చేపడతాం: బీఆర్ఎస్ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి



**గండిపేట, అక్టోబర్ 10 (లోకల్ గైడ్):** మూసీ సుందరీకరణ పేరుతో పేదల భూములను స్వాధీనం చేసుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని రాజేంద్రనగర్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ఆరోపించారు. శనివారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని హిమాయత్ సాగర్ గ్రామంలో భూ బాధితులతో ఆయన సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ.. పేదల భూములను తీసుకోవడం తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మూడున్నరేళ్లు గడుస్తున్నా ప్రజలకు న్యాయం చేయలేకపోయిందని ఆరోపించారు. మూసీ సుందరీకరణ పేరుతో పేదల భూములను స్వాధీనం చేసుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెరతీస్తే బీఆర్ఎస్ పార్టీ తరపున పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. మూసీ అభివృద్ధి కోసం భూములు తీసుకోవాల్సి వస్తే బాధితులకు న్యాయబద్ధమైన పరిహారంతో పాటు, తగిన నష్టపరిహారాన్ని అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధితులు రెండు సంవత్సరాలు ఓపిక పట్టాలని, భూ సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. తిరిగి కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రేమ్ కుమార్ గౌడ్, ఆర్. నాగరాజు, మాజీ సర్పంచ్ ఆంజనేయులు, సుభానితో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతులకు శుభవార్త

శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు నీటి విడుదల

పంటలను ఆదుకుంటాం రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయ రమణారావు



**పెద్దపల్లి జిల్లా అక్టోబర్ 10 (లోకల్ గైడ్ ) :** ప్రస్తుత వర్షాకాలం పంటలకు గాను శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు నుండి నీటిని నిజామబాద్ జిల్లా పోచంపాడు వద్ద విడుదల చేయడం జరిగింది. రేవెల్లి డిస్ట్రిబ్యూటరీ నుండి డి-86,డి- 83 మెయిన్ కెనాల్ ల ద్వారా పెద్దపల్లి నియోజకవర్గంలోని పంటలకు సోమవారం వరకు శ్రీరామ్ సాగర్ నీరు అందుతుందని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు తెలిపారు. ఎలినోవ ప్రభావంతో సాగునీరు సమస్య ఎదుర్కొంటున్న ప్రస్తుత తరుణంలో పంటలను ఎలాగైనా కాపాడాలనే దృఢ నిశ్చయంతో ప్రాజెక్టు ద్వారా నీటి విడుదలకు కృషి చేయడం జరిగిందని చెప్పారు. పంటలు చేతికి వచ్చేవరకు తమ ప్రయత్నాలు కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే కోరారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పొదుపుగా సాగునీటిని వాడుకోవాలని కోరారు.నీటి విడుదలకు సహకరించిన మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు కు విజయ రమణారావు కృతజ్ఞతలు తెలిపారు.

## జిల్లా ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

జిల్లా అభివృద్ధి, ప్రజల సంక్షేమంలో బీఆర్ఎస్ పాత్ర మరువలేనిది: నాయకులు




**పెద్దపల్లి: అక్టోబర్, 10:(లోకల్ గైడ్ ) :** బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లా ఏర్పాటుకు సంబంధించిన ప్రాధాన్యతను, జిల్లా అభివృద్ధిలో ప్రజల ఆకాంక్షలను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, పెద్దపల్లి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ దాసరి మమత తదితర ప్రముఖులు పాల్గొన్నారు. నాయకులు జిల్లా ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, పెద్దపల్లి జిల్లా మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ స్ఫూర్తితో ఏర్పడిన జిల్లాల ప్రాధాన్యతను గుర్తుచేస్తూ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగాలని నాయకులు పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా ప్రజల ఐక్యత, అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ వేడుకల్లో పాల్గొని జిల్లా పట్ల తమ అభిమానాన్ని, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని చాటుకున్నారు. జిల్లా ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.

## సీరతున్ నబీ పరీక్ష రాసి ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్ల పంపిని

కౌన్సిలర్ గౌస్ జానీ ఆధ్వర్యంలో అంజుమన్ ఫంక్షన్ హాల్ లో సర్టిఫికెట్లు పంపిణి

ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి

జామే నిజామియా నుంచి విచ్చేసిన మౌల్వీలు



**( లోకల్ గైడ్ షాద్ నగర్ )** : రంగారెడ్డి జిల్లా షాద్నగర్ పట్టణం లోని అంజుమన్ ఫంక్షన్ హాల్ లో సిరతున్ నబీ పరీక్ష రాసి ఉత్తీర్ణులైనటువంటి వారికి ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి చేతుల మీదుగా విద్యార్థినీ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేయడం జరిగింది. ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ..విద్యార్థిని,విద్యార్థులు మహమ్మద్ ప్రవక్త ఆచరించి అమలుపరిచిన విధానాలు వారి యొక్క అడుగుజాడల్లో నడిచి ప్రతి ఒక్కరూ సమాజ శ్రేయస్సు పై తోడ్పడాలని విద్యార్థులకు తెలిపారు. ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి తన వంతు సహాయ సహకారాలు పూర్తిగా అందిస్తానని గౌస్ జానీ మరి ఎన్నో కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఒకటో వార్డు కౌన్సిలర్ గౌస్ జానీ,మాజీ కౌన్సిలర్ నందకిషోర్,మైనారిటీ నేతలు మహమ్మద్ జావేద్ ఆగజ్, సోషల్ వర్కర్ ఆలియా సుల్తానా, మదర్సా టీచర్ ఆమెనా ఫాతిమా, తల్లిదండ్రులు, విద్యార్థిని,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ముత్తూట్ ఫైనాన్స్ లో ఖాతాదారుల ఆందోళన.. బంగారం ఇవ్వకుండా వేధింపులు

రుణం పూర్తిగా చెల్లించినా ఆభరణాలు ఇవ్వని వైనం.. పండుగ వేళ మహిళల ఆవేదన

బంగారం ఉందని నమ్మకం లేదని బాధితుని అవేదన




**శేరిలింగంపల్లి, అక్టోబర్ 10 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ):** శేరిలింగంపల్లి మండలంలోని చందానగర్ లో గల ముత్తూట్ గోల్డ్ లోన్ శాఖ ఎదుట శుక్రవారం ఖాతాదారులు ఆందోళన చేపట్టారు. తమ బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టి తీసుకున్న రుణానికి సంబంధించిన పూర్తి నగదు చెల్లించినప్పటికీ, తమ ఆభరణాలను తిరిగి ఇవ్వడంలో బ్రాంచ్ సిబ్బంది, మేనేజర్ తీవ్ర జాప్యం చేస్తున్నారని పలువురు ఖాతాదారులు ఆరోపించారు. బాధిత ఖాతాదారుడు తెలిపిన వివరాల ప్రకారం ఇలా ఉన్నాయి.. తాను మణప్పురంలో గోల్డ్ లోన్ తీసుకున్నానని, రీపేమెంట్ కోసం ఆన్ లైన్ లో ఫోన్ పే ద్వారా చెల్లింపులు చేశానని చెప్పాడు. గత నెల 26వ తేదీన రూ.1 లక్ష చెల్లించానని, 27వ తేదీన రెండు సార్లు.. ఒకటి తన ఫ్యామిలీ మెంబర్ ఫోన్ నుండి, మరొకటి తన మొబైల్ నుండి మరో రూ.1 లక్ష చెల్లించానని వెల్లడించాడు. అయితే తన మొబైల్ నుండి చెల్లించిన రూ.1 లక్ష ఇప్పటివరకు క్రెడిట్ కాలేదని, ఈ విషయంపై మేనేజర్ ను రెండు, మూడు సార్లు కలిసినా సరైన స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. “హెడ్ ఆఫీస్ తో మాట్లాడుతాను, చూస్తాము” అంటూ మేనేజర్ ఇర్రెగ్యులర్ సమాధానం చెబుతున్నారని, వాట్సాప్ లో స్క్రీన్ షాట్లు, ఫోన్ పే కన్ఫర్మేషన్ మెసేజ్, రిసీప్టులు పెట్టినా కనీసం రిప్లై కూడా ఇవ్వడం లేదని బాధితుడు మండిపడ్డాడు. శుక్రవారం శాఖ ఎదుట గొడవ పెడితేనే అప్పుడు అప్డేట్ చేశారని, ఇప్పుడు కూడా రిమైనింగ్ పేమెంట్ ఉందని, టైం పడుతుందని చెబుతున్నారని, బంగారం ఉందని చెబుతున్నా తనకు నమ్మకం లేదని వాపోయాడు. పండుగల సమయంలోనూ ఆభరణాలు తిరిగి ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మహిళా ఖాతాదారులు ఆవేదన వ్యక్తం చేశారు. రుణం పూర్తిగా చెల్లించిన తర్వాత కూడా నిబంధనల పేరుతో కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ఈ సమస్యపై మణప్పురం ఉన్నతాధికారులు వెంటనే స్పందించి తమ బంగారు ఆభరణాలను ఇప్పించాలని, బాధ్యులైన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఖాతాదారులు డిమాండ్ చేశారు.

## కొత్తగూడ ఓల్డ్ విలేజ్‌లో 60 గజాలలో అక్రమంగా ఐదంతస్తుల నిర్మాణం

-అనుమతులు లేకుండా భవనం నిర్మిస్తున్న వ్యాపారవేత్తపై

-టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల డిమాండ్



**శేరిలింగంపల్లి, అక్టోబర్ 10 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ):** శేరిలింగంపల్లి మండలంలోని కొత్తగూడ ఓల్డ్ విలేజ్‌లో అక్రమ నిర్మాణం జోరుగా సాగుతోంది. కల్లు కాంపౌండ్ ఎదురుగా శ్రీకాంత్ అనే వ్యాపారవేత్త కేవలం 60 గజాల స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఐదంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సిఎంసీ నిబంధనల ప్రకారం 60 గజాల స్థలంలో ఒకటి లేదా రెండు అంతస్తులకు మాత్రమే అనుమతి ఉంటుంది. అయితే అధికారులను మేనేజ్ చేసుకుని, నిబంధనలకు విరుద్ధంగా ఐదంతస్తుల భారీ భవనాన్ని నిర్మిస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అక్రమ నిర్మాణం వల్ల పక్క ఇళ్లకు గాలి, వెలుతురు లేకుండా పోతోందని, పార్కింగ్ సమస్యలు తలెత్తుతున్నాయని వాపోతున్నారు. ఇంత చిన్న స్థలంలో ఇంత పెద్ద భవనం నిర్మిస్తే భవిష్యత్తులో కూలిపోయే ప్రమాదం ఉందని, దీని వల్ల చుట్టుపక్కల నివాసితుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పలుమార్లు టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వారు విమర్శిస్తున్నారు. కాబట్టి సిఎంసీ టౌన్ ప్లానింగ్ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, సదరు అక్రమ నిర్మాణాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, అనుమతులు లేకపోతే వెంటనే కూల్చివేత చర్యలు తీసుకోవాలని కొత్తగూడ ఓల్డ్ విలేజ్ గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలుస్తున్న బతుకమ్మ పండుగ

పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ




పెద్దపెల్లి జిల్లా అక్టోబర్ 10 (లోకల్ గైడ్) ప్రకృతి ఆరాధనకు, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తోందని ఇండియన్ పబ్లిక్ పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ అన్నారు. సుల్తానాబాద్ పట్టణంలోని స్థానిక ఇండియన్ పబ్లిక్ పాఠశాలలో శుక్రవారం ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పూలతో బతుకమ్మలను పేర్చి ప్రకృతిని ఆరాధించడం తెలంగాణ సంస్కృతిలో ప్రత్యేకతను చాటుతుందన్నారు. బతుకమ్మ పండుగ మహిళల్లో ఐక్యతను పెంపొందించడంతో పాటు ప్రకృతి పట్ల ప్రేమ, పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను తెలియజేస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే మన సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని తెలుసుకొని వాటిని భావితరాలకు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో సందడి చేశారు. పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సునీత, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 30 ఏళ్లుగా తీరని మంచినీటి సమస్య!

- అధికారుల నిర్లక్ష్యంతో గ్రామస్తుల అవస్థలు.
- ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం.
- స్పందించకుంటే లోకాయుక్త, మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు.



**లోకల్ గైడ్/బంట్వారం:** వికారాబాద్ జిల్లా బంట్వారం మండలం సల్బత్తాపూర్ గ్రామంలో గత 30 ఏళ్లుగా మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కావలి నర్సిములు ఆవేదన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యపై పలుమార్లు జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించకపోవడం దారుణమని విమర్శించారు.

ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా ఫలితం ఏది

జిల్లా, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్యను పట్టించుకోకపోవడంతో గ్రామస్తులు తీవ్ర నిరాశకు గురవుతున్నారని నర్సిములు పేర్కొన్నారు. ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా పరిష్కారం లభించకపోతే ఇక ఎవరిని ఆశ్రయించాలని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. అమావాస్య రోజే విద్యుత్ పనులపై అభ్యంతరం. మరోవైపు శనివారం పెత్తర అమావాస్య సందర్భంగా ఇళ్లను, బట్టలను శుభ్రం చేసుకునే సమయంలో విద్యుత్ కోతలు ఉండటంతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గ్రామంలో విద్యుత్ బల్బుల ఏర్పాటు పనులను అదే రోజు చేపట్టడంపై గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. మిగతా రోజుల్లో ఈ పనులు ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. సమస్య పరిష్కరించకుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సల్బత్తాపూర్‌లో మంచినీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో లోకాయుక్త, మానవ హక్కుల సంఘాన్ని ఆశ్రయించి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

## మనసంస్కృతి,సంప్రదాయలను కాపాడుకుందాం

ప్రిన్సిపాల్ రామకృష్ణ



**నారాయణపేట అక్టోబర్ 10:** తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను కాడుకోవాలని నారాయణపేట సాయి జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్ రామకృష్ణ అన్నారు. నారాయణపేట జిల్లా కేంద్రంలోని శ్రీ సాయి కో-ఆపరేటివ్ జూనియర్ కళాశాల విద్యార్థులకు కల్చరల్ ఫెస్ట్, బతుకమ్మ ఫెస్ట్‌ను ఘనంగా నిర్వహిం చారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, పాటలు బతుకమ్మ సంప్రదాయ పాటలతో పాటు వివిధ కళా ప్రదర్శనలు ఇచ్చి వేడుకను రంగరంగులుగా మార్చారు. బతుకమ్మ పండుగ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు సాంప్రదాయ వేషధారణలో పాల్గొని ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ కార్యక్ర మంలో కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ , అధ్యాపక బృందం సభ్యులు రఘు పతి రెడ్డి,రవి బాబు, కృష్ణయ్య, బాలు రాజు, వెంకట్ రెడ్డి, రాజశేఖర్, రాయుడు, చంద్రశేఖర్, ఉమా మహేశ్వరి పాల్గొని విద్యార్థులను ప్రోత్సహిం చారు. ప్రిన్సిపాల్ రామకృష్ణ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపి, సాంస్కృతిక విలువలు, సంప్రదాయాల పరిరక్షణపై విద్యార్థులకు సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమం విజయ వంతంగా జరిగినందుకు కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు అందరికీ అభినందనలు తెలియ జేశారు.

## పబ్లిక్ హెల్త్ ప్రోగ్రామ్ కింద అవుట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**నారాయణపేట అక్టోబర్ 10:**నారాయణపేట జిల్లా లో జాతీయ ఆయుష్ మిషన్ కింద పబ్లిక్ హెల్త్ ప్రోగ్రామ్ అమలులో భాగం గా వివిధ పోస్టులను అవు ట్‌సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దర ఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎంపిక కమిటీ ఒక ప్రకటనలో తెలియజేసింది.

భర్తీ చేయనున్న పోస్టులు

1. ఆయుష్ మెడికల్ ఆఫీసర్ -- 3 పోస్టులు -- నెలకు ?40,000. 2. ఫార్మసిస్ట్ -1 పోస్ట్ -నెలకు ?15,000. 3. సైకోసోషియల్ కౌన్సిలర్ -- 1 పోస్టు -- ఒక్కో సెషన్‌కు ?500 ( సంవత్సరానికి కనీసం 200 సందర్శనలు, ఆన్-కాల్ ప్రాతిపదికన). 4. యోగా ప్రొఫెషనల్ -- 1 పోస్టు -- నెలకు ?28,000. 5. మల్టీ పర్పస్ వర్కర్ (పురుష) -- 2 పోస్టులు -- నెలకు ?15,000. వయోపరిమితి: 01-07-2026 నాటికి కనీస వయస్సు 18 సంవత్సరాలు, గరిష్ఠ వయస్సు 44 సంవత్సరాలు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వర్తించే వయో సడలింపులు, రిజర్వేషన్లు అమలు చేయబడతాయి.దరఖాస్తుల స్వీకరణ తేదీలు:లి 12-10-2026 నుంచి 22-10-2026 వరకు, పని దినాల్లో ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించబడతాయి. లిదరఖాస్తు సమర్పించే విధానం:లి అభ్యర్థులు సంబంధిత పోస్టుకు నిర్దేశించిన దరఖాస్తు ఫారాన్ని పూర్తిగా నింపి, నోటిఫికేషన్‌లో పేర్కొన్న అర్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలు, అవసరమైన ఇతర పత్రాల గెజిటెడ్ అధికారి ధ్రువీకరించిన ప్రతులను జతచేయాలి. దరఖాస్తులను స్వయంగా లేదా రిజిస్టర్డ్ పోస్టు ద్వారా సమర్పించవచ్చు.దరఖాస్తుల స్వీకరణ చిరునామా: జిల్లా వైద్య మరియు ఆరోగ్య కార్యాలయంసింగారం గేట్‌నారాయణపేట509210లిముఖ్య గమనిక:లి చివరి తేదీ 22-10-2026 తర్వాత అందిన దరఖాస్తులు స్వీకరించబడవు. పోస్టులకు సంబంధించిన అర్హతలు, ఎంపిక విధానం, ఇతర నిబంధనల కోసం అభ్యర్థులు అధికారిక నోటిఫికేషన్‌ను పరిశీలించాలి.అర్హత కలిగిన అభ్యర్థులు నిర్ణీత గడువులో దరఖాస్తులు సమర్పించాలని కోరడమైనది.

## బనదేశ్వరునికి భక్తుల పూజలు...

ప్రతి ఆలయంలో అమావా స్య ప్రత్యేక పూజలు

**నారాయణపేట అక్టోబర్ 10:నారాయణపేట జిల్లా కేంద్రం సరిహద్దులో ఉన్న**



కళ బెళగుందె బనదేశ్వర స్వామి దేవాలయంలో స్వామివారికి అమావాస్య పూజలు వైభవంగా నిర్వ హించారు ఈసందర్భంగా నిర్వాహకులు స్వామి వారికి సుప్రభాతసేవా బిల్వర్చన రుద్రాభిషేకం అష్టోత్తరపూజలు మహా అలంకరణ నైవేద్యం మహా మంగళ హారతి సర్వ దర్శనం భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. మహిళలు భక్తులు పరిసర ప్రాంత ప్రజలు స్వామి వారిని దర్శించుకునీ ప్రత్యేక పూజలు నిర్వహించా రు.అలాగే జిల్లా కేంద్రంలో మండలాల్లో అమావాస్య ప్రత్యేక పూజలు నిర్వహిం చి పలు ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

# హైదరాబాద్ ఫార్మా సామ్రాజ్యానికి పునాది ఐడిపిఎల్.. 60 ఏళ్ల చరిత్రకు తెర ఎందుకు పడింది?

**891 ఎకరాల భూమి విలువ రూ.50 వేల కోట్లు..కబ్జాల కోరలలో ప్రభుత్వ ఫార్మా కర్మాగారం**






**సైబరాబాద్, అక్టోబర్ 10 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ):** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ చింతల్ సర్కిల్ పరిధిలోని ఐడిపిఎల్ చరిత్రపై ప్రత్యేక కథనం. ఐడిపిఎల్ ఎలా పుట్టింది? 1947 స్వాతంత్ర్యం తర్వాత భారత్ లో మందుల పరిస్థితి దారుణంగా ఉండేది. యాంటీబయాటిక్స్, పెయిన్ కిల్లర్స్, హార్మోన్స్ అన్నీ విదేశీ కంపెనీల నుండి దిగుమతి చేసుకోవాల్సి వచ్చేది. ధరలు ఆకాశంలో ఉండేవి. అప్పటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ చొరవతో 1954లో ప్రభుత్వం ఐడిపిఎల్ ను స్థాపించింది. దీనికి యుఎస్ఎస్ఆర్ (సోవియట్ యూనియన్) సాంకేతిక, యంత్రాల సహకారం అందించింది. మొదటి ప్లాంట్: 1961లో ఉత్తరాఖండ్ రిషికేష్ లో, రెండవ ప్లాంట్: హైదరాబాద్ బాలానగర్ లో (1967లో భూమి కేటాయింపు) - బల్క్ డ్రగ్స్ కోసం, మూడవ ప్లాంట్: హర్యానా గుర్గావ్ లో-ఫార్ములేషన్స్ కోసం, లక్ష్యాలు: భారత్ లోనే బల్క్ డ్రగ్స్ తయారు చేయడం, దిగుమతులపై ఆధారపడటం తగ్గించడం, తక్కువ ధరకు మందులు అందించడం, ప్రైవేట్ కంపెనీలకు టెక్నాలజీ ఇవ్వడం. "స్వర్ణయుగం (1960-1980)- ఎంతమందికి ఉపాధి?" 1960-80 ఐడిపిఎల్ కు గోల్డెన్ పీరియడ్. ఆ సమయంలో ప్రత్యక్షంగా వేలాదిమంది ఉద్యోగులు పనిచేసేవారు. పరోక్షంగా పదివేల కుటుంబాలు ఆధారపడేవి. బాలానగర్ లోనే ఐడిపిఎల్ కాలనీ ఏర్పడింది. ప్రభుత్వ ఉద్యోగం కావడంతో సెక్యూర్ జాబ్, పెన్షన్, మెడికల్ ఫెసిలిటీ, తక్కువ అద్దె క్వార్టర్స్, క్యాంటీన్, ట్రాన్స్ పోర్ట్, స్కూల్ సౌకర్యాలు ఉండేవి. జీతాలు ప్రైవేట్ కంపెనీల కంటే డబుల్ ఉండేవి. అందుకే ఐడిపిఎల్ జాబ్ అంటే డ్రీమ్ జాబ్. ఉస్మానియా, ఆంధ్రా, బిహెచ్ యు యూనివర్సిటీల నుండి బిఎస్సీ కెమిస్ట్రీ, బీఫార్మసీ చదివిన వారిని తీసుకుని యుఎస్ఎస్ఆర్ కు ట్రైనింగ్ కు పంపి కెమిస్టులుగా తయారు చేసేవారు."మూతపడటానికి అసలు కారణాలు" మోడర్నైజేషన్ లేకపోవడం:1980 తర్వాత మెషినరీ పాతది అయిపోయింది. ప్రభుత్వం పెట్టుబడులు పెట్టలేదు. డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్ కఠినంగా మారినా ప్లాంట్లు అప్ గ్రేడ్ కాలేదు. "1991 లిబరలైజేషన్" ఆర్థిక సంస్కరణల తర్వాత డాక్టర్ రెడ్డీస్, అరబిందో, హెటెరో, సిప్లా వంటి ప్రైవేట్ కంపెనీలు తక్కువ ఖర్చుతో హై క్వాలిటీ మందులు తయారు చేసి గ్లోబల్ మార్కెట్ ను కొల్లగొట్టాయి."ఫైనాన్షియల్ లాసెస్" 1992లో సిక్ ఇండస్ట్రీగా ప్రకటన, 1996లో బాలానగర్, రిషికేష్ లో బల్క్ డ్రగ్స్ ఉత్పత్తి ఆగిపోయింది, 2003లో ఫార్ములేషన్స్ కూడా ఆగిపోయాయి. 2000లో ఉద్యోగుల జీతాలు, పెన్షన్లు కూడా ఆగిపోయాయి. "పేలవమైన మేనేజ్మెంట్, రాజకీయ జోక్యం" చివరకు కేంద్ర ప్రభుత్వం 28 డిసెంబర్ 2016న అధికారికంగా క్లోజర్ నిర్ణయం తీసుకుంది. "రెడ్డి ల్యాబ్స్ టెక్నాలజీ తీసుకెళ్లారనే ప్రచారం -నిజం ఏంటి?" బాలానగర్ లో బలంగా వినిపించే ప్రచారం - డాక్టర్ రెడ్డీస్ అధినేత అంజిరెడ్డి ఐడిపిఎల్ టెక్నాలజీ తీసుకెళ్లి ప్రైవేట్ కంపెనీ పెట్టారని."వాస్తవం" డాక్టర్ కల్లం అంజిరెడ్డి 1967-69 నుండి 1975 వరకు ఐడిపిఎల్ లో సీనియర్ సైంటిఫిక్ అసిస్టెంట్ గా పనిచేశారు. ఐడిపిఎల్ ను 'అన్ని ఫార్మా కంపెనీలకు తల్లి' అంటారు. అక్కడ పొందిన రీసెర్చ్ అనుభవంతోనే ఆయన బయటకు వచ్చి 1976లో యూనిలాయిడ్స్, 1980లో స్టాండర్డ్ ఆర్గానిక్స్, 1984లో రూ.25 లక్షలతో డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ స్థాపించారు. టెక్నాలజీ దొంగతనం కాదు, ఐడిపిఎల్ ఇచ్చిన శిక్షణ, అనుభవమే ఆయనను, అలాగే అరబిందో, హెటెరో అధినేతలను తయారు చేసింది. ఐడిపిఎల్ హైదరాబాద్ ను 'బల్క్ డ్రగ్ క్యాపిటల్' గా మార్చింది. 6083 "891 ఎకరాల భూమి -ఇప్పుడు ఏమవుతోంది?" ఐడిపిఎల్ కు బాలానగర్ లో 1967లో 891.38 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. నేటి మార్కెట్ విలువ దాదాపు రూ.20 వేల కోట్ల నుండి రూ.50 వేల కోట్ల వరకు ఉంటుందని అంచనా. 6597, 160 ఎకరాలు నిపెర్ (నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్) కు ఇచ్చారు. మిగిలిన భూమిని 2008లో అప్పటి రంగారెడ్డి కలెక్టర్ స్వాధీనం చేసుకుని టిజిఐఐసి కు అప్పగించారు. "కబ్జాలు" దాదాపు 50 నుండి 60 ఎకరాలు ప్రైవేట్ వ్యక్తులు, కాలనీల పేరుతో కబ్జా చేశారని టిజిఐఐసి అంచనా. ఇటీవల 14 ఎకరాల కబ్జాపై బాలానగర్ పోలీస్ స్టేషన్ లో 11 మందిపై కేసు నమోదైంది. విలువ సుమారు రూ.400 కోట్లు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య భూమి ఎవరిది అనే దానిపై హైకోర్టులో కేసు నడుస్తోంది. భూమిని వేలం వేసి ఐడిపిఎల్ మాజీ ఉద్యోగుల బకాయిలు తీర్చాలని కేంద్రం, తమ భూమిని తమకే ఇవ్వాలని రాష్ట్రం వాదిస్తున్నాయి కేవలం చరిత్రగా, కబ్జాలకు నిలయంగా మిగిలిపోయింది.

# ఎస్ఆర్ యూనివర్సిటీలో ఫ్రెషర్స్ డే వేడుకలు

**ఎస్ఆర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దీపక్ గార్గ్...వెల్లడి**







**హనుమకొండ జిల్లా ప్రతినిధి, అక్టోబర్10(లోకల్ గైడ్ న్యూస్)** : వరంగల్,ఎస్ఆర్ యూనివర్సిటీలో నూతనంగా చేరిన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ స్వాగతం 2026' ఫ్రెషర్స్ డే వేడుకలను ఉత్సాహభరిత వాతావరణంలో సాంస్కృతిక ప్రదర్శనలు, సంగీతం, వినోద కార్యక్రమాలతో ఈ వేడుకలు సందడిగా సాగాయి. విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించడంతో పాటు యూనివర్సిటీ క్యాంపస్‌లో అందుబాటులో ఉన్న వివిధ అవకాశాలను తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం వేదికగా నిలిచింది.ఈ కార్యక్రమానికి ఎస్ఆర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దీపక్ గార్గ్, డీన్--స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ ఏ.వి.వి. సుధాకర్ హాజరయ్యారు. స్టూడెంట్ వెల్ఫేర్ విభాగం తరఫున అసోసియేట్ డీన్, కన్వీనర్ డాక్టర్ పి. రాధాకృష్ణన్, అసోసియేట్ డీన్ కన్వీనర్ డాక్టర్ కె. దీప పాల్గొన్నారు.స్వాగతం 2026' నూతన విద్యార్థులకు తమ తోటి విద్యార్థులతో పరిచయాలు పెంచుకోవడానికి, ఆసక్తులను గుర్తించడానికి, విద్యతో పాటు ఇతర రంగాల్లోనూ తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడానికి మంచి అవకాశాన్ని కల్పించింది. యూనివర్సిటీలోని వివిధ విద్యార్థి క్లబ్‌లు తమ కార్యకలాపాలు, ప్రతిభ, విజయాలు, అందిస్తున్న అవకాశాలను ప్రదర్శించాయి. ఆయా క్లబ్‌లలో చేరడం ద్వారా విద్యార్థులు తమ ఆసక్తులకు అనుగుణంగా కొత్త నైపుణ్యాలను నేర్చుకోవచ్చని, నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకత, జట్టుగా పనిచేసే సామర్థ్యాన్ని పెంపొందించుకోవచ్చని వివరించాయి. నూతన విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న క్లబ్‌లలో చేరి క్యాంపస్ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనాలని ఆహ్వానించాయి.ఈ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా అశ్వవేగ ఆటో ఎక్స్‌పో 2.0' నిలిచింది. యూనివర్సిటీకి చెందిన మోటార్ స్పోర్ట్స్ అండ్ ఆటోమొబైల్ క్లబ్ నిర్వహించిన ఈ ఎక్స్‌పోను విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. ఆటోమొబైల్ ప్రదర్శనలు విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నాయి అన్నారు.ఈ వేడుకల్లో సంగీత కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గాయకులు సాత్విక్ జి. రావు, శ్రుతి రంజని, తమ సంగీత ప్రదర్శనలతో విద్యార్థులను అలరించారు. వారి ప్రదర్శనలతో క్యాంపస్‌లో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. విద్యార్థులు చదువుతో పాటు తమలోని ప్రతిభను వెలికితీసి, సృజనాత్మకతను పెంపొందించుకుంటూ, నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేసుకునేలా ప్రోత్సహించడంలో ఎస్ఆర్ యూనివర్సిటీ ఎల్లప్పుడూ ముందుంటుందని ఈ వేడుకలు చాటిచెప్పాయి. నూతన విద్యార్థులకు ఎస్ఆర్ యూనివర్సిటీ కుటుంబంలోకి ఆహ్వానం పలుకుతూ, వారి విద్యార్థి జీవితంలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టిన ఈ వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ముగిశాయి అని తెలియజేశారు.

# పోలీసుల విజయాల వెను క కుటుంబ సభ్యుల త్యాగా లు విలువైనవి

**ఆత్మీయ సమ్మేళనంలో కలెక్టర్ ప్రియాంక,ఎస్పీ వినీత్**



**నారాయణపేట అక్టోబర్ 10:** పోలీసుల విజయాల వెనుక వారి కుటుంబ సభ్యుల త్యాగాలు ఎంతో విలువైనవి జిల్లా కలెక్టర్ ప్రియాంక,ఎస్పి డాక్టర్ వినీత్ అన్నారు.జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన పోలీసుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సీహెచ్. ప్రియాక హాజరయ్యారు. ఎస్పీ డాక్టర్ వినీత్ దంపతులు, కుటుంబ సభ్యులు, జిల్లా పోలీసు అధికారులు, సిబంది కుటుంబ సభ్యులు హాజరయ్యారు. పోలీసు అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల కోసం ఆటలు, దాండియా, బతుకమ్మ, పాటలు, నృత్యాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాల ను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలీసులు రాత్రనక, పగలనక, పండు గలతో సంబంధం లేకుండా 24 గంటలూ ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం నిరంతరం పనిచే స్తారని కొనియాడారు. జిల్లాలో గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలను ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా విజయవంతంగా నిర్వ హించిన జిల్లా ఎస్పీ డాక్టర్ జి. వినీత్ ఐపీఎస్‌తో పాటు పోలీస్ అధికారులు, సిబ్బందిని అభినందిం చారు. పోలీసుల విధి నిర్వహణ వెనుక వారి కుటుంబ సభ్యుల త్యాగా లు, సహకారం ఎంతో కీలకమని పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ డాక్టర్ జి. వినీత్ ఐపీఎస్ మాట్లాడుతూ గత ఏడాది కాలంగా జిల్లా పోలీ స్ శాఖలో కింది స్థాయి సిబ్బంది నుంచి ఉన్నతా ధికారుల వరకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేశారని తెలిపారు. పోలీసుల విజయాల వెనుక వారి కుటుంబ సభ్యుల త్యాగాలు, సహకారం ఎంతో విలు వైనవని పేర్కొన్నారు. ఇలాంటి ఆత్మీయ సమ్మేళ నాలు పోలీసు కుటుంబాల మధ్య సాన్నిహిత్యాన్ని, ఐక్యతను పెంపొందిస్తా యని అన్నారు. పోలీసులు విధుల్లో నిరంతరం నిమగ్నమై ఉండటం వల్ల వారి కుటుం బ సభ్యులు ఎన్నో సంద ర్భాల్లో తమ వ్యక్తిగత ఆనందాలను, అవసరా లను పక్కనపెట్టి సహక రిస్తారని ఎస్పీ తెలిపారు. పోలీసుల విజయాల వెనుక వారి కుటుంబ సభ్యుల త్యాగాలు, సహ నం, ప్రోత్సాహం ఎంతో విలువైనవని అన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది కుటుంబ సభ్యుల సహకారంతోనే మరింత సమర్థవంతంగా ప్రజలకు సేవ లం దిం చగలు గుతున్నామని పేర్కొన్నారు. విధి నిర్వహణలో చూపుతున్న అంకితభావాన్ని కొనసాగి స్తూ, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి ఎండి రియాజ్ హుల్ హక్, డీఎస్పీ లు మహేష్, లింగయ్య,సి ఐ లు, ఎస్సై లు, పోలీసు సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# బానిస కార్మిక వ్యవస్థను అరికట్టి, బాధితులకు అండగా నిలవాలి

**ఎస్పీ వినీత్**



**నారాయణపేట అక్టోబర్ 10:** బానిస కార్మిక వ్యవస్థను అరికట్టి వారికి అండగా నిలవాలని ఎస్పి డాక్టర్ వినీత్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన బానిస కార్మిక వ్యవస్థ నిర్మూలన, కార్మికుల హక్కులపై అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా 'ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ ఎన్ జి ఓ ఆధ్వర్యంలో బానిస కార్మిక వ్యవస్థ నిర్మూలన అవ గాహన వాల్ పోస్టర్ ఆవి ష్కరించారు. అనంతరం నారాయణపేట జిల్లాలో స్వేచ్ఛా రథాన్ని జిల్లా ఎస్పీ డాక్టర్ జి. వినీత్ ప్రారంభిం చారు.ఈ ప్రచార వాహనం జిల్లాలో రెండు రోజులు వివిధ ప్రాంతాల్లో పర్యటి స్తూ బానిస కార్మిక వ్యవ స్థపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, కార్మికుల హక్కులు, బాధితులకు అందు బాటులో ఉన్న సహాయంపై ప్రచారం నిర్వహిస్తుంది. బానిస కార్మిక వ్యవస్థకు సంబంధించిన ఘటనలు ఎదురైతే లేదా అనుమా నాస్పద కేసుల గురించి సమాచారం తెలిస్తే వెంటనే అధికారులకు తెలియజే యాలని ఎస్పీ సూచిం చారు. బాధితులు తమ సమస్యలను తెలియ జేసేందుకు టోల్ ఫ్రీ హెల్ప్ లైన్ నంబర్ 080- 6943 4343 అందుబాటులో ఉందని తెలిపారు. వ్యవసాయం, ఇటుక బట్టీలు, ఆక్వాకల్చర్, గనులు, క్వారీలతో పాటు ఇతర అసంఘటిత కార్మిక రంగాల్లో పనిచేసే వారికి ఈ కార్యక్రమం ద్వారా అవగా హన కల్పించనున్నారు. సంబంధిత శాఖల సమన్వయంతో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించి, బానిస కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయ నున్నారు. ఈ కార్యక్ర మంలో అదనపు ఎస్పి ఎండి రియాజ్ హుల్ హక్, డీఎస్పీ లు మహేష్, లింగయ్య,ఆర్ ఐ విజయ్ భాస్కర్,

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy

లోకల్ గైడ్

ద్విభాషా దినపత్రిక

ఎడిటర్: [illegible]




# నాడు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి ఓట్ చోరీ చేసి నేడు నిందలా

కేంద్ర ప్రభుత్వ అదనపు న్యాయవాది నందు



నాడు నెహ్రూ ఓట్ చోరీ చేసి ఇందిరా గాంధీ ప్రజా స్వామ్యాన్ని ఖూనీ చేసి నేడు అదే కాంగ్రెస్ పార్టీ నాయకులు నిందలు మోపడం ఏమిటని కేంద్ర ప్రభుత్వ అదనపు న్యాయ వాది నందు నామా జీ ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఎన్నికల్లో ఓటమి పాలు అయినప్పుడల్లా రాహుల్ గాంధీ ఈ వి ఎం లను ఎన్నికల సంఘాన్ని నింద లు వేయడం పరిపాటిగా మారిందని విమర్శించా రు.రాహుల్ గాంధీ ఇండి యా కూటమి నాయకులు రోజు ఢిల్లీలో ఆందోళనలు చేస్తూ ప్రజాజీవితాలకు ఆటంకం కల్పిస్తున్నారని అన్నారు.ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టిన ప్రధాని నరేంద్ర మోడీ పై విమర్శలు చేయ డం గురివింద తన నలుపు ఎరగదన్నట్లు గా ఉందని అన్నారు.కాంగ్రెస్ పార్టీ గెలి చినప్పుడు ఒకలాగా ఓడి నప్పుడు నిందించడం దేశ ప్రజలు గ్రహిస్తూ కాంగ్రెస్ ను ప్రతి ఎన్నికల్లో దూరం పెడు తున్నారని ఆవిషయాన్ని కాంగ్రెస్ నాయకులు తెలు సుకోవాలన్నారు.రాజ్యాంగం పేరుతో అసత్య ప్రచా రం మానుకొక పోతే ప్రతి పక్షాలకు మరింత హీన గతి తప్పదని హెచ్చరించారు.

# నిస్వార్థ సేవకుడు సంతోష్ రెడ్డి

50 వ సారి రక్తదానంతో ఆదర్శం

సాఫ్ట్ వెర్ సంతోషరెడ్డి



**లోకల్ గైడ్ (10కామారెడ్డి ప్రతినిధి )**: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని రక్త నిధి కేంద్రంలో ధర్మ రావు పేట గ్రామానికి చెందిన సాఫ్ట్వేర్ ఇంజనీర్ సంతోష్ రెడ్డి 50వ సారి రక్తదానం చేసి ఆదర్శంగా నిలవడం జరిగిందని ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయ సభ్యులు డాక్టర్ బాలు తెలియజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ సాఫ్ట్వేర్ ఇంజనీర్ గా ఉన్నత స్థానంలో ఉండి ప్రతి సంవత్సరం నాలుగు సార్లు రక్తదానం చేయడమే కాకుండా తన తోటి ఇంజనీర్లను, యువతకు రక్తదానం చేసే విధంగా అవగాహన కల్పించడం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్న సంతోష్ రెడ్డి సేవలు అభినందనీయమని అన్నారు.సాఫ్ట్వేర్ ఇంజనీర్ గా ప్రమోషన్ పొంది కెనడాకు వెళ్తున్న సందర్భంగా రక్తదానం చేసి తన సామాజిక బాధ్యతను చాటుకోవడం జరిగిందని రక్తానికి ప్రత్యామ్నాయ మార్గాలు లేవని మానవతా దృక్పథంతో ముందుకు వచ్చే రక్తదాతలు లేకుంటే ఎంతో మంది ప్రాణాలను కోల్పోయే వారిని అన్నారు. రక్తదాత సంతోష్ రెడ్డిని అభినందించి ప్రశంస పత్రాన్ని అందజేసి సన్మానించడం జరిగింది.

# ఖమ్మంలో ఘనంగా పట్టభద్రుల నియోజకవర్గ సన్నాహక సమావేశం...

కాంగ్రెస్ మీజ అభ్యర్థి సర్వోత్తమ రెడ్డిని కలిసిన సీనియర్ నాయకులు గంటల వెంకటాచారి



**తల్లాడ: లోకల్ గైడ్:** ఖమ్మం నగరంలోని ఎస్.ఆర్ (గా=) కన్వెన్షన్ హాల్లో శనివారం వరంగల్ - ఖమ్మం - నల్గొండ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశం అత్యంత వైభవంగా జరిగింది. రాబోయే పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు ఈ సమావేశంలో దిశానిర్దేశం చేసుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధికారిక ఎమ్మెల్సీ (మీజ) అభ్యర్థి రామ్ రెడ్డి సర్వోత్తమ రెడ్డి ని కుర్నవల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గంటల వెంకటాచారి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఆయనకు ఘన స్వాగతం పలికారు.అనంతరం గంటల వెంకటాచారి మాట్లాడుతూ... పట్టభద్రుల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామ్ రెడ్డి సర్వోత్తమ రెడ్డి గారి విజయం కోసం కుర్నవల్లి గ్రామం నుండి, నియోజకవర్గ స్థాయి నుండి పూర్తి స్థాయిలో కష్టపడి పనిచేస్తామని నిరూపించారు. విద్యావంతులు, యువత, పట్టభద్రులందరినీ ఏకం చేసి కాంగ్రెస్ పార్టీ భారీ మెజారిటీ సాధించేలా ప్రచారం నిర్వహిస్తామని ఈ సందర్భంగా వారు ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 12న జిల్లాలో డిజిపి పర్యటన

అధికారులు రికార్డులతో సిద్ధంగా ఉండాలి

జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్



**నారాయణపేట అక్టోబర్ 10:** తెలంగాణ రాష్ట్ర డీజీపీ శ్రీ సీవీ ఆనంద్ ఈ నెల 12న సోమవారం మహబూబ్న గర్, నారాయణపేట జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో, జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులు, సర్కిల్ అధికారులు, డీఎస్పీలు, వివిధ విభాగాల అధికా రులు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని జిల్లా ఎస్పీ కార్యాలయం లోని కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశం లో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశించారు.డీజీపీ పర్యట నను దృష్టిలో ఉంచుకొని పోలీస్ స్టేషన్లలో కేసుల వివరాలు, పెండింగ్ కేసు లు, దర్యాప్తు పురోగతి, నేర నియంత్రణ చర్యలు, శాంతిభద్రతల పరిరక్షణ, రికార్డులు, రిజిస్టర్లను క్రమ బద్ధంగా సిద్ధం చేసుకోవాల ని సూచించారు.అలాగే సైబర్ నేరాల నియంత్రణ, మహిళలు, బాలల రక్షణ, రోడ్డు భద్రత, మాదకద్రవ్యా ల నిర్మూలన, ప్రజా ఫిర్యా దుల పరిష్కారం, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేందుకు చేపడుతు న్న కార్యక్రమాల వివరాల తో సిద్ధంగా ఉండాలని తెలిపారు.పోలీస్ శాఖలో క్రమశిక్షణ, పారదర్శకత, జవాబుదారీతనాన్ని పాటిస్తూ ప్రజలకు సమ ర్థవంతమైన సేవలు అందిం చాలని జిల్లా ఎస్పీ అధికా రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి ఎండి రియాజ్ హుల్ హక్, డీఎస్పీ లు మహేష్, లింగయ్య,సి ఐ లు శివ శంకర్, రామ్ లాల్, భగ వంత్ రెడ్డి, సైదులు,ఆర్ ఐ విజయ్ భాస్కర్, ఎస్ఐ లు తది తరులు పాల్గొన్నారు.

# 18.కిలోల ఎండు గంజాయి పట్టీవేత.

కామారెడ్డి రైల్వే స్టేషన్లో 18 కిలోల ఎండు గంజాయి పట్టివేత

రూ.9 లక్షల విలువైన గంజాయి స్వాధీనం --

మధ్యప్రదేశ్కు చెందిన వ్యక్తి అరెస్ట్

ఎక్సైజ్ సూపరింటెండెంట్ ముకుంద రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు



**( లోకల్ గైడ్ 10కామారెడ్డి ప్రతినిధి ):** కామారెడ్డి రైల్వే స్టేషన్లో ఎక్సైజ్ శాఖ జిల్లా టాస్క్ఫోర్స్ అధికారులు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో 18 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని, అక్రమంగా గంజాయి తరలిస్తున్న మధ్యప్రదేశ్కు చెందిన ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.9 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. దసరా పండుగ నేపథ్యంలో అక్రమ మాదకద్రవ్యాల రవాణాను అరికట్టేందుకు ఎక్సైజ్ సూపరింటెండెంట్ ముకుంద రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా, తనిఖీలు చేపట్టారు. నాగవల్లి ఎక్స్ప్రెస్ రైలులో గంజాయి తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు జిల్లా టాస్క్ఫోర్స్ సీఐ శ్రీనివాసులు నేతృత్వంలో కానిస్టేబుళ్లు అమృత్ రెడ్డి, శిరీష, రాజు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో రైల్వే రక్షక దళం (ఆర్పీఎఫ్) సిబ్బంది సహకరించారు. తనిఖీల సమయంలో అనుమానాస్పదంగా కనిపించి అక్కడి నుంచి వెళ్లిపోయేందుకు ప్రయత్నించిన వ్యక్తిని అధికారులు తనిఖీ చేయగా, అతని వద్ద 18 కిలోల ఎండు గంజాయి లభించింది. దీంతో గంజాయిని స్వాధీనం చేసుకొని, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని అశోక్ (26)గా గుర్తించామని, అతను మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఉజ్జయినికి చెందిన వ్యక్తి అని అధికారులు వెల్లడించారు. ఒడిశాలోని టిట్లాగఢ్ ప్రాంతం నుంచి నాగవల్లి ఎక్స్ప్రెస్ రైలులో గంజాయిని తీసుకొని సోలాపూర్కు తరలిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైందని తెలిపారు.అక్రమ మాదకద్రవ్యాలపై సమాచారం అందించండి దసరా పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఎక్సైజ్ శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది. అక్రమంగా నాటుసారా తయారీ, విక్రయాలు, గంజాయి రవాణా, ఇతర మాదకద్రవ్యాల అక్రమ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం ప్రజలకు తెలిస్తే వెంటనే ఎక్సైజ్ శాఖ అధికారి ముకుంద రెడ్డి, కోరారు. సమాచారం అందించేందుకు టోల్ఫ్రీ నంబర్ 1800 425 2523 కు కాల్ చేయవచ్చని తెలిపారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, అక్రమ కార్యకలాపాలపై చట్టప్రకారం తక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు .పండుగ సమయంలో అక్రమ మాదకద్రవ్యాల రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ అధికారులు హెచ్చరించారు.

# రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

ఎన్నికల హామీలు అమలు చేయాలి: ఎన్నం సత్యనారాయణ గుప్తా



**మహబూబ్నగర్/మిడ్జిల్ అక్టోబర్ 10(లోకల్ గైడ్ ):** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 17,200 మంది రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించి, వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని మహబూబ్నగర్ జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎన్నం సత్యనారాయణ గుప్తా కోరారు. డీలర్లకు నెలకు రూ.5 వేల గౌరవ వేతనం, క్వింటాలుకు రూ.300 కమిషన్ ఇవ్వడంతో పాటు అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు, వృద్ధాప్య పింఛన్లు, హెల్త్ కార్డులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి మండల కేంద్రంలో సంఘ భవనానికి 300 గజాల స్థలం కేటాయించాలని, డీలర్ మరణిస్తే అంత్యక్రియలకు రూ.20 వేల సాయం, కుటుంబానికి రూ.5 లక్షల బీమా పరిహారం అందించాలని కోరారు. రేషన్ దుకాణాల అద్దెను ప్రభుత్వమే చెల్లించాలని పేర్కొన్నారు. కరోనా సమయంలోనూ ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవలందించిన డీలర్ల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, ఎన్నికల హామీలను నెరవేర్చి వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలని సత్యనారాయణ గుప్తా కోరారు.

# శ్రీ సరస్వతి విద్యానికేతన్లో ఆధ్యాత్మికత, సంప్రదాయాల సమ్మేళనంగా ప్రత్యేక కార్యక్రమాలు





**చర్ల : లోకల్ గైడ్ న్యూస్** : శ్రీ సరస్వతి విద్యానికేతన్లో దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని ఆధ్యాత్మికత, సంప్రదాయాలు, నైతిక విలువల సమ్మేళనంగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ చక్రార్చన, నవకన్యా పూజ, రావణ దహనం, బతుకమ్మ వేడుకలను నిర్వహించి విద్యార్థులకు భారతీయ సంస్కృతి, ధర్మం, ప్రకృతి పరిరక్షణ ప్రాముఖ్యతను వివరించారు. శ్రీ చక్రార్చన ద్వారా దైవత్వం మన అంతరంగంలోనూ ఉంటుందని, ఆత్మపరిశీలనతో ముందుకు సాగాలని సందేశాన్ని అందించారు. నవకన్యా పూజ ద్వారా బాలికలను గౌరవించడం, వారికి సమాన అవకాశాలు కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలియజేశారు. రావణ దహన కార్యక్రమం ద్వారా కోపం, అహంకారం, అసూయ, అబద్ధం వంటి దుర్గుణాలను విడిచిపెట్టి మంచిమార్గంలో నడవాలని విద్యార్థులకు సూచించారు. నిజమైన విజయం మనలోని చెడు గుణాలను జయించడమేనని వివరించారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను సంప్రదాయబద్ధంగా నిర్వహించి, పూలు, చెట్లు, పర్యావరణాన్ని ప్రేమిస్తూ ప్రకృతితో అనుబంధాన్ని పెంపొందించుకోవాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు పండుగల వెనుక ఉన్న ఆధ్యాత్మిక అంతరార్థాన్ని, భారతీయ సంస్కృతిలోని గొప్పతనాన్ని పరిచయం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. విద్యతో పాటు సంస్కారం, ధర్మం, మానవీయ విలువలను పెంపొందించడమే పాఠశాల లక్ష్యమని పేర్కొన్నారు.

# విద్య జీవిత గమనాన్నే మార్చివేస్తుంది : కొప్పరపు శ్రీనివాస గుప్త



**చర్ల, లోకల్ గైడ్ న్యూస్ :** విద్య జీవిత గమనాన్నే మార్చివేస్తుందని, పట్టుదలతో చదివి ఉన్నత స్థితికి చేరుకోవడం ద్వారా తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని ప్రముఖ వ్యాపారి కొప్పరపు శ్రీనివాస గుప్త అన్నారు. బతుకమ్మ పర్వదినాన్ని పురస్కరించుకొని తన తల్లిదండ్రులు కొప్పరపు వెంకటనారాయణ, సరోజిని దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు కొప్పరపు శ్రీనివాస గుప్త, రేణుక దంపతులు వనవాసీ కళ్యాణ పరిషత్ ఆధ్వర్యంలోని కొమరం భీం విద్యార్థి నిలయానికి 50 కిలోల బియ్యం, 5 కిలోల ఫ్రీడమ్ వంట నూనె, 5 కిలోల కందిపప్పుతో పాటు విద్యార్థులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి నిలయ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో శ్రీనివాస గుప్త విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. చదువుతోనే జీవితానికి సార్థకత లభిస్తుందని, ప్రతి ఒక్కరూ చదువుపై దృష్టి సారించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థి నిలయంలోని పిల్లల క్రమశిక్షణ తమను ఎంతగానో ఆకట్టుకుందని పేర్కొన్నారు. వనవాసీ కళ్యాణ పరిషత్ అవసరాలను తీర్చేందుకు తమ వంతు సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. విద్యార్థి నిలయ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ మాట్లాడుతూ గిరిజనుల అభ్యున్నతి కోసం తమ సంస్థ పనిచేస్తోందని తెలిపారు. దేశవ్యాప్తంగా బాలబాలికల కోసం అనేక వసతి గృహాలను ఏర్పాటు చేసి విద్యాబుద్ధులు నేర్పిస్తున్నామని వివరించారు. తమ వసతి గృహాల్లో విద్యతో పాటు వినయవిధేయతలను కూడా బోధిస్తున్నామని పేర్కొన్నారు. నిలయ కమిటీ ఉపాధ్యక్షుడు గోగికార్ రాంలక్ష్మణ్ మాట్లాడుతూ తమ సంస్థ ప్రభుత్వ సహాయం లేకుండా కేవలం దాతల సహకారంతో నడుస్తోందని తెలిపారు. దేశభక్తులను తీర్చిదిద్దే సంస్థకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని పిలుపునిచ్చారు. గిరిజనుల అభ్యున్నతి కోసం సంస్థ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో నిలయ ప్రముఖ్ సంతోష్, స్థానికులు ముదిగొండ సతీష్, బర్ల సుధాకర్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# గండిపేటలో తడి, పొడి చెత్తపై వ్యాపారస్తులకు అవగాహన

"నో బిన్ -- నో ట్రేడ్" నిబంధనలపై సూచనలు





**గండిపేట్, అక్టోబర్ 10 (లోకల్ గైడ్):** నార్సింగి సర్కిల్ పరిధిలోని గండిపేట్ డివిజన్, గండిపేట్ గ్రామంలో వ్యాపారస్తులకు తడి, పొడి చెత్త నిర్వహణపై శానిటేషన్ ఇన్స్పెక్టర్ లచ్చిరాం అవగాహన కల్పించారు. శనివారం దుకాణదారులకు "నో బిన్ -- నో ట్రేడ్" కార్యక్రమాన్ని నిర్వహించి, చెత్తను వేర్వేరుగా సేకరించడం, నిర్వహించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా శానిటేషన్ ఇన్స్పెక్టర్ లచ్చిరాం మాట్లాడుతూ ప్రతి వ్యాపార సంస్థలో తడి చెత్త, పొడి చెత్త కోసం రెండు ప్రత్యేక డస్ట్బిన్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. హానికర వ్యర్థాలను ఇతర చెత్తతో కలపకుండా ప్రత్యేకంగా నిర్వహించాలని తెలిపారు. పరిసరాల పరిశుభ్రతను కాపాడేందుకు చెత్తను ఉత్పత్తి అయిన ప్రదేశంలోనే వేరు చేసి, మున్సిపల్ సిబ్బందికి అందించాలని వ్యాపారస్తులకు సూచించారు.పరిశుభ్రమైన పరిసరాల నిర్వహణలో ప్రతి వ్యాపారస్తుడు బాధ్యతగా వ్యవహరించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, స్థానిక వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.

# 1/70 చట్టం, ఎల్టీఆర్ నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలి



**చర్ల, లోకల్ గైడ్ న్యూస్ :** చర్ల మండలంలోని ఆదివాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 17న చర్ల తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు తుడుందెబ్బ నాయకులు ప్రకటించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మండలంలోని ప్రతి గూడెం నుంచి ఆదివాసులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం చర్ల మండల కేంద్రంలోని తుడుందెబ్బ కార్యాలయంలో సీనియర్ నాయకుడు తాటి రామకృష్ణ ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ మండల అధ్యక్షుడు పూనెం రవికిరణ్ మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతాల్లోకి వలస గిరిజనేతరులు అక్రమంగా ప్రవేశిస్తూ ఏజెన్సీ చట్టాలను ఉల్లంఘిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఆదివాసుల హక్కుల పరిరక్షణలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో సహజ వనరుల దోపిడీని అరికట్టాలని, 1/70 చట్టం, భూమి బదలాయింపు నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివాసులు ఎదుర్కొంటున్న సమస్యలు, అధికారుల వ్యవహారశైలి, చట్టాల అమలులో నిర్లక్ష్యంపై సమాధానాలు కోరేందుకే తహసీల్దార్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సమస్యలు తుడుందెబ్బకు మాత్రమే సంబంధించినవి కావని, చర్ల మండలంలోని ఆదివాసీ సమాజం మొత్తానికి సంబంధించినవని పేర్కొన్నారు. అందువల్ల ఆదివాసీ పెద్దలు, ఉద్యోగులు, యువతీ యువకులు, విద్యార్థులు, నిరుద్యోగ యువత ముట్టడి కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో తుడుందెబ్బ ఉపాధ్యక్షులు తుర్రం ఆదినారాయణ, పురిటి ప్రశాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్ కలం శ్రీనివాస్, కోశాధికారి సోడి రవీంద్ర, సహాయ కార్యదర్శి తాటి శ్రీను, తుర్రం గోపాల్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన మరింత మెరుగ్గా కొనసాగాలి

కలెక్టర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన జర్నలిస్టులు



**లోకల్ గైడ్/ సంగారెడ్డి :** సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆధ్వర్యంలో జిల్లాలో ప్రజా పాలన మరింత మెరుగ్గా కొనసాగాలని టి యు డబ్ల్యు జే (ఐ జేయు) జర్నలిస్టులు ఆకాంక్షించారు. పేద బడుగు వర్గాల తో పాటు జర్నలిస్టుల ఆకాంక్షలను నెరవేర్చాలని కోరారు. టీయూడబ్ల్యూజే - ఐ జే యు సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ను జర్నలిస్టులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. క్యాంపు కార్యాలయంలో కలిసి ఈ సందర్భంగా కలెక్టర్కు పుస్తకాలు, పెన్నులు అంద జేశారు. కలెక్టర్కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఏ అండ దండా లేని పేద ప్రజలకు పెద్దదిక్కుగా ఉండాలని కోరారు. అందుకు తగిన ఆయురారోగ్యాలను భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా జిల్లాలో జర్నలిస్టులకు తోడుగా ఉండాలని జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సహకారం అందించాలని పేర్కొన్నారు. దీనికి జిల్లా కలెక్టర్ మనస్ఫూర్తిగా స్పందించారు. జిల్లా ఉపాధ్యక్షుడు మతిన్, సీనియర్ జర్నలిస్టు మసూద్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ విల్సన్, చిన్న మధ్యతరహా పత్రికల సంఘం జిల్లా అధ్యక్షుడు సిద్ధిక్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ చవాన్, కోశాధికారి లక్ష్మణ్, ఫోటో జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు ఆరిఫ్, జర్నలిస్టులు సూర్య వెంకట్, దినేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో హైటెన్షన్.. రాహుల్ సంచలన హెచ్చరిక



ఢిల్లీ: 'మిస్టర్ మోదీ.. మీరు ఏం చేసుకుంటారో చేసుకోండి. ఎంతమంది పోలీసులను తెచ్చుకుంటారో తెచ్చుకోండి. యువకులందరినీ, నేతలందరినీ అరెస్ట్ చేసుకోండి. మేం మాత్రం వెనక్కి తగ్గం.. మిమ్మల్ని కమ్మేస్తాం" అంటూ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ హెచ్చరించారు. "మేం రాజ్యాంగాన్ని కాపాడుకుంటాం. 15 ఏళ్లలో దేశానికి ఏం జరిగిందో.. అది మళ్లీ జరగనివ్వం. రాజ్యాంగంపై దాడి చేసిన పాలకులను దించి తీరుతాం. దేశ యువతను చూసి గర్వపడుతున్నా. యువత తమ పోరాటాన్ని ఆపొద్దు.. మీ వెనుక మేం ఉన్నాం" అంటూ రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. కాగా, ఢిల్లీలో హైటెన్షన్ నెలకొంది. కనాట్ ప్లేస్‌లో సీజేపీ కార్యకర్తల ఆందోళన కొనసాగుతోంది. గుంపులుగా వస్తున్న నిరసనకారులు ఆందోళనలో పాల్గొంటున్నారు. జంతర్ మంతర్‌కు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్లకు తరలిస్తున్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ గ్యానేశ్ కుమార్ రాజీనామా చేయాలని నిరసనకారులు డిమాండ్ చేస్తున్నారు. ఆందోళన నేపథ్యంలో పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు.

## రాహుల్, విజయ్ భేటీ.. గంటపాటు చర్చలు



చెన్నై: కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ.. తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు, తమిళనాడు సీఎం విజయ్ శనివారం చెన్నైలో సమావేశమయ్యారు. విజయ్ నివాసంలోనే ఇద్దరు నేతలు సుమారు గంటపాటు చర్చలు జరిపారు. అనంతరం సమీపంలోని కేఫ్‌కు వెళ్లి కాఫీ, తిరమిసు, కుకీస్‌ను రుచి చూశారు. దీంతో ఈ భేటీ రాజకీయ వర్గాల్లోనే కాకుండా సోషల్ మీడియాలోనూ ఆసక్తికరంగా మారింది. చెన్నైలోని నీలాంకరైలో ఉన్న తన నివాసం వద్దకు వచ్చిన రాహుల్ గాంధీకి విజయ్ సాదర స్వాగతం పలికారు. అనంతరం ఇద్దరూ రాజకీయ అంశాలపై చర్చించారు. ఆ తర్వాత కేఫ్‌కు వెళ్లిన నేతలు అక్కడికి వచ్చిన అభిమానులతో ముచ్చటించారు. అనంతరం కొందరితో సెల్ఫీలు దిగారు. రాహుల్ గాంధీ చెన్నైలో నిర్వహిస్తున్న 'ఛాత్రోన్ కీ గూంజ్' పేరుతో జరగనున్న యువజన కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చారు. ఈ కార్యక్రమానికి లక్ష మందికి పైగా విద్యార్థులు నమోదు చేసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల అనంతరం హంగ్ పరిస్థితులు ఏర్పడటంతో కాంగ్రెస్, టీవీకే చేతులు కలిపిన విషయం తెలిసిందే. గతంలో డీఎంకేతో కలిసి ఉన్న కాంగ్రెస్.. విజయ్ పార్టీకి మద్దతు ప్రకటించింది. ఈ నేపథ్యంలో జరిగిన రాహుల్, విజయ్ భేటీ రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. అధికారిక చర్చలతో పాటు ఇద్దరి మధ్య కనిపించిన స్నేహపూర్వక వాతావరణం కూడా అందరి దృష్టిని ఆకర్షించింది.

## ఢిల్లీలో హైటెన్షన్... నలుగురు మాజీ సీఎంల అరెస్ట్



ఢిల్లీ: జంతర్ మంతర్ వద్ద అరెస్టుల పర్వం కొనసాగుతుంది. జంతర్‌మంతర్ వద్ద సీజేపీ చేపట్టిన నిరసనకు బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీ, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ మద్దతు ప్రకటించారు. ఈ నేపథ్యంలో జంతర్ మంతర్ వద్దకు వస్తున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అదేవిధంగా మాజీ సీఎంలు పినరయి విజయన్,మాణిక్ సర్కార్‌ను అరెస్టు చేశారు. దీంతో జంతర్ మంతర్ వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. సెంట్రల్ ఢిల్లీలోని సౌత్ అవెన్యూలో బస్ స్టాండ్ వద్ద నిరసన తెలుపుతున్న తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, ఆమె పార్టీకి చెందిన పలువురు ఎంపీలతో పాటు అదుపులోకి తీసుకున్నారు. మమతాతో పాటు ఆమె పార్టీకి చెందిన ఐదుగురు ఎంపీలను పోలీసులు అదుపులోకి తీసుకుని బస్సులో తరలించారు. నిరసన సమయంలో మమతా బెనర్జీ నోటికి బ్యాండేజ్ వేసుకుని కూర్చున్నారు. అరెస్టుల అనంతరం మమత మాట్లాడూతూ "ప్రభుత్వం మాతో దురుసుగా ప్రవర్తిస్తోంది.ప్రజల గొంతును బలోపేతం చేయడానికి మేము, భారత కూటమిగా, మా పోరాటాన్ని కొనసాగిస్తాము," అని ఆమె అన్నారు. అదేవిధంగా ఉదయం నుంచి అరవింద్ కేజ్రీవాల్ పోలీసుల నిర్బంధంలో ఉండగా నిరసనలో చేరడానికి తన ఇంటి నుంచి బయటకు వెళ్లేందుకు ప్రయత్నించగా, ఆయనను కూడా అదుపులోకి తీసుకున్నారు.కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, సీపీఎం ఎంపీ జాన్ బ్రిట్టాస్‌లతో సహా పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకుని ఛత్రసాల్ స్టేడియంలోని నిర్బంధ కేంద్రానికి తరలించారు. కాగా సీఈసీ జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా చేపట్టిన ఢిల్లీలో తీవ్ర ఉద్రిక్తంగా మారింది. సీజేపీ నిరసనకు మద్దతుగా వస్తున్న వారిని ఎక్కడికక్కడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలోనే ఆందోళనలకు తరలివస్తున్న సీజేపీ నేతలు అభిజిత్ దీప్కే, సౌరవ్‌దాస్, అశుతోష్ రాంకాను విమానంలోనే పోలీసులు అరెస్టు చేశారు. ప్రస్తుతం ఢిల్లీలో తీవ్రమైన ఆంక్షలు కొనసాగుతున్నాయి.సీఈసీకి వ్యతిరేకంగా చేపట్టిన ఆందోళలనలకు ప్రభుత్వం అనుమతి లేకపోవడంతో ఎక్కడికక్కడ పోలీసులు అరెస్టు చేస్తున్నారు.

## సీజేపీ నిరసనకు సోనమ్ వాంగ్‌చుక్ దూరం! కారణం ఇదే..



న్యూఢిల్లీ: ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద అక్టోబర్ 10న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రతిపాదించిన నిరసనకు ప్రముఖ పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ హాజరుకాలేదు. హిమాలయ ప్రాంతంలో నీటి భద్రత, హిమానీనద సరస్సుల విపత్తుల ముప్పు నివారణ పనుల్లో బిజీగా ఉండటమే ఇందుకు కారణమని ఆయన వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం ఎక్స్ వేదికగా వాంగ్‌చుక్ స్పందించారు. కృత్రిమ హిమానీనదాల నిర్మాణం ద్వారా నీటి కొరతను అధిగమించే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. హిమాలయ ప్రాంతంలో 200కు పైగా హిమానీనద సరస్సుల వల్ల ముప్పు పొంచి ఉంది. వాటి నుంచి రక్షణకు సంబంధించిన ప్రయోగాలపై దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా దేశం ఎదుర్కొంటున్న ఇతర సమస్యలపైనా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని ఫైజ్ అహ్మద్ ఫైజ్ కవితను ఆయన ఉటంకించారు. "నిరసనలో పాల్గొనే వారు ఐక్యంగా ఉండాలి. ముఖ్యంగా యువత ఎట్టి పరిస్థితుల్లోనూ శాంతిని పాటించాలి. మహాత్మా గాంధీ అహింసా మార్గాన్ని అనుసరించాలి" అని పిలుపునిచ్చారు.

గతంలో విద్యార్థుల ఆందోళనకు మద్దతు

జూలైలో పరీక్షల అక్రమాల ఆరోపణలపై కేంద్ర విద్యాశాఖ మంత్రిగా ఉన్న ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు చేపట్టిన నిరసనకు వాంగ్‌చుక్ మద్దతు తెలిపిన విషయం తెలిసిందే. ఆ సమయంలో జంతర్ మంతర్ వద్ద 26 రోజుల పాటు నిరాహార దీక్ష చేశారు. అనంతరం జూలై 23న గురుగ్రామ్‌లోని ఆసుపత్రిలో దీక్ష విరమించారు. ఇక తాజా నిరసనకు ముందు సీజేపీ వ్యవస్థాపకుడు అబిజీత్ దీప్కే, సహ కన్వీనర్లు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాలను ఢిల్లీ పోలీసులు విమానంలోనే అదుపులోకి తీసుకున్నారు. నిరసన నేపథ్యంలో దేశ రాజధానిలో భద్రతను కట్టుదిట్టం చేశారు.

# రేపటి మార్పు కోసం...

### ఐరాస సుస్థిరాభివృద్ధి యాక్షన్ అవార్డ్స్ ఫైనలిస్టుల జాబితా విడుదల ఈ నెల 29న జెనీవాలో 'హీరోస్ ఆఫ్ టుమారో'లకు సత్కారం




ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు ఎన్నో సంస్థలు విశేష కృషి చేస్తున్నాయి. సమాజంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్న ఈ గ్లోబల్ చాంపియన్లను గౌరవించేందుకు ఉద్దేశించిన 'యూఎన్ ఎస్‌డీజీ యాక్షన్ అవార్డ్స్'కు సంబంధించిన ఫైనలిస్టుల జాబితా విడుదలైంది. 'హీరోస్ ఆఫ్ టుమారో'పేరిట ఐక్యరాజ్యసమితి ఈ జాబితాను తాజాగా ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా వివిధ సంక్షోభాలను అధిగమిస్తూ, పర్యావరణ పరిరక్షణ, లింగ సమానత్వం, సుస్థిర జీవనోపాధి దిశగా పనిచేస్తున్న 9 అత్యుత్తమ కార్యక్రమాలు, వ్యక్తులు మూడు ప్రధాన విభాగాల్లో ఎంపికయ్యారు.

#### 1. ప్రతికూలతలను అధిగమించటం

సోలార్ బ్రైట్ ఫ్యూచర్(కామెరూన్): సంక్షోభాలను అధిగమించి, ప్రజలకు ఈ సంస్థ సౌరశక్తి ద్వారా స్థిరమైన ఆర్థిక సాధికారత కల్పిస్తోంది.

ఉమెన్ జస్టిస్ ఇనీషియేటివ్ (గ్వాటెమల): స్థానిక గిరిజన/మూలవాసీ మహిళలు, బాలికలకు న్యాయం అందించటంలో ఎదురయ్యే అడ్డంకులను తొలగిస్తోంది.

యంగ్ ఎమర్జింగ్ ఫార్మర్స్ ఇనీషియేటివ్(గ్వాటెమల): యువ త నేతృత్వంలో సేంద్రియ వ్యవసాయం ద్వారా వాతావరణ మార్పులను తట్టుకునే సామర్థ్యాన్ని పెంచుతోంది.

#### 2. సృజనాత్మకత

మదర్స్ ఆఫ్ కరేజ్(భారత్): సంప్రదాయ సంకెళ్లను తెంచుతూ ఆడపిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం వినూత్న పోరా టం చేస్తున్న బిహారీ తల్లుల సంస్థ.

రిటర్న్ వాటర్ హోమ్(ఇండోనేసియా): భవిష్యత్ తరాల కోసం సామూహిక భాగస్వామ్యంతో సహజ నీటి వనరులను పునరుద్ధరిస్తున్న ప్రాజెక్ట్ ఇది.

ఉమెన్ ఫర్ చేంజ్(దక్షిణాఫ్రికా): లింగ ఆధారిత హింస, వేధింపులపై గళమెత్తుతూ సామాజిక మార్పునకు బాటలు వేస్తున్న సంస్థ.

#### 3. చేంజ్ మేకర్స్

ఓలా అలగ్‌బరీ (యెమన్): నీటి సంక్షోభాన్ని పరిష్కరిస్తూ దాని ద్వారా సమాజంలో శాంతి స్థాపనకు కృషి చేస్తున్నారు.

రోకియాటూ ట్రోరే(మాలి): భూ పునరుద్ధరణను మహిళలు, చిన్నకారు రైతుల ఉపాధితో అనుసంధానిస్తున్నారు.

తాబన్ షోరేష్(ఇరాక్): యుద్ధ సంక్షోభాల నుంచి బయటపడి, బాధితుల పునరి?నర్మాణానికి, వారి వికాసానికి తోడ్పడుతున్నారు.

మహిళలు, బాలికలపై హింస నిర్మూలనకు స్థానిక పరిష్కారాల ద్వారా అంతర్జాతీయంగా కృషి చేస్తున్న 'యూఎన్ ట్రస్ట్ ఫండ్ టు ఎండ్ వయొలెన్స్ ఎగైనెస్ట్ ఉమెన్ అండ్ గర్ల్స్' ను విశిష్ట పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ అవార్డుల విజేతలను జెనీవాలో ఈ నెల 29న జరిగే అధికారిక వేడుకలో గౌరవించనున్నారు. స్థానిక సమస్యలకు స్థానిక నాయకత్వంతో పరిష్కారాలు కనుగొంటూ ప్రపంచానికి స్ఫూర్తిగా నిలుస్తున్న ఈ ఉద్యమకారుల కృషి సుస్థిర భవిష్యత్తుకు మార్గదర్శకంగా నిలుస్తుందని ఐరాస ప్రశంసించింది.

# ఆలోచనశక్తికి ఏఐ వైరస్

అమరావతి: సైన్స్ ప్రాజెక్టా? కృత్రిమ మేధ సిద్ధంగా ఉంది. వ్యాసం రాయాలా? ఏఐ సెకన్లలో రాసిచ్చేస్తుంది. కోడింగ్ ఎర్రరా? టూల్ సరిచేస్తుంది. ఆధునిక సాంకేతికత పరిజ్ఞానం విద్యారంగాన్ని పరుగులు పెట్టించడం నిజమే అయినా.. దానికి సమాంతరంగా విద్యార్థుల స్వతంత్ర ఆలోచనశక్తికి గండికొడుతోందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల చేతికి వచ్చిన సరికొత్త 'కాగ్నిటివ్ ఆఫ్--లోడింగ్' (మెదడు చేయాల్సిన ఆలోచనను మెషీన్‌కు అప్పగించే ధోరణి) యువతరాన్ని ఆలోచనశక్తి హీనులుగా మార్చేస్తోందంటున్నారు. ఇది భవిష్యత్ తరాలను వేగంగా ప్రమాదంలోకి నెడుతోందని ప్రపంచవ్యాప్తంగా వెలువడుతున్న అధ్యయనాలు, సర్వేలు హెచ్చరిస్తున్నాయి. అంతర్జాతీయ విద్యాసంస్థలు, డిజిటల్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ (డీఈసీ--సింగపూర్), చీగ్ గ్లోబల్ (యూఎస్‌ఏ) నివేదికల ప్రకారం ఉన్నతవిద్య విద్యార్థుల్లో జనరేటివ్ ఏఐ సాధనాల వినియోగం శరవేగంగా పెరిగింది. మనదేశంలోను ఇంజినీరింగ్ విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 50 శాతం మంది విఫలమవడానికి కారణం ఏఐపై అధికంగా ఆధారపడడమేనని చెబుతున్నారు. మెదడును శ్రమపెట్టే విద్యార్థే భవిష్యత్తులో సాంకేతికతను నడిపిస్తాడని, లేదంటే సాంకేతికతే ఆ విద్యార్థిని నడిపిస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### ప్రపంచవ్యాప్తంగా విద్యార్థుల ఏఐ వినియోగం

కొత్తగా అరచేతిలోకి వచ్చిన కృత్రిమ మేధ మనుషుల మేధస్సును తుస్సుమనిపిస్తోంది. ముఖ్యంగా విద్యార్థుల్లో తమ మెదడుకు పనిచెప్పకుండా, ఆలోచనకు పదును పెట్టకుండా సులభంగా పనిపూర్తయ్యే మార్గాల కోసం ఏఐని ఆశ్రయించేవారి సంఖ్య పెరుగుతున్నట్టు డీఈసీ సర్వేలో వెల్లడైంది. హోంవర్క్ చేసేందుకు, ప్రాజెక్టుల కోసం, అసైన్‌మెంట్లు, అనువాదాలు, పరీక్షల సన్నద్ధత, అకడమిక్ పేపర్ల ఎనాలసిస్.. ఇలా ఒకటేంటి అన్నింటికీ జనరేటివ్ ఏఐ సాధనాలపై ఆధారపడుతున్నట్టు గుర్తించారు. ఈ విధానం ఎక్కువగా, యూకే, లాటిన్ అమెరికా, భారత్, యూఎస్‌ఏ, యూరప్ దేశాల్లో వేగంగా విస్తరిస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వరుసలో యునైటెడ్ కింగ్‌డమ్ 92--95 శాతంతో మొదటిస్థానంలో ఉండగా మనదేశం 86--89 శాతంతో మూడోస్థానంలో ఉంది. యూకేలో అసైన్‌మెంట్లు, రీసెర్చ్ సారాంశాలు, కాన్సెప్ట్ క్లారిటీ కోసం, బ్రెజిల్, మెక్సికో వంటి లాటిన్ అమెరికా దేశాల్లో ప్రాజెక్టులు, అనువాదాలు, హోంవర్క్ కోసం ఏఐని వాడుతుండగా, భారతదేశంలో కోడింగ్ సమస్యలు, పరీక్షల సన్నద్ధత, ప్రాజెక్టుల కోసం, అమెరికాలో




వ్యాసాలు, బ్రెయిన్ స్టార్టింగ్, క్విజ్ ప్రిపరేషన్ కోసం, ఫ్రాన్స్, జర్మనీ వంటి యూరప్ దేశాల్లో థీసిస్ రీసెర్చ్, అకడమిక్ పేపర్ల తయారీకి వాడుతున్నారు. శాతాల పరంగా బ్రిటన్ మొదటిస్థానంలో ఉన్నప్పటికీ.. సంఖ్యాపరంగా చూస్తే భారతదేశమే ప్రపంచంలో నంబర్ వన్ స్థానంలో నిలుస్తోంది. దేశంలో ఉన్న సుమారు 4.3 కోట్లమంది ఉన్నతవిద్య విద్యార్థుల్లో ఏకంగా 3.5 కోట్ల మందికిపైగా రోజూ లేదా వారానికి పలుమార్లు ఏఐని వాడుతున్నట్టు తేలింది. యూఎస్‌లో ఈ సంఖ్య 1.4 కోట్లు ఉండగా, యూకేలో సుమారు 20 లక్షల వద్ద ఉంది.

### ఆలోచన శూన్యం.. క్యాంపస్‌లలో వైఫల్యాలు:

జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో విద్యార్థుల్లో స్వంతంగా శోధించి నేర్చుకునే సంస్కృతి తగ్గిపోతోందని సర్వేలు చెబుతున్నాయి. ఇది మానవ మేధస్సును నాశనం చేస్తున్నట్లు నిపుణులు హెచ్చరిస్తున్నారు. విషయ పరిజ్ఞానం పెంచుకోకుండా కాపీ--పేస్ట్ సంస్కృతి విస్తరిస్తోందంటున్నారు. ప్యూ రీసెర్చ్ సెంటర్ అధ్యయనాల ప్రకారం ప్రతి పదిమంది విద్యార్థుల్లో ఆరుగురు (60 శాతం) ఏఐ ఇచ్చిన ఫలితాలను క్రాస్‌చెక్ చేయకుండా నేరుగా సబ్మిట్ చేస్తున్నారు. విద్యార్థులు స్వయంగా గ్రంథాలయాలు, పుస్తకాల్లో చదివి పరిశోధన చేసే సమయం గతంతో పోలిస్తే సుమారు 45 శాతం తగ్గింది. ' కాగ్నిటివ్ ఇంపాక్ట్ స్టడీస్ ప్రకారం.. నిరంతరం ఏఐ టూల్స్‌పై ఆధారపడే విద్యార్థుల్లో సమస్య పరిష్కార సామర్థ్యం, సమాచారాన్ని నిలుపుకొనే జ్ఞాపకశక్తి సాధారణ విద్యార్థుల కంటే 20--25% తగ్గుముఖం పడుతోంది. ' కార్పొరేట్ హెచ్ఆర్ సర్వేల ప్రకారం, దేశవ్యాప్తంగా క్యాంపస్ డ్రైవ్‌లలో పాల్గొనే భారతీయ ఐటీ, ఇంజినీరింగ్ విద్యార్థుల్లో 40--50 శాతం మంది ముఖాముఖి ఇంటర్వ్యూలలో ప్రాథమిక లాజిక్, మాన్యువల్ కోడింగ్ రాయడంలో విఫలమవుతున్నారు. కాలేజీల్లో ఆటోమేటెడ్ కోడ్ జెనరేషన్ టూల్స్ వాడటం వల్ల, మొదటి నుంచి సొంతంగా లాజిక్ నిర్మించే ఆలోచన విద్యార్థుల్లో లోపిస్తోందని, దీంతో ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లు ఇంటర్వ్యూలలో తేలిపోతున్నారని చెబుతున్నారు. ' ఏఐ టూల్స్ కొన్నిసార్లు ఉనికిలో లేని తప్పుడు సమాచారాన్ని (ఏఐ హాలూసినేషన్) కూడా సరైనదేనన్నట్లు భ్రమింపజేస్తాయని, సర్వేల ప్రకారం 55 శాతం మంది విద్యార్థులు ఆ ఆధారాలను ధ్రువీకరించుకోకుండానే తమ ప్రాజెక్టుల్లో జోడిస్తున్నారని గుర్తించారు.

### భారత విద్యావ్యవస్థకు సవాళ్లు

యూకే, యూఎస్ వంటి దేశాల్లో ఏఐ అకాడమిక్ ఎథిక్స్, డిటెక్షన్ సాఫ్ట్‌వేర్ల వినియోగం ఇప్పటికే మొదలైంది. భారత్‌లో సీబీఎస్ఈ, యూజీసీ వంటి విద్యామండళ్లు మార్గదర్శకాలపై కసరత్తు చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో తీవ్ర అంతరాలున్నాయి. విద్యార్థులకు ఇచ్చిన హోంవర్క్, అసైన్‌మెంట్లు నిమిషాల్లో పూర్తవుతుండటంతో అసలైన ప్రతిభను గుర్తించడం అధ్యాపకులకు పెద్ద సవాలుగా మారింది. దేశంలోని 80 శాతం విద్యాసంస్థల్లో సరైన ఏఐ--డిటెక్షన్ వ్యవస్థలు అందుబాటులో లేవు. పాశ్చాత్య దేశాల్లో విద్యార్థులు ఆలోచనలకు మెరుగులు దిద్దుకోవడానికి ఏఐని వాడితే, భారత్‌లో ఇంకా చాలామంది విద్యార్థులు శ్రమను తప్పించుకునే 'షార్ట్‌కట్'గా మాత్రమే చూస్తున్నారని చెబుతున్నారు. ఈ క్రమంలో కొన్ని పరిష్కారమార్గాలను అనుసరిస్తే విద్యార్థిని 'మాస్టర్'గా నిలబెట్టవచ్చని పేర్కొంటున్నారు. ' ప్రాజెక్ట్ పేపర్లను మాత్రమే చూసి మార్కులు వేసే విధానానికి స్వస్తి పలకాలి. విద్యార్థి సమస్యను ఎలా పరిష్కరించాడు, ఏయే దశల్లో ఆలోచించాడు అనే దానిపై తరగతి గదిలో ప్రెజెంటేషన్లు, లైవ్ వైవా తప్పనిసరి చేయాలి. ' తరగతి గదిలోనే ఏఐని వాడటానికి అనుమతినిస్తూ.. ఆ టూల్ ఇచ్చిన సమాధానంలో ఉన్న తప్పులు, లోపాలు, హాలూసినేషన్లను గుర్తించమని (రివర్స్--లెర్నింగ్ ) విద్యార్థులకు టాస్?కలు ఇవ్వాలి. దీనివల్ల వారి విమర్శనాత్మక ఆలోచన (క్రిటికల్ థింకింగ్) మెల్కొంటుంది. ' వారానికి కనీసం 2--3 గంటలు ఎలాంటి డిజిటల్ పరికరాలు లేకుండా పెన్ను, పేపర్‌తో ఆలోచించడం, గ్రూప్ డిస్కషన్లు నిర్వహించడాన్ని విద్యాసంస్థలు తప్పనిసరి చేయాలి. అలా అని సాంకేతికతను నిషేధించడం దీనికి పరిష్కారం కాదని.. అలాగే అది మానవ మేధస్సుకు ప్రత్యామ్నాయం కాదన్న వాస్తవాన్ని కూడా పాఠశాల దశలోనే తెలియజేయాలని చెబుతున్నారు. ఏఐని ఒక సహాయకుడిగా మాత్రమే చూడాలన్న స్పృహను విద్యార్థుల్లో కలిగించాలని సూచిస్తున్నారు.

# 'నోబెల్ శాంతి'కి సరైన ఎంపిక

నిరుడు మాదిరిగానే ఈసారి కూడా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఎంతగా అర్రులు చాచినా నోబెల్ శాంతి బహుమతి ఆయనకు దక్కలేదు. భారతీయ మూలాలున్న దక్షిణాఫ్రికా న్యాయవేత్త, మానవహక్కుల ఉద్యమకారిణి నవనీతం పిళ్లేను శాంతి పురస్కారానికి ఎంపిక చేశామని నోబెల్ కమిటీ శుక్రవారం చేసిన ప్రకటనను ప్రపంచవ్యాప్త మానవహక్కుల ప్రియులు హర్షించారు. కండబలం ఉన్నదనీ, ప్రపంచ దేశాలను దోచుకొచ్చి పోగేసిన అపార సంపద, ఆయుధ సంపత్తి సొంతమని విర్రవీగి బడుగు దేశాలపై దండెత్తే దుర్నీతి రాజ్యమేలుతున్న కాలంలో మానవహక్కుల కోసం నిలబడి హంతకుల్ని వేలెత్తి చూపగల చేవ, సాహసం ప్రదర్శించేవారు నిస్సందేహంగా మహోన్నతులు. నవనీతం ఆ కోవకు చెందిన అరుదైన మహిళ. గాజాలో మూడేళ్లుగా మారణహోమం సృష్టిస్తూ, వేలాదిమంది మరణానికి, లక్షలాదిమంది క్షతగాత్రులు కావటానికి కారణమైన ఇజ్రాయెల్ ముసుగు తొలగించిన ఐక్యరాజ్యసమితి మానవహక్కుల కమిషన్‌కు 2025లో ఆమె నేతృత్వం వహించారు. మహాకవి శ్రీశ్రీ 'కవితా... ఓ కవితా!' ఖండికలోని అపురూప ప్రయోగం 'అగ్ని సరస్సున వికసించిన వజ్రం' విశేషణానికి నవనీతం సరిగ్గా సరిపోతారు. తన బతుకంతా పోరాటమే ఊపిరిగా శ్వాసించిన ఆమె...బాల్యంలో దుర్భరదారిద్ర్యాన్ని చవి చూశారంటే... విద్యార్థినిగానే దక్షిణాఫ్రికా జాత్యహంకార ప్రభుత్వాన్ని ధిక్కరించారంటే చిన్న విషయం కాదు. 70వ దశకంలో భర్త గాబీ పిళ్లేతోసహా వందలమందిని అప్పటి పాలకులు ఉగ్రవాద చట్టం కింద నిర్బంధిస్తే వారి విడుదలకు చట్టబద్ధంగా పోరాడి ఆమె తొలి విజయాన్నందుకున్నారు. నాటల్‌లో 1967లో న్యాయవాద వృత్తిని ప్రారంభించిన తొలి మహిళ ఆమెనే. అటుపై దేశంలోనూ, అంతర్జాతీయంగానూ ఎన్నో ప్రాముఖ్యతగల ట్రిబ్యునళ్లకు సారథ్యంవహించి అసహాయులకు స్వరమై నిలిచారు. మహిళలపై సాగే లైంగిక హింసను నరమేధంగా పరిగణించాలని 1998లో చరిత్రాత్మక తీర్పునిచ్చిన ధర్మాసనంలో ఆమె ఉన్నారు. హేగ్‌లోని అంతర్జాతీయ క్రిమినల్ కోర్టుకు 2003నుంచి అయిదేళ్లపాటు పనిచేశారు. ఆ తర్వాత సమితి మానవహక్కుల హైకమిషనర్‌గా పనిచేశారు. ఇతర పురస్కారాల మాటెలావున్నా శాంతి బహుమతి ఎంపిక విషయంలో వ్యవహరించే తీరుపై ఎప్పటినుంచో ఫిర్యాదులున్నాయి. 1919లో అప్పటి అమెరికా అధ్యక్షుడు ఉడ్రో విల్సన్‌కూ, 1973లో అప్పటి అమెరికా



విదేశాంగమంత్రి హెన్రీ కిసింజర్‌కూ, 2002లో మాజీ అధ్యక్షుడు జిమ్మీ కార్టర్‌కూ, 2009లో ఒబామాకూ బహుమతులెలా ఇచ్చారో ఎవరికీ తెలియదు. నానాజాతి సమితిలో ప్రధాన పాత్ర పోషించినందుకు ఉడ్రో విల్సన్‌కు శాంతి బహుమతినిచ్చినా... అమెరికా ఆ సమితిలో చేరిందిలేదు. చిలీలో సైనిక కుట్రకు ప్రణాళిక రచించి, వియత్నాం యుద్ధాన్ని కొనసాగించి, కాంబోడియాపై బాంబులు కురిపించిన కిసింజర్‌కి ఇచ్చినప్పుడు ప్రపంచం నివ్వెరపోయింది. అఫ్గానిస్తాన్ ముజాహిదీన్లకు ఆయుధాలిచ్చి ఉగ్రవాదానికి బీజం వేసినవారు కార్టర్. శాంతి పురస్కారం ఇచ్చేనాటికి ఒబామా అధికారంలోకి వచ్చి ఎన్నాళ్లో కాలేదు. కనీసం అందుకైనా ఆయన శాంతి కోసం పాటుపడకపోగా, బుష్ మొదలెట్టిన యుద్ధాలను మరింత తీవ్రం చేశారు. 'అది ఎందుకిచ్చారో నాకే అర్థంకాలేద'ని అనంతరకాలంలో ఒబామా చెప్పారు. 'ఒబామాకున్న అర్హత ఆయన బుష్ కాకపోవటమే' అని చాలామంది అప్పట్లోనే ఎగతాళిగా అన్నారు. పిళ్లేకు పురస్కారం ఇవ్వటం ద్వారా నోబెల్ కమిటీ తన పాత పాపాలను కడిగేసుకుంది. ఆ బహుమతికి అర్రులుచాచిన ట్రంప్... విజేత నవనీతం రెండు విరుద్ధ భావజాలాలకూ, ఆచరణలకూ ప్రాతినిధ్యంవహిస్తారు. అంతర్జాతీయ వ్యవస్థల్ని ఖాతరుచేయని వ్యక్తి ట్రంప్ అయితే... వాటి వైశిష్ట్యాన్ని చాటినవారు పిళ్లే. అంతర్జాతీయ క్రిమినల్ కోర్టును ట్రంప్ వ్యతిరేకిస్తే... నవనీతం దానికి సారథి. ఇజ్రాయెల్‌కు ట్రంప్ అండదండలందిస్తే... నవనీతం అందులోని హంతక స్వభావాన్ని బయటపెట్టారు. ట్రంప్‌ను నోబెల్‌కు సిఫార్సు చేసిన పాక్ తదితర దేశాలు 'ఆయన బలంద్వారా శాంతిని సాధించార'ని ప్రస్తుతిస్తే... నవనీతం జీవితమంతా బలహీనులకు స్వరమై నిలిచారు. మొత్తానికి నోబెల్ శాంతి కమిటీ ఈసారి తనను తాను గౌరవించుకుంది!

RNI NO. APBIL/2013/50718
LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్
ద్విభాషా దినపత్రిక
ఎడిటర్: చిలకమర్రి రింరెడ్డి
www.localguidenews.com



# వ్యాయామం చేయకుండానే చెమట పడుతోందా? గుండె ఇచ్చే ఈ సంకేతాలను గమనించండి!

**కారణం లేకుండా చెమట పడితే జాగ్రత్త**

**చల్లటి చెమట గుండెపోటు సంకేతం కావొచ్చంటున్న నిపుణులు**

**ఛాతీలో అసౌకర్యంతో చెమట వస్తే నిర్లక్ష్యం చేయొద్దు**

**ఆయాసం, తలతిరగడం ఉంటే అప్రమత్తంగా ఉండాలని సూచన**

**రోజువారీ పనుల్లో అధిక చెమటను గమనించాలని సలహా**



చెమట పట్టడం సహజమే. ఎండలో ఉన్నప్పుడు, వ్యాయామం చేసినప్పుడు లేదా ఒత్తిడికి గురైనప్పుడు చెమట రావడం సాధారణం. కానీ ఎలాంటి కారణం లేకుండానే ఒక్కసారిగా విపరీతంగా చెమట పడితే మాత్రం కాస్త జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా ఛాతీలో అసౌకర్యం, ఆయాసం, వికారం, తల తిరగడం లేదా అకస్మాత్తుగా నీరసం వంటి లక్షణాలు కూడా ఉంటే దాన్ని తేలిగ్గా తీసుకోకూడదు.



గుండె సమస్యతో చెమట ఎందుకు పడుతుంది?

గుండెపై తీవ్ర ఒత్తిడి పడినప్పుడు శరీరం అత్యవసర పరిస్థితిలో ఉన్నట్లు స్పందిస్తుంది. గుండెపోటు సమయంలో సింపథెటిక్ నాడీ వ్యవస్థ చురుగ్గా పనిచేస్తుంది. దీంతో గుండె వేగం పెరగడం, రక్తపోటులో మార్పులు రావడం, చెమట గ్రంథులు ఎక్కువగా పనిచేయడం జరుగుతుంది.

అప్పుడు ఒక్కసారిగా చల్లటి చెమటలు పట్టొచ్చు. చర్మం వేడిగా కాకుండా తడిగా, జిగటగా అనిపించొచ్చు. ఊరికే కూర్చున్నా ఈ పరిస్థితి రావచ్చు.

ఇతర లక్షణాలు ఉంటే మరింత జాగ్రత్త

చెమట ఒక్కటే వస్తే గుండె సమస్య అని చెప్పలేం. జ్వరం, ఆందోళన, రక్తంలో చక్కెర తగ్గడం, హార్మోన్ల మార్పులు, ఇన్ఫెక్షన్లు, కొన్ని మందుల వల్ల కూడా చెమట పట్టొచ్చు. అయితే చెమటతో పాటు ఛాతీలో బిగుతు లేదా భారంగా అనిపించడం, చేయి, భుజం, వీపు, మెడ లేదా దవడ భాగంలో నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, వాంతులు, తల తిరగడం, తీవ్రమైన నీరసం, గుండె వేగం మారడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్య సహాయం తీసుకోవాలి.





### రోజువారీ పనుల్లోనూ చెమట ఎక్కువగా వస్తోందా?

ఇంతకుముందు సులభంగా చేసిన పనికే ఇప్పుడు విపరీతంగా చెమట పడుతోందా? మెట్లు ఎక్కడం, నడవడం లేదా ఇంటి పనులు చేస్తున్నప్పుడు చెమటతో పాటు ఆయాసం, ఛాతీలో అసౌకర్యం వస్తోందా? అయితే వైద్యుడిని సంప్రదించడం మంచిది. ఉదాహరణకు గతంలో 30 నిమిషాలు సులభంగా నడిచిన వ్యక్తికి ఇప్పుడు 10 నిమిషాలకే చెమట, ఆయాసం, నీరసం వస్తే.. ఆ మార్పును గమనించాలి.

### రాత్రిపూట చెమట పడితే?

రాత్రి చెమట పట్టడానికి చాలా కారణాలు ఉండొచ్చు. గది వేడిగా ఉండటం, ఇన్ఫెక్షన్లు, హార్మోన్ల మార్పులు, కొన్ని మందులు ఇందుకు కారణం కావచ్చు. అయితే రాత్రిపూట చెమటతో పాటు ఛాతీలో అసౌకర్యం, ఆయాసం, గుండె దడ లేదా నిద్ర నుంచి నీరసంతో మేల్కొనే పరిస్థితి పదేపదే వస్తే వైద్య పరీక్షలు చేయించుకోవడం మంచిది.

### ఎప్పుడు అత్యవసర చికిత్స అవసరం?

ఒక్కసారిగా విపరీతమైన చెమటతో పాటు ఛాతీలో అసౌకర్యం, శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బంది, స్పృహ తప్పే పరిస్థితి, తీవ్రమైన నీరసం లేదా చేయి, దవడ, వీపు, భుజానికి నొప్పి ఉంటే వెంటనే అత్యవసర వైద్య సహాయం తీసుకోవాలి. లక్షణాలు కొన్ని నిమిషాల్లో తగ్గిపోయినా నిర్లక్ష్యం చేయకూడదు. కొన్ని గుండె సమస్యల్లో లక్షణాలు వచ్చి తగ్గుతూ ఉండొచ్చు.

మీకు సాధారణంగా ఎంత చెమట పడుతుందో తెలుసుకోవడం ముఖ్యం. సాధారణానికి భిన్నంగా ఒక్కసారిగా చల్లటి చెమటలు పట్టడం, ముఖ్యంగా ఇతర లక్షణాలతో కలిసి కనిపించడం గమనించాల్సిన సంకేతం. ఎప్పుడు చెమట పడుతోంది? ఎంతసేపు ఉంటోంది? ఆ సమయంలో ఏ లక్షణాలు కనిపిస్తున్నాయో గుర్తుపెట్టుకుంటే వైద్యుడికి పరిస్థితిని వివరించడంలో ఉపయోగపడుతుంది.

# గుడ్డు తాజాగా ఉందో? లేదో? 10 సెకన్లలో తెలుసుకోండి..

**ఎఫ్ఎస్ఎస్ఏఐ టిప్ ఇదే!**

**నీటితో గుడ్డు తాజాదనం తెలుసుకునే అవకాశం**

**అడుగున అడ్డంగా ఉంటే గుడ్డు తాజాగా ఉన్నట్లేనని ఎఫ్ఎస్ఎస్ఏఐ సూచన**

**నిలువుగా ఉంటే గుడ్డు పాతదని అర్థమని వెల్లడి**



ఫ్రిజ్ తెరిచారు.. అందులో కొన్ని రోజులుగా ఉన్న గుడ్లు కనిపించాయి. అవి తాజాగా ఉన్నాయా? తినొచ్చా? అనే సందేహం రావడం సహజమే. పెంకును చూస్తే గుడ్డు పరిస్థితి తెలియదు. అలాగే అమ్మినవాళ్లు తాజావే ఇచ్చారా? అనే అనుమానమూ వస్తుంటుంది. అయితే ఇకపై అలాంటి సందేహాలు అవసరం లేదు. ఇంట్లో ఉన్న నీళ్లతోనే గుడ్డు తాజాగా ఉందో? పాతదైందో సులభంగా తెలుసుకోవచ్చు. 'ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా' (ఎఫ్ఎస్-ఎస్ఏఐ) ఈ సింపుల్ పద్ధతిని సూచించింది.

ఓ గ్లాసు నీళ్లు చాలు

ఓ గ్లాసులో సగం వరకు నీళ్లు పోయాలి. అందులో గుడ్డును వేయాలి. గుడ్డు నీటి అడుగుకు వెళ్లి అడ్డం తిరిగితే అది తాజాగా ఉన్నట్లు అర్థం. అదే అడుగున నిలువుగా ఉంటే గుడ్డు పాతదని అర్థం. అయితే వెంటనే దాన్ని పాడైందిగా భావించాల్సిన అవసరం లేదు. వాడే ముందు మరోసారి పరిశీలించాలి.

గుడ్డు నీటి పైకి తేలితే మాత్రం జాగ్రత్త. అది పాడై ఉండే అవకాశం ఉంది. అలాంటి గుడ్డును తినకుండా పడేయడం మంచిది.

పగలగొట్టాక కూడా చూడాలి

నీటి పరీక్షతో పాటు గుడ్డును పగలగొట్టిన తర్వాత కూడా కొన్ని విషయాలు గమనించాలి. గుడ్డులోంచి వింత వాసన వస్తే తినకూడదు. రంగులో మార్పు కనిపించినా వాడకూడదు. పెంకులో పగుళ్లు ఉన్నా, గుడ్డు నుంచి ద్రవం కారుతున్నా దాన్ని తీసుకోవద్దని ఎఫ్ఎస్ఎస్ఏఐ సూచిస్తోంది.

### ఫ్రిజ్‌లో ఎక్కడ పెట్టాలి?

గుడ్లను ఎక్కువకాలం తాజాగా ఉంచాలంటే వాటిని సరైన విధంగా భద్రపరచడం కూడా ముఖ్యం. తెచ్చిన ప్యాకింగ్‌లోనే గుడ్లను ఉంచడం మంచిది. ఇతర ఆహార పదార్థాల వాసనలు వాటికి పట్టకుండా ఇది ఉపయోగపడుతుంది. ఫ్రిజ్ తలుపులో కాకుండా షెల్ఫ్‌పై ఉంచడం మంచిది. తలుపు తరచూ తెరవడం వల్ల ఉష్ణోగ్రతలో మార్పులు వస్తాయి.

ఈ చిన్న జాగ్రత్తలు తప్పనిసరి

ఫ్రిజ్ ఉష్ణోగ్రత 4 డిగ్రీల సెల్సియస్ లేదా అంతకంటే తక్కువగా ఉండేలా చూసుకోవాలి. గుడ్లను ఫ్రిజ్‌లో పెట్టే ముందు కడగకూడదు. అవసరమైతే వాడే ముందు మాత్రమే కడగాలి. అలాగే కొన్న గుడ్లను ముందుగా ఉపయోగిస్తే అవి ఎక్కువ రోజులు నిల్వ ఉండకుండా చూసుకోవచ్చు.

# పాలలో డిటర్జెంట్ కలిసిందా? ఇంట్లోనే ఇలా సులభంగా చెక్ చేసుకోండి



**5-10 మిల్లీలీటర్ల పాలను గ్లాసులోకి తీసుకోవాలి**

**పాలను గట్టిగా షేక్ చేసి బుడగలను గమనించాలి**

**బుడగలు ఎక్కువసేపు ఉంటే కల్తీగా అనుమానించాలి**

**ఇంట్లో పరీక్ష తుది నిర్ధారణ కాదని గుర్తుంచుకోవాలి**

ప్రతి ఇంట్లో నిత్యం ఉపయోగించే ఆహార పదార్థాల్లో పాలు ఒకటి. ఉదయం టీతో మొదలుకొని రాత్రి పడుకునే ముందు తాగే గ్లాసు వరకు పాలు ఉండాల్సిందే. అయితే పాల విషయంలో కల్తీ ఆందోళన కలిగిస్తోంది. పాలు పలుచగా కనిపించకుండా, నురుగు వచ్చేలా కనిపించేందుకు డిటర్జెంట్ వంటి పదార్థాలను కలుపుతున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. మరి మన ఇంట్లో వాడుతున్న పాలలోనూ డిటర్జెంట్ కలిసిందా? తెలుసుకోవడానికి ల్యాబ్ అవసరం లేదట. ఇంట్లోనే ఓ చిన్న పరీక్ష చేసుకోవచ్చని ఆహార భద్రతా అధికారులు చెబుతున్నారు. ఇంతకీ ఆ పరీక్ష ఏంటి? తెలుసుకుందాం..

ఓ చిన్న గ్లాసు చాలు

ముందుగా 5 నుంచి 10 మిల్లీలీటర్ల పాలను ఓ చిన్న గ్లాసులోకి తీసుకోండి. ఇప్పుడు దాన్ని గట్టిగా షేక్ చేయండి. ఆ తర్వాత పాలలో ఏం జరుగుతుందో కాసేపు గమనించండి. అంతే.. మీ ముందే ఓ సంకేతం కనిపిస్తుంది.

బుడగలు ఏం చెబుతున్నాయి?

షేక్ చేసిన వెంటనే బుడగలు ఏర్పడి త్వరగా మాయమైతే పాలలో డిటర్జెంట్ కల్తీ ఉన్నట్లు భావించాల్సిన అవసరం లేదని ఎఫ్ఎస్ఎస్ఏఐ తెలిపింది. అదే బుడగలు ఎక్కువగా ఏర్పడి కొంతసేపు అలాగే ఉంటే మాత్రం అనుమానించాల్సి ఉంటుంది. డిటర్జెంట్ కల్తీకి ఇది ఓ సూచన కావచ్చని పేర్కొంది.

బుడగలు ఎందుకు వస్తాయి?

ఇక్కడే అసలు విషయం ఉంది. డిటర్జెంట్లలో ఉండే సర్ఫాక్టెంట్లు ద్రవం ఉపరితల ఉద్రిక్తతను తగ్గిస్తాయి. దీంతో పాలను షేక్ చేసినప్పుడు ఏర్పడిన గాలి చుట్టూ పలుచని పొర ఏర్పడుతుంది. ఫలితంగా బుడగలు వెంటనే పగిలిపోకుండా ఎక్కువసేపు నిలుస్తాయి. స్వచ్ఛమైన పాలలో మాత్రం ఈ బుడగలు అంతగా నిలవవు.

పాలు కొనే ముందు..

కల్తీకి దూరంగా ఉండాలంటే నమ్మకమైన బ్రాండ్లను ఎంచుకోవడం మంచిది. ప్యాకెట్ లేదా కార్టన్ కొనేటప్పుడు సీల్ సరిగా ఉందో చూడాలి. పదార్థాల వివరాలను పరిశీలించాలి. ప్యాకెట్‌పై ఉన్న ఎఫ్ఎస్-ఎస్ఏఐ లోగోతో పాటు 14 అంకెల లైసెన్స్ నంబర్‌ను కూడా చెక్ చేసుకోవాలి. అయితే ఇంట్లో చేసే ఈ పరీక్షను ప్రాథమిక సూచనగా మాత్రమే చూడాలి. పాలు కల్తీగా ఉన్నాయనే తుది నిర్ధారణకు అధికారిక పరీక్ష అవసరం. అయినప్పటికీ.. రోజూ తాగే పాల విషయంలో కాస్త అప్రమత్తంగా ఉండేందుకు ఈ చిన్న టెస్ట్ ఉపయోగపడుతుంది.

# కాంతులీనే చర్మం కోసం ఈ 5 ఫ్రూట్స్ ట్రై చేయండి!

**చర్మం బిగుతుగా, యవ్వనంగా కనిపించడానికి కొల్లాజెన్ కీలకం**

**వయసు పెరిగే కొద్దీ శరీరంలో కొల్లాజెన్ ఉత్పత్తి సహజంగా తగ్గుతుంది**

**విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉండే పండ్లు కొల్లాజెన్ తయారీకి తోడ్పడతాయి**

**జామ, కివీ, నారింజ, స్ట్రాబెర్రీ, బొప్పాయి వంటి పండ్లు తీసుకోవడం మేలు**

**ఈ పండ్లలో కొల్లాజెన్ ఉండదు, కానీ దాని ఉత్పత్తికి శరీరానికి సాయపడతాయి**



చర్మం ఆరోగ్యంగా, కాంతివంతంగా, యవ్వనంగా కనిపించడంలో కొల్లాజెన్ అనే ప్రోటీన్ కీలక పాత్ర పోషిస్తుంది. చర్మానికి బిగుతుదనాన్ని, నిర్మాణాన్ని ఇచ్చేది ఇదే. అయితే వయసు పెరిగే కొద్దీ మన శరీరంలో కొల్లాజెన్ ఉత్పత్తి సహజంగానే మందగిస్తుంది. ఈ ప్రక్రియను పూర్తిగా ఆపలేకపోయినా, సరైన పోషకాహారం ద్వారా కొల్లాజెన్ ఉత్పత్తికి శరీరం సిద్ధమయ్యేలా చేయవచ్చు. ముఖ్యంగా విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం చాలా అవసరం. టైమ్స్ ఆఫ్ ఇండియా కథనం ప్రకారం, కొన్ని ప్రత్యేకమైన పండ్లను రోజూవారీ ఆహారంలో చేర్చుకోవడం ద్వారా కొల్లాజెన్ ఉత్పత్తికి మద్దతు ఇవ్వవచ్చు. కేవలం ఒక పండుతో రాత్రికి రాత్రే అద్భుతాలు జరగవని, కానీ సమతుల్య ఆహారం, మంచి జీవనశైలితో పాటు వీటిని తీసుకుంటే మంచి ఫలితాలు కనిపిస్తాయని నిపుణులు చెబుతున్నారు.

కొల్లాజెన్ ఉత్పత్తికి తోడ్పడే 5 ముఖ్యమైన పండ్లు:

1. జామ : ఇందులో విటమిన్ సి అత్యధికంగా ఉంటుంది. కొల్లాజెన్ సంశ్లేషణకు విటమిన్ సి చాలా అవసరం. జామపండును నేరుగా తినొచ్చు లేదా ఫ్రూట్ సలాడ్స్‌లో కలిపి తీసుకోవచ్చు.

2. కివీ : విటమిన్ సికి కివీ పండు ఒక అద్భుతమైన వనరు. ఇది కొల్లాజెన్ ఉత్పత్తిని ప్రోత్సహించడమే కాకుండా, ఇందులోని యాంటీఆక్సిడెంట్లు చర్మ కణాలను ఫ్రీ రాడికల్స్ నష్టం నుంచి కాపాడతాయి.

3. నారింజ: విటమిన్ సి అనగానే అందరికీ గుర్తొచ్చేది నారింజ. దీన్ని నేరుగా తినడం లేదా రసం రూపంలో తీసుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన విటమిన్ సి అందుతుంది.



4. స్ట్రాబెర్రీ : ఈ పండ్లలో విటమిన్ సి తో పాటు శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్ గుణాలు ఉంటాయి. స్మూతీలు, యోగర్ట్ లేదా ఓట్స్‌తో కలిపి వీటిని తీసుకోవచ్చు.

5. బొప్పాయి : విటమిన్ సి, ఇతర యాంటీఆక్సిడెంట్లు బొప్పాయిలో పుష్కలంగా ఉంటాయి. ఇవి కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచడంతో పాటు, చర్మాన్ని సంరక్షిస్తాయి.

ఒక ముఖ్య గమనిక: ఈ పండ్లలో నేరుగా కొల్లాజెన్ ఉండదు. కానీ, మన శరీరంలో కొల్లాజెన్‌ను తయారు చేసుకోవడానికి అవసరమైన పోషకాలను అందిస్తాయి. కాబట్టి, కేవలం ఈ పండ్లపైనే ఆధారపడకుండా, సరైన ప్రోటీన్లు ఉన్న సమతుల్య ఆహారం, ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించడం చర్మ సౌందర్యానికి అత్యంత ముఖ్యం.

## సీపీఎం నేత గఫూర్ కుమారుడి మృతిపై వైఎస్ జగన్ దిగ్భ్రాంతి



తాడేపల్లి: సీపీఎం నేత గఫూర్ కుమారుడు కిరణ్ మృతిపై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చిన్న వయసులోనే ఉన్నత విద్యను అభ్యసించి.. కాలిఫోర్నియాలో సీనియర్ డేటా సైంటిస్ట్‌గా పనిచేస్తూ.. మంచి భవిష్యత్తు కలిగిన కిరణ్ అకాల మరణం అత్యంత బాధాకరమన్నారు. కన్నకొడుకును కోల్పోయిన ఎం.ఎ. అబ్దుల్ గఫూర్, పి. నిర్మల గార్ల దుఃఖం వర్ణనాతీతం. ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని వారికి, కుటుంబ సభ్యులకు భగవంతుడు ప్రసాదించాలన్న వైఎస్ జగన్.. కిరణ్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నా. కిరణ్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## స్థానిక ఎన్నికలు.. ఎస్ఈసీ కీలక ప్రకటన



విజయవాడ: ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక వివరాలు వెల్లడించింది. గ్రామ పంచాయతీలకు మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీలకు ఒక దశలోనే నిర్వహించనున్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు రెండు దశల్లో నిర్వహించేందుకు పరిశీలిస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్‌చంద్ర పునేతా తెలిపారు. నోటిఫికేషన్ విడుదల చేసిన సమయం నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి రానుంది. నోటిఫికేషన్ వెలువడిన 14 రోజుల్లోనే పంచాయితీ ఎన్నికలు జరగనున్నాయి. అదే రోజు ఫలితాలు విడుదల కానున్నాయి. 15 రోజుల్లో పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల ఎన్నికలు జరగనున్నాయి. రెండు రోజుల్లో ఓట్ల లెక్కింపు జరగనుంది. 16 రోజుల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు.. రెండు రోజుల తర్వాత ఫలితాలు రానున్నాయి. పంచాయతీలకు మాత్రం పార్టీ రహితంగా ఎన్నికలు నిర్వహించనున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన రోజు నుంచి 14 రోజుల్లో పంచాయతీ ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. పోలింగ్ ఉదయం 7 గంటలకు ప్రారంభమై ఒంటి గంటకు ముగియనుంది. అదేరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్లు లెక్కించి, ఫలితాలు ప్రకటిస్తారు. పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల ఎన్నికలు నోటిఫికేషన్ నుంచి 15 రోజుల్లో, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు 16 రోజుల్లో పూర్తి చేయనున్నారు. పోలింగ్ పూర్తయిన రెండు రోజుల తరువాత వీటిలో ఓట్లు లెక్కించనున్నారు. పంచాయతీ ఎన్నికలు పార్టీ రహితంగా.. మిగిలినవన్నీ పార్టీ పరంగా నిర్వహిస్తారు. నోటిఫికేషన్, ఎన్నికల షెడ్యూల్ ఏది ముందు వెలువడితే.. అదే రోజు నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుంది. ఎన్నికలకు మొత్తం 1,05,432 బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేశారు. తెలంగాణ నుంచి 17,650 బాక్సులు తెప్పించారు. ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నామని ఎస్ఈసీ ప్రకటించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఎస్ఈసీ మీడియాతో మాట్లాడారు. అన్ని జిల్లాల్లోనూ ఎన్నికల నిర్వహణకు యంత్రాంగం సిద్ధంగా ఉంది. ఓటర్ల జాబితాలు, పోలింగ్ కేంద్రాలు, బ్యాలెట్ బాక్సులు మెటీరియల్ సిద్ధం చేశాం. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు రెండు దశల్లో నిర్వహించాలన్న సూచనలు పరిశీలించి నిర్ణయాన్ని వెల్లడిస్తామని ఆయన పేర్కొన్నారు.

## "దేశాన్ని పార్లమెంటే పాలిస్తుంది, వీధులు కాదు".. కాంగ్రెస్, కాక్రోచ్‌లపై బీజేపీ ఫైర్..




**న్యూఢిల్లీ,:** ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని ప్రతిపక్షాలు, కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) ఢిల్లీలో నిరసనలు చేపడుతున్న తరుణంలో బీజేపీ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తోంది. దేశంలో అరాచకాలను ప్రేరేపించే ప్రయత్నాలను ప్రజాస్వామ్యం అడ్డుకుందని బీజేపీ ఎంపీ, అధికార ప్రతినిధి రవిశంకర్ ప్రసాద్ అన్నారు. "దేశాన్ని పార్లమెంట్ పాలిస్తుంది తప్పా వీధులు కాదు" అని అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడిన ఆయన.. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో భారత్ ఎప్పుడూ తలవంచలేదని, భవిష్యత్తులోనూ తలవంచేది లేదని అన్నారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను ఆయన సమర్థించారు. గత మూడు రోజులుగా, శనివారం చోటుచేసుకున్న పరిణామాలను ప్రస్తావిస్తూ.. భారత ప్రజాస్వామ్యం అరచకాలను ప్రేరేపించే ప్రయత్నాలను అడ్డుకుందని, దేశాన్ని పార్లమెంటే పాలిస్తుందని స్పష్టం చేశారు. ఈ నిరసనలు జరుగుతున్న సమయంలో పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరిలో బీజేపీ గెలిచిన విషయాన్ని రవిశంకర్ ప్రస్తావించారు. ఢిల్లీలో ఆందోళనలు జరుగుతున్న సమయంలోనే ఈ ఫలితాలు వచ్చాయని అన్నారు. ప్రతిపక్షాల ఆందోళనల్ని "అరాచక ఉద్యమం"గా అభివర్ణించారు. "తాము నిరసనలకు వ్యతిరేకం కాదని, కానీ ఎన్నికల్లో ఓటముల కారణంగా మీరు వీధి పోరాటాను ఆయుధంగా మార్చుకున్నారు" అని కాంగ్రెస్‌ను ఉద్దేశించి ఆగ్రహం వ్యక్తం చేశారు.ు

## తెలంగాణలో 1.20 లక్షల మందికి ముద్రా లోన్స్.. రూ.2,800 కోట్లకు పైగా మంజూరు!



**న్యూఢిల్లీ,:** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ముద్రా యోజన పథకం తెలంగాణలో చిన్న వ్యాపారాలు నిర్వహించే వారికి, కొత్తగా వ్యాపారాలు ప్రారంభించాలనుకునే ఔత్సాహికులకు ఆర్థికంగా అండగా నిలుస్తోందని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తన ట్వీట్ ద్వారా వెల్లడించారు. బ్యాంకుల నుంచి రుణాలు పొందడం ద్వారా చిన్న పరిశ్రమలను ప్రారంభించడంతో పాటు, ఇప్పటికే ఉన్న వ్యాపారాలను విస్తరించుకునే అవకాశం కలుగుతోంది. 2026 జూన్ 30 నాటికి అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం, తెలంగాణలో 1,20,000కు పైగా ముద్రా రుణ ఖాతాల ద్వారా రూ.2,800 కోట్లకు పైగా రుణాలు మంజూరయ్యాయి. స్వయం ఉపాధిని ప్రోత్సహించడం, చిన్న వ్యాపారాలకు ఆర్థిక సహాయం అందించడం, స్థానికంగా ఉపాధి అవకాశాలను పెంచడం ఈ పథకం ప్రధాన లక్ష్యాలు. ముద్రా పథకం కింద అర్హులైన సూక్ష్మ వ్యాపారవేత్తలకు తాకట్టు లేకుండా రుణాలు పొందే అవకాశం ఉంటుంది. వ్యాపార అవసరాలు, అభివృద్ధి స్థాయిని బట్టి రుణాలను వివిధ కేటగిరీలుగా విభజించారు. దీంతో చిన్న స్థాయిలో వ్యాపారం ప్రారంభించేవారి నుంచి ఇప్పటికే వ్యాపారాన్ని నిర్వహిస్తూ మరింత విస్తరించాలనుకునే వారి వరకు ఈ పథకం ఉపయోగపడుతుంది. దుకాణాలు, చిన్న తయారీ యూనిట్లు, సేవా రంగ వ్యాపారాలు వంటి అర్హమైన కార్యకలాపాలకు అవసరమైన ఆర్థిక సహాయం పొందవచ్చు. మహిళా సాధికారతకు కూడా ఈ పథకం ప్రాధాన్యం ఇస్తోంది. తెలంగాణలో 45,000 మందికి పైగా మహిళా లబ్ధిదారులకు రూ.508.13 కోట్ల రుణాలు అందించినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. మహిళలు స్వయంగా వ్యాపారాలు ప్రారంభించడానికి, ఆదాయాన్ని పెంచుకోవడానికి, కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచుకోవడానికి ఇలాంటి రుణాలు తోడ్పడతాయి. అయితే, రుణం మంజూరు కావడం అనేది వ్యాపార విజయానికి హామీ కాదు. వ్యాపార ప్రణాళిక, ఖర్చుల నిర్వహణ, మార్కెట్ డిమాండ్ కూడా కీలకమే. ప్రధానమంత్రి ముద్రా యోజనలో నాలుగు రకాల రుణ కేటగిరీలు ఉన్నాయి. శిశు కేటగిరీలో రూ.50,000 వరకు రుణాలు అందిస్తారు. కొత్తగా చిన్న వ్యాపారం ప్రారంభించాలనుకునే వారికి ఈ కేటగిరీ ఉపయోగపడుతుంది. తెలంగాణలో ఈ విభాగంలో 41,000కు పైగా ఖాతాల ద్వారా రూ.183.64 కోట్లు మంజూరయ్యాయి. తక్కువ పెట్టుబడితో వ్యాపారం ప్రారంభించాలనుకునేవారికి అవసరమైన ప్రారంభ మూలధనాన్ని సమకూర్చుకోవడంలో ఇది సహాయపడుతుంది. కిశోర్ కేటగిరీలో రూ.50,000 కంటే ఎక్కువ నుంచి రూ.5 లక్షల వరకు రుణాలు పొందవచ్చు. ఇప్పటికే వ్యాపారం నిర్వహిస్తున్నవారు దాన్ని విస్తరించడానికి, కొత్త పరికరాలు కొనుగోలు చేయడానికి లేదా రోజువారీ కార్యకలాపాలకు అవసరమైన పెట్టుబడిని సమకూర్చుకోవడానికి ఈ రుణాలు ఉపయోగపడతాయి. తెలంగాణలో ఈ విభాగంలో 65,000కు పైగా ఖాతాల ద్వారా రూ.1,112.81 కోట్లు మంజూరయ్యాయి. తరుణ్ కేటగిరీ కింద రూ.5 లక్షలకు మించి రూ.10 లక్షల వరకు రుణాలు అందిస్తారు. వ్యాపారాన్ని మరింత పెద్ద స్థాయికి తీసుకెళ్లాలనుకునే అర్హులైన వ్యాపారవేత్తలకు ఇది ఉపయోగపడుతుంది. తెలంగాణలో ఈ కేటగిరీలో 14,000కు పైగా ఖాతాల ద్వారా రూ.1,218.65 కోట్లు మంజూరయ్యాయి. ఇక తరుణ్ ప్లస్ కేటగిరీ కింద రూ.10 లక్షలకు మించి రూ.20 లక్షల వరకు రుణాలు పొందే అవకాశం ఉంది. గతంలో తరుణ్ కేటగిరీ కింద రుణం తీసుకుని, దాన్ని విజయవంతంగా తిరిగి చెల్లించిన అర్హులైన వ్యాపారవేత్తలకు ఈ సదుపాయం వర్తిస్తుంది. తెలంగాణలో ఈ విభాగంలో 2,000కు పైగా ఖాతాల ద్వారా రూ.379.29 కోట్లు మంజూరయ్యాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా , పంజాబ్ నేషనల్ బ్యాంక్ (గ్రాచీదీ), బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంక్, యూనియన్ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్ సహా పలు బ్యాంకుల ద్వారా ముద్రా రుణాలు అందుబాటులో ఉన్నాయి. ఆసక్తి ఉన్నవారు తమ వ్యాపార అవసరాలకు అనుగుణంగా సంబంధిత బ్యాంకును సంప్రదించి అర్హతలు, వడ్డీ రేట్లు, తిరిగి చెల్లింపు నిబంధనలు తెలుసుకోవాలి. మొత్తంగా, ముద్రా పథకం చిన్న వ్యాపారాలకు ఆర్థిక సహాయం అందించడం ద్వారా స్వయం ఉపాధి, వ్యాపార విస్తరణ, ఉపాధి కల్పనకు తోడ్పడుతోంది.

# డిగ్రీ చేతిలో.. ఉద్యోగం ఎక్కడ?

చేతిలో చదువు.. కళ్ల ముందు భవిష్యత్తు.. కానీ ఉపాధి లేక ఖాళీగా ఉండే యువత పెరుగుతోంది. తెలంగాణలో 15–29 ఏళ్ల వారిలో చదువు, పని, శిక్షణ.. ఈ మూడింటికీ దూరంగా ఉన్న వారి వాటా జాతీయ సగటు కంటే ఎక్కువగా ఉందని కార్మిక శక్తి సర్వే గణాంకాలు సూచిస్తున్నాయి. జిల్లాల మధ్య కూడా వ్యత్యాసం ఉంది. కొన్ని చోట్ల ఈ పరిస్థితి మరింత తీవ్రంగా కనిపిస్తోంది. అంటే సమస్య కేవలం ఉద్యోగం దొరకకపోవడమే కాదు.. సరైన మార్గదర్శకత్వం, నైపుణ్య శిక్షణ, అవకాశాల సమాచారం అందకపోవడమూ కారణమే.




### క్రైమ్ పెరగడానికి.. నిరుద్యోగమే కారణమా?

ఏళ్ల తరబడి ప్రభుత్వ నియామక ప్రకటనల కోసం ఎదురుచూసే పట్టభద్రుల్లో నిరాశ పెరగడం సహజం. అది ఒక దశలో ఒంటరి తనం, కుటుంబంపై కోపం, చెడు స్నేహాల వైపు నడిపించే ప్రమాదం ఉంది. 2021లో మహబూబాబాద్ జిల్లాలో ఉద్యోగ ప్రకటన కోసం ఎదురుచూస్తున్న ఓ పట్టభద్రుడి మరణం అప్పట్లో చర్చనీయాంశమైంది. అయితే నిరుద్యోగమే ఆత్మహత్యలకు ఏకైక కారణమని చెప్పలేం. కుటుంబ, ఆర్థిక, వ్యక్తిగత ఒత్తిళ్లూ ఉంటాయి. అయినా భవిష్యత్తుపై అనిశ్చితి పెంచే అంశంగా ఉపాధి కొరతను విస్మరించలేం. ముఖ్యంగా యువతులు బయటకు వచ్చి పనిచేయాలన్నా ప్రయాణం, భద్రత, కుటుంబ బాధ్యతలు అడ్డంకులవుతున్నాయి.. వ్యసనాల బారిన పడుతున్న వారినీ విస్మరించలేం. తెలంగాణలో మాదకద్రవ్యాల కేసులు 2023తో పోలిస్తే 2024లో పెరిగినట్లు అధికారిక నేర గణాం కాలు చెబుతున్నాయి. పిల్లలు చట్టవిరుద్ధ కార్యకలాపాల్లో చిక్కుకున్న కేసులూ పెరిగాయి. దొంగతనం, దోపిడీ వంటి ఘటనల్లో బాలలు పట్టుబడుతున్న ఉదంతాలు ఆందోళన కలిగిస్తున్నాయి. వీటన్నింటికీ నిరుద్యోగమే ప్రత్యక్ష కారణమని చెప్పడం సరికాదు.. కానీ ఖాళీ సమయం, చెడు స్నేహాలు, వ్యసనాలు, ఆర్థిక ఒత్తిడి, కుటుంబ పర్యవేక్షణ లోపం కలిసి నప్పుడు ప్రమాదం పెరుగుతుంది.

### ప్రభుత్వ కార్యక్రమాలకు... ఉపాధి లెక్కలు ఉండాలి!

ప్రభుత్వాలు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కోసం పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నాయి. ప్రధానమంత్రి నైపుణ్యాభివృద్ధి పథకం, ఉపాధి మేళాలు, ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన, తెలంగాణలో రాజీవ్ యువ వికాసం వంటి కార్య క్రమాలు ఇందుకు ఉద్దేశించినవే. కానీ శిక్షణ పూర్తిచేసిన వారిలో ఎంతమందికి పని లభించింది? ఎంతమంది స్వయం ఉపాధి చేపట్టారు? ఏడాది తర్వాత వారి పరిస్థితి ఏమిటి? అనే ప్రశ్నలకూ లెక్క ఉండాలి. శిక్షణ పొందిన వారి సంఖ్య కాదు.. దాని తర్వాత నిలిచిన జీవితాలే ఫలితానికి కొలమానం. అలాగే ఏ ఉద్యోగానికి ఏ అర్హత? ఏ నైపుణ్యం నేర్చుకుంటే అవకాశాలు పెరుగుతాయి? శిక్షణ ఎక్కడ? స్థానికంగా ఎక్కడ పని దొరుకుతుంది? అన్నది చాలామందికి తెలియదు.. పట్టణాలకే పరిమితం కాకుండా మండల స్థాయిలోనే ఉపాధి సమాచారం, నైపుణ్య శిక్షణ అందాలి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రయాణ ఖర్చు, వసతి, భద్రత సమస్యలను పరిగణనలోకి తీసుకోవాలి. మహిళలకు సురక్షిత ప్రయాణం, పని ప్రదేశాల్లో అనుకూల వాతావరణం కల్పించాలి.

### ప్రభుత్వాలే కాదు.. తల్లిదండ్రులు సమాచారమివ్వాలి!

ఈ విషయంలో బాధ్యత ప్రభుత్వానిదొక్కటే కాదు. తల్లిదండ్రులు పిల్లలను నిందించే బదులు వారి మనసు తెలుసుకోవాలి. కళాశాలలు చివరి సంవత్సరం నుంచే వృత్తి మార్గదర్శకత్వం, నైపుణ్య శిక్షణ, ఉపాధి సమాచారాన్ని అందించాలి. పరిశ్రమలు తమకు కావాల్సిన నైపుణ్యాలను విద్యాసంస్థలకు తెలియజేయాలి. ప్రభు త్వం ప్రతి మండలంలో నెలకోసారి ఉపాధి–నైపుణ్య శిబిరాలు నిర్వహించి పని, శిక్షణ, స్వయం ఉపాధి, వ్యసన నిరోధం, అంతర్జాల మోసాలపై అవగాహన కల్పించాలి. అవసరమైన వారికి మానసిక మార్గదర్శక సహాయం అందాలి. డిగ్రీ చేతిలో ఉండటం.. జీవితానికి ఆరంభం కావాలి. చదువుకు తగిన పని, పనికి తగిన ఆదాయం, దానితో ఆత్మవిశ్వాసం రావాలి. లేకపోతే ఖాళీ సమయం చెడు దారులకు చోటిస్తుంది.

# ఫిరాయింపుల నిరోధం.. ఇంకా అసంపూర్తే!

పార్టీ మారడం రాజకీయాల్లో కొత్తేమీ కాదు.. కానీ ప్రజల తీర్పుతో ఎన్నికైన ప్రజాప్రతినిధి పార్టీ మారినప్పుడు ఆ తీర్పు విలువ ఏమవుతుందన్న ప్రశ్న మాత్రం ఎప్పటికీ కొత్తగానే ఉంటుంది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హతపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు మరోసారి ఫిరాయింపుల చట్టం, స్పీకర్ అధికారాలు, ఓటరు తీర్పు పరిరక్షణపై చర్చను ముందుకు తెచ్చింది. రాజకీయ పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోలా స్పందిస్తున్న పరిస్థితుల్లో.. ఫిరాయింపుల నిరోధానికి ఉన్న చట్టం నిజంగా తన లక్ష్యాన్ని నెరవేరుస్తోందా? గతంలో జాతీయ, ప్రాంతీయ పార్టీలలో అనేకం వివిధ సందర్భాల్లో పార్టీ మార్పుల వల్ల ప్రయోజనం పొందాయి. దానం నాగేందర్ విషయానికొస్తే, ఆయన 2023లో బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎన్నికయ్యారు. ఎమ్మెల్యేగా కొనసాగుతూనే 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. దీనిపై బీఆర్ఎస్ అనర్హత పిటిషన్ వేయగా స్పీకర్ తిరస్కరించారు. హైకోర్టు ఆ నిర్ణయాన్ని రద్దు చేసి ఆయన 2024 ఏప్రిల్ 23 నుంచే అనర్హుడని ప్రకటించింది. ఆ తీర్పును నాగేందర్ సుప్రీంకోర్టులో సవాలు చేశారు. సుప్రీంకోర్టు హైకోర్టు తీర్పునే సమర్థించింది.



### పార్టీ ఫిరాయింపులు ఇప్పటి కథ కాదు..

1967లో హర్యానా ఎమ్మెల్యే గయాలాల్ వరుసగా పార్టీలు మార్చడంతో "ఆయా రామ్, గయా రామ్" అన్న పదబంధం ప్రాచుర్యంలోకి వచ్చింది. 1967–71 మధ్య పార్లమెంటులో 142, రాష్ట్ర శాసనసభల్లో 1,969 ఫిరాయింపులు నమోదయ్యాయి.. 32 ప్రభుత్వాలు కూలిపోయాయి. అందుకే 1985లో 52వ రాజ్యాంగ సవరణ ద్వారా పదో షెడ్యూల్‌ను చేర్చారు. పార్టీ టికెట్‌పై ఎన్నికైన సభ్యుడు స్వచ్ఛందంగా పార్టీ సభ్యత్వాన్ని వదిలినా, పార్టీ ఆదేశానికి విరుద్ధంగా సభలో ఓటు వేసినా లేదా ఓటింగ్‌కు దూరంగా ఉన్నా అనర్హతకు గురయ్యే నిబంధనలు అందులో ఉన్నాయి. అనర్హతపై నిర్ణయం చెప్పే అధికారం స్పీకర్ లేదా చైర్మన్‌కు అప్పగించారు. అయితే, మొదటి చట్టంలో ఒక రాజకీయ పార్టీ శాసనసభాపక్షంలో చీలిక ఏర్పడి, కనీసం మూడింట ఒక వంతు మంది సభ్యులు ప్రత్యేక గ్రూపుగా ఏర్పడితే అది "స్ప్లిట్" గా పరిగణించబడి అనర్హత నుంచి రక్షణ ఉండేది. 2003లో 91వ రాజ్యాంగ సవరణ ఆ మినహాయింపును తొలగించింది. ఒక రాజకీయ పార్టీ మరొక రాజకీయ పార్టీలో విలీనమై, ఆ విలీనానికి శాసనసభాపక్షంలోని కనీసం మూడింట రెండొంతుల మంది అంగీకరించినప్పుడు మాత్రమే పదో షెడ్యూల్ కింద రక్షణ కొనసాగుతుంది.

### పదో షెడ్యూల్ తర్వాత.. కొత్త దారులు..

పదో షెడ్యూల్ అమల్లోకి వచ్చాక, రాజకీయ పక్ష్యాలులు కొత్త మార్గాలు కనుగొన్నాయి. గుంపులుగా పార్టీలు మారడం, విలీనం నిబంధనను ఆశ్రయించడం, రాజీనామాల ద్వారా సభా బలాన్ని మార్చడం జరిగాయి. తెలంగాణలో 2019లో కాంగ్రెస్‌కు చెందిన 18 మంది ఎమ్మెల్యేలలో 12 మంది అప్పటి టీఆర్ఎస్ శాసనసభాపక్షంలో విలీనం కావాలని కోరగా, ఆ సంఖ్య మూడింట రెండొంతులు కావడంతో స్పీకర్ దాన్ని గుర్తించారు.. అప్పుడు కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఇప్పుడు పరిస్థితి తారుమారు కావడంతో బీఆర్ఎస్ నుంచి ఎన్నికైన కొందరు ఎమ్మెల్యేలు అధికారంలో ఉన్న కాంగ్రెస్ వైపు వెళ్లారు..

### ఇతర రాష్ట్రాల్లోనూ అంతే..!

అరుణాచల్‌ప్రదేశ్‌లో 2016లో ముఖ్యమంత్రి పెమా ఖండూ నాయకత్వంలో 44 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో 43 మంది పీపుల్స్ పార్టీ ఆఫ్ అరుణాచల్‌లో (పీపీఏ) చేరారు.. అదే ఏడాది చివరికి ఖండూతో పాటు మరో 32 మంది పీపీఏ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరడంతో, తాజా శాసనసభ ఎన్నిక లేకుండానే రాష్ట్రంలో పూర్తిస్థాయి బీజేపీ ప్రభుత్వం ఏర్పడింది. కర్ణాటకలో 2019లో 17 మంది కాంగ్రెస్–జేడీఎస్ ఎమ్మెల్యేల తిరుగుబాటు, రాజీనామాలు హెచ్.డి. కుమారస్వామి ప్రభుత్వ పతనానికి, బీజేపీ తిరిగి అధికారంలోకి రావడానికి దోహద పడ్డాయి. సుప్రీంకోర్టు వారి అనర్హతను సమర్థించినప్పటికీ ఉప ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనుమతించింది. మధ్యప్రదేశ్‌లో 2020లో 22 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేల రాజీనామాలతో కమల్‌నాథ్ ప్రభుత్వం కూలిపోయింది. ఆ ఎమ్మెల్యేలు తరువాత బీజేపీలో చేరారు..

### అనర్హత అధికారం స్పీకర్‌కు ఉండడంతోనే..

అనర్హతపై తీర్పు చెప్పే అధికారం స్పీకర్ లేదా చైర్మన్‌కే ఉండటం అనేకసార్లు న్యాయ వివాదాలకు దారితీసింది. 2020లో కీశం మేఘచంద్రసింగ్ కేసులో సుప్రీంకోర్టు, ఈ అధికారాన్ని స్వతంత్ర శాశ్వత ట్రిబ్యునల్‌కు అప్పగించే అంశాన్ని పార్లమెంట్ పరిశీలించాలని సూచించింది. అదే తీర్పులో, అసాధారణ పరిస్థితులు లేకపోతే అనర్హత పిటిషన్లను సాధారణంగా మూడు నెలల్లో నిర్ణయించాలనే కాలపరిమితినీ ప్రస్తావించింది. 2025 జూలై 31న తెలంగాణ కేసుల్లో సుప్రీంకోర్టు మరింత స్పష్టంగా, స్పీకర్ లేదా చైర్మన్‌కే అనర్హత నిర్ణయాధికారాన్ని అప్పగించే ప్రస్తుత వ్యవస్థ ఫిరాయింపులను సమర్థంగా అరికడుతోందా? ప్రజాస్వామ్య పునాదులను కాపాడటానికి అది సరిపోతుందా? అన్నది పార్లమెంట్ పరిశీలించాలని పేర్కొంది. పెండింగ్ పిటిషన్లను మూడు నెలల్లో పరిష్కరించాలని కూడా ఆదేశించింది.

### పార్లమెంట్‌లో చర్చ జరగాల్సిందే!

ఫిరాయింపులు ఎక్కువవుతున్న నేపథ్యంలో కేంద్రం స్వతంత్ర నిర్ణయ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడంతో పాటు, అనర్హత పిటిషన్ల పరిష్కారానికి స్పష్టమైన కాలపరిమితిని కూడా నిర్దేశించే అంశంపై పార్లమెంట్ చర్చించి తగిన నిర్ణయం తీసుకోవాలి. దీర్ఘదృష్టితో చూస్తే, ఇది ఏ ఒక్క రాజకీయ పక్షం ప్రయోజనానికీ సంబంధించిన విషయం కాదు.. ప్రజాస్వామ్య విశ్వసనీయతకు, ముఖ్యంగా ఓటరు తీర్పును గౌరవించే వ్యవ స్థకు ఈ ఏర్పాటు అవసరం. ప్రజాప్రతినిధి రాజకీయ అభిప్రా యం మార్చుకునే స్వేచ్ఛను గౌరవిస్తూనే, ఓటరు ఒక పార్టీ అభ్యర్థికి ఇచ్చిన తీర్పు సభలో మరో పార్టీకి సులభంగా బదిలీ కాకుండా చూడాలి. దానం నాగేందర్ కేసులో హైకోర్టు తీర్పు ఫిరాయింపులను అరికట్టాలన్న రాజ్యాంగ లక్ష్యం ఇంకా పూర్తిగా నెరవేరాల్సి ఉందని మరోసారి గుర్తు చేసింది.

# ఓటర్ ప్రక్షాళన సరే.. హక్కులకు కోత వద్దు!

ఓటర్ల జాబితాను సమగ్రంగా పునఃపరిశీలించడం ఎన్నికల ప్రక్రియలో అవసరమైనదే. అనర్హుల పేర్లను తొలగించడంతో పాటు, అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడటం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత. అయితే అభ్యంతరాలు, క్లెయిమ్‌లు, అప్పీళ్లకు సులభమైన అవకాశాలు కల్పించి ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలి. జాబితా నుంచి ఎన్ని పేర్లు తొలగించామన్నది కాదు.. అందులో ఉండాల్సిన ప్రతి అర్హుడి పేరు ఎంత భద్రంగా ఉందన్నదే ప్రజాస్వామ్యానికి అసలైన కొలమానం. ఈ ప్రక్రియలో అర్హుడైన ఒక్క పౌరుడి పేరు పొరపాటున తొలగినా, దాన్ని సాధారణ పరిపాలనా లోపంగా చూడలేం.. ఎన్నికల రోజు ఆ తప్పును సరిదిద్దుకునే అవకాశం పరిమితమవుతుంది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 ప్రకారం లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల ఎన్నికలు సార్వత్రిక వయోజన ఓటు హక్కు ఆధారంగా జరుగుతాయి. అర్హత కలిగిన పౌరుడికి ఓటు వినియోగించే అవకాశం ఉండటం ప్రజాస్వామ్య ప్రక్రియకు కీలకం.




### 13 కోట్లకు పైగా ఓటర్ల తొలగింపు..

ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లో భాగంగా మూడు దశల్లో 30 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని ముసాయిదా జాబితాల నుంచి 13.37 కోట్ల పేర్లు తొలగించబడినట్లు సెప్టెంబర్ 1న వెలువడిన నివేది కలు పేర్కొన్నాయి. ఇది తుది తొలగింపు అని భావించ కూడదు.. ముసాయిదా జాబితాలపై అభ్యంతరాలు, క్లెయిమ్ లకు అవకాశం ఉంటుంది. అయినప్పటికీ ఇంత భారీ స్థాయిలో మార్పులు చోటుచేసుకున్నప్పుడు ప్రతి అర్హుడి పేరు సురక్షితంగా ఉందా? అన్న ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది.

### మానవీయ పరిశీలన తప్పనిసరి..

మరణించినవారి పేర్లు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన వివరాలు, శాశ్వతంగా మారినవారి నమోదులను తొలగించడం అవసరమే. కానీ చిరునామా మారిన నగరవాసులు, వలస కార్మికులు, వృద్ధులు, పేద కుటుంబాలు, పత్రాల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొనే పౌరుల పరిస్థితిని ప్రత్యేకంగా పరిగణించాలి. ఒక సాంకేతిక వ్యత్యాసం కనిపించిందని మాత్రమే ఒకరి అర్హతపై అనుమానం ఏర్పడితే, మానవీయ పరిశీలనకు తగిన అవకాశం ఉండాలి. సర్‌పై ప్రతిపక్షాలు పారదర్శకత, నోటీసుల విధానం, పాత జాబితాలతో ప్రస్తుత నమోదులను అనుసంధానించే విధానంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. ఇవి రాజకీయ వాదనలు.. వాటిలోని ప్రతి అంశాన్ని అధికారిక సమాచారం, విచారణ, క్లెయిమ్‌లు, అప్పీళ్ల ఆధారంగా పరిశీలించాలి. కాబట్టి చర్చ ఆరోపణలకే పరిమితం కాకుండా, ఆధారాలు, పరిష్కారాలపై సాగాలి.

### ప్రజాస్వామ్యంపై విశ్వాసాన్ని పెంచడం..

కేంద్ర ప్రభుత్వం విషయానికొస్తే, సర్‌ను నిర్వహించేది ఎన్నికల సంఘమే. అది రాజ్యాంగబద్ధ స్వతంత్ర సంస్థ. అందువల్ల ప్రక్రియలో ప్రత్యక్ష పరిపాలనా పాత్ర ఎవరిది? బాధ్యత ఏ స్థాయిలో ఉందన్నది స్పష్టంగా వివరించాలి. అయితే దేశ వ్యాప్తంగా కోట్లాది పేర్లను ప్రభావితం చేసే ప్రక్రియపై ప్రజల్లో సందేహాలు ఏర్పడినప్పుడు, ఓటు హక్కు రక్షణకు అవసరమైన పారదర్శకత, సమాచారం, ప్రజా భరోసాకు కేంద్రం మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఇది ఎన్నికల సంఘం స్వతంత్రతను తగ్గించడం కాదు.. ప్రజాస్వామ్యంపై విశ్వాసాన్ని పెంచడం.

### నోటీసు అందితే అనుమానితుడేనా?

ముసాయిదా జాబితా విడుదలైన తర్వాత జరిగే క్లెయిమ్‌లు, అభ్యంతరాల దశ అత్యంత కీలకం. పేరు కనిపించకపోయిన పౌరుడు తన పరిస్థితిని తెలుసుకునే విధానం సులభంగా ఉండాలి. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ సౌక ర్యాలు పరిమితంగా ఉన్నవారికి ప్రత్యామ్నాయ సహాయం అందాలి. వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరిగా జీవించే వారు, సాంకేతిక పరిజ్ఞానం తక్కువగా ఉన్నవారు ప్రక్రియలో వెనుక బడకుండా స్థానిక సిబ్బంది మార్గనిర్దేశం చేయాలి. నోటీసు అందిన ప్రతి వ్యక్తిని ముందుగానే అనుమానితుడిగా చూడకుండా, అతని సమాధానాన్ని నిష్పాక్షికంగా పరిశీలించాలి. ఒకసారి తొలగించిన పేరును తిరిగి చేర్చే నిర్ణయానికి స్పష్టమైన కాలపరిమితి ఉండాలి. తుది జాబితా విడుదలకు ముందు నమోదైన ఫిర్యాదుల పరిష్కార స్థితిని ప్రజలకు తెలియజేయడం విశ్వాసాన్ని పెంచుతుంది.

### ప్రజాస్వామ్యానికి అసలైన కొలమానం..

సర్ పేరుతో అనర్హుల నమోదులను తొలగించడం అవసరమైతే చేయాలి. కానీ సాంకేతిక లోపం, పత్రాల సమస్య, చిరునామా మార్పు లేదా పరిపాలనా పొరపాటు కారణంగా అర్హుడైన ఒక్క ఓటరు హక్కు కోల్పోకూడదు.. ఓటర్ల జాబితాను పునః పరిశీలించే పేరుతో ప్రజాస్వామ్య హక్కు గల్లంతు కాకూడదు. ఓటు హక్కు ఎవరి దయాదాక్షిణ్యాలపై ఆధారపడినది కాదు.. రాజ్యాంగం పౌరుడికి కల్పించిన ప్రజాస్వామ్య హక్కు. ఆ హక్కును కాపాడటం ఎన్నికల సంఘం, ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు, పౌర సమాజం, మీడియా అందరి సమిష్టి బాధ్యత..అదే ప్రజాస్వామ్య నిబద్ధతకు పరీక్ష.

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్ ద్విభాషా దినపత్రిక
www.localguidenews.com



## క్యాబేజీ తింటే గుండె సమస్యలే రావు తెలుసా?
## బరువు తగ్గడం కూడా వెర్రీ ఈజీ..

: తరచూ క్యాబేజీని డైట్ లో చేర్చుకుంటే మన శరీరానికి కావాల్సిన పోషకాలు అందుతాయి. క్యాబేజీని కూర లేదా సలాడ్ రూపంలో తీసుకోవచ్చు. క్యాబేజీ రెగ్యులర్‌గా కూర లేదా సలాడ్ రూపంలో కూడా తీసుకుంటారు. అయితే ప్రతిరోజు ఎండాకాలం క్యాబేజీ తీసుకోవడం వల్ల కలిగే అద్భుత ప్రయోజనాలు తెలుసుకుందాం ..

క్యాబేజీలో ఖనిజాలు పుష్కలం ఇందులో విటమిన్ కే కూడా ఉంటుంది. ఇది ఎముక ఆరోగ్యానికి ఎంతో మంచిది. క్యాబేజీలో ఉండే విటమిన్ సి ఇమ్యూనిటీ వ్యవస్థను బలపరుస్తుంది. దీంతో సీజనల్ జబ్బులకు వ్యతిరేకంగా పోరాడుతుంది. మన శరీరాన్ని కావలసిన మంచి పోషణ కూడా ఇది అందిస్తుంది క్యాడ్బులు బరువు నిర్వహణలో ఉన్నవారు క్యాబేజీ తీసుకోవాలి ఇందులో ఫైబర్ ఎక్కువ శాతం ఉంటుంది కాబట్టి కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తుంది. మన దగ్గర క్యాబేజీ తీసుకోవడం వల్ల ఫైబర్ కూడా అందుతుంది. తద్వారా బరువు పెరగకుండా ఉంటారు. ఇది ఆరోగ్యకరమైన స్నాక్ అని కూడా చెప్పొచ్చు. క్యాబేజీ గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఎందుకంటే ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇది కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించేస్తుంది. అంతేకాదు వాపు సమస్యలకు వ్యతిరేకంగా పోరాడుతుంది. దీంతో మీ గుండె ఆరోగ్యంగా ఉంటుంది. రెగ్యులర్ గా క్యాబేజీ తీసుకోవడం వల్ల కడుపులో గ్యాస్, అజీర్తి తగ్గిపోతుంది. క్యాబేజీ రెగ్యులర్‌గా తీసుకోవడం వల్ల దీర్ఘకాలిక మలబద్దకం సమస్యకు ఎఫెక్టివ్‌గా పని చేస్తుంది. క్యాబేజీ స్నాక్ రూపంలో కూడా తీసుకోవచ్చు.

ఇంటర్ విద్యార్థులకు బిగ్ అలెర్ట్.. పరీక్షా ఫలితాలు ఏప్రిల్ 22న విడుదల..

ఆరోగ్యానికి మాత్రమే కాదు. అందమైన స్కిన్ కి కూడా క్యాబేజీని తీసుకోవాలి. ఇందులో విటమిన్ సి ఉంటుంది కొల్లాజెన్ ఉత్పత్తికి తోడ్పడుతుంది. దీంతో మీ చర్మం నిత్య యవ్వనంగా కూడా కనిపిస్తుంది. క్యాబేజీలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్ కు వ్యతిరేకంగా పోరాడతాయి. తద్వారా మీ ముఖంపై వృద్ధాప్య ఛాయలు ఆలస్యంగా వస్తాయి . క్యాబేజీలో కీళ్ల నొప్పులు తగ్గించే గుణం ఉంటుంది ఇది కీళ్లనొప్పులు ఆర్థరైటిస్ కి వ్యతిరేకంగా ఉంటుంది యాంటీ ఆక్సిడెంట్లు రాడికల్ డామేజ్ కాకుండా కాపాడుతాయి, వయసు వచ్చే వృద్ధాప్య సమస్యలను ఆలస్యం చేస్తాయి ముఖంపై ఉండే నల్ల మచ్చలను కూడా రాను రాను తగ్గిపోతుంది.



రక్తపోటుతో బాధపడుతున్న వారు క్యాబేజీ తీసుకోవాలి ఇది రక్తపోటు స్థాయిలను నిర్వహిస్తుంది పొటాషియం కలిగి ఉంటుంది.

## ప్రతిరోజు పిస్తా పప్పులు
## ఇలా తింటే డాక్టర్ తో పనే ఉండదు!!

:ప్రతిరోజు డ్రైఫ్రూట్స్ తింటే అనారోగ్యసమస్యల బారిన పడాల్సిన అవసరం లేదంటున్నారు వైద్య నిపుణులు. డ్రైఫ్రూట్స్ లో పోషకాలు సమృద్ధిగా లభిస్తాయి.వీటిని ఆహారంలో చేర్చుకోవడం ఎంతో ముఖ్యం. అయితే డ్రైఫ్రూట్స్‌లో పిస్తాపప్పు ఒకటి. దీని మనం స్వీట్‌ల్లో, సలాడ్స్, మిల్క్ షేక్‌ల్లో ఎక్కువగా ఉపయోగిస్తాము. పిస్తా పప్పులో పోషకాలు సమృద్ధిగా ఉండటం వల్ల అనేక ఆరోగ్య సమస్యలను నివారించవచ్చు.

పిస్తా పప్పులు తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు:

1. పోషక విలువలు: పిస్తా పప్పుల్లో ప్రొటీన్లు, ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు, విటమిన్ %దీ%6, పొటాషియం, మెగ్నీషియం, ఫాస్పరస్, రాగి, మాంగనీస్ వంటి పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. ఇవి శరీరానికి కావలసిన శక్తిని అందిచడంలో కీలక ప్రాత పోషిస్తుంది.

2. గుండెకు మేలు: ప్రతిరోజు గుప్పెడు పిస్తా పప్పు తినడం వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఇందులో ఉండే మోనోఅన్‌శాచురేటెడ్, పాలీఅన్‌శాచురేటెడ్ కొవ్వులు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిచడంలో సహాయపడుతాయి. అలాగే పొటాషియం, మెగ్నీషియం రక్తపోటును నియంత్రించడం వల్ల గుండె జబ్బుల ప్రమాదం తగ్గుతుంది.

3. బరువు తగ్గడంలో: అధిక బరువు సమస్యతో బాధపడేవారికి పిస్తా పప్పు ఒక మంచి ఎంపిక. ఇందులో ఉండే ప్రొటీన్, ఫైబర్ కడుపు నిండిన భావన ఉంటుంది. దీని వల్ల అతిగా తినాలి అనే కోరిక తగ్గుతుంది. కాబట్టి పిస్తాతో తయారు చేసే ఆహార పదార్థాలు తీసుకోవడం ఎంతో ముఖ్యం. వీటిలో కేలరీలు తక్కువగా ఉంటాయి.

4. షుగర్ లెవల్స్ అదుపులో: షుగర్ లెవల్స్‌ను కంట్రోల్ చేయడంలో పిస్తా పప్పుఎంతో మేలు చేస్తుంది. ఇందులో ఉండే ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు రక్తంలో చక్కెర స్థాయిలు స్థిరంగా ఉంటాయి. దయాబెటిస్ ఉన్నవారికి ఇది చాలా ఉపయోగకరమైన ఆహారం.

5. కంటి చూపు: పిస్తా పప్పుల్లో లుటీన్ , జియాక్సంతిన్ అనే యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి వయస్సులో వచ్చే కంటి సంబంధిత సమస్యలు, ముఖ్యంగా కంటిశుక్లం రాకుండా చేస్తాయి. కాబట్టి పిస్తా పప్పు తీసుకోవడం చాలా మంచిది.

6. జీర్ణవ్యవస్థ: మలబద్ధకం, గ్యాస్ ఇతర జీర్ణ సమస్యలతో బాధపడేవారు కూడా పిస్తా తీసుకోవడం మంచిది. ఎందుకంటే ఇందులో ఫైబర్ కంటెంట్ అధికంగా ఉంటుంది. ఇది ప్రేగు కదలికలను పెంచడం వల్ల జీర్రక్రీయ మెరుగా పని చేస్తుంది. మంచి బ్యాక్టీరియాను ఉత్పత్తి చేస్తుంది.

7. యాంటీఆక్సిడెంట్లు: పిస్తా పప్పుల్లో టోకోఫెరోల్స్ అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌తో పోరాడి సహాయపడుతాయి. దీని వల్ల క్యాన్సర్ , ఇతర దీర్ఘకాలిక వ్యాధుల నుంచి రక్షిస్తాయి.

8. మెదడు పనితీరులో: పిస్తా పప్పుల్లో విటమిన్ %దీ%6 పుష్కలంగా లభిస్తుంది.అంతేకాకుండా ఇది మెదడు పనితీరును మెరుగుపరచడంలో, నాడీ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడంలో బాగా సహాయపడుతుంది.

9. రోగనిరోధక శక్తి: పిస్తా పప్పుల్లో ఉండే విటమిన్ సి రోగనిరోధక వ్యవస్థను మెరుగుపరుచుతుంది. దీంతో పాటు విటమిన్ %దీ%6 రోగనిరోధక కణాల ఉత్పత్తికి, పనితీరులో సహాయపడుతాయి.

10. ఆరోగ్యమైన చర్మం: పిస్తా పప్పుల్లో ఉండే విటమిన్ %జు%, యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని రక్షిస్తాయి. ఇవి మొటిమలు, మచ్చలు, చర్మం సమస్యలు రాకుండా చేస్తాయి. పిస్తా వల్ల చర్మం ఎల్లప్పుడు యవ్వనంగా ఉంటుంది.

11. ఎముకలు దృఢంగా: పిస్తా పప్పుల్లో ఫాస్పరస్ , మెగ్నీషియం వంటి ఖనిజాలు ఉంటాయి కీళ్ళ నొప్పి సమస్యల రాకుండా చేస్తాయి.

12. రక్తహీనత సమస్య: పిస్తా పప్పుల్లో ఐరన్ కూడా ఉంటుంది. ఇది రక్తహీనతను నివారించడంలో సహాయపడుతుంది. మహిళలు ప్రతిరోజు తినడం చాలా మంచిది.

కాబట్టి పిస్తా పప్పులను ప్రతిరోజు ఆహారంలో చేర్చుకోవడం వల్ల ఈ ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు. అయితే ఏదైనా మితంగా తీసుకోవడం ముఖ్యం. రోజు గుప్పెడు పిస్తా పప్పులు తింటే మంచిది.





## బ్రోకలీ గురించి ఈ విషయాలు తెలుస్తే అసలు విడిచిపెట్టరు..!

: నేటికాలంలో చాలా మంది ఆరోగ్యకరమైన జీవనశైలి వాటు మక్కువ చూపుతున్నారు. ఆరోగ్యంగా ఉండడం కోసం పండ్లు, కూరగాయాలు, సలాడ్స్ వంటివి తినడానికి ఇష్టపడుతున్నారు.అందులో బ్రోకలీ ఒకటి. ఇందులో బోలెడు పోషకాలు ఉంటాయి. ఇది క్రూసిఫెరస్ కుటుంబానికి చెందినది. దీనిలో విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా లభిస్తాయి. బ్రోకలీని తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు గురించి మనం తెలుసుకుందాం.

బ్రోకలీ ఆరోగ్య లాభాలు:

క్యాన్సర్ బారీన పడకుండా: బ్రోకలీలో ఉండే సల్ఫోరాఫేన్ వంటి సమ్మేళనాలు కొన్ని రకాల క్యాన్సర్ కణాల పెరుగుదలను తొలగించడంలో కీలక ప్రాత పోషిస్తాయి. ముఖ్యంగా ప్రోస్టేట్, రొమ్ము, పెద్దప్రేగు, ఊపిరితిత్తుల క్యాన్సర్ల వంటి సమస్యల బారిన పడకుండా రక్షిస్తాయి..గుండె సంబంధిత సమస్యలు: బ్రోకలీలో ఉండే ఫైబర్, పొటాషియం, యాంటీఆక్సిడెంట్లు గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయని ఆరోగ్యనిపుణులు చెబుతున్నారు. ఇందులో ఉండే ఫైబర్ కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. అలాగే పొటాషియం రక్తపోటును కంట్రోల్ చేస్తుంది.జీర్ణక్రియవ్యవస్థ పనితీరు: బ్రోకలీలో అధిక మొత్తంలో ఉండే ఫైబర్ మలబద్ధకం, గ్యాస్, ప్రేగు, కడుపు నొప్పి, ఉబ్బరం వంటి సమస్యలను తగ్గిస్తుంది. ఇది మంచి బ్యాక్టీరియా వృద్ధికి తోడ్పడుతుంది.రోగనిరోధక శక్తి: బ్రోకలీలో విటమిన్ సి పుష్కలంగా దొరుతుంది. ఇది రోగనిరోధక వ్యవస్థను మెరుగుపరచడంలో కీలక ప్రాత పోషిస్తుంది. దీని వల్ల శరీరం ఇన్ఫెక్షన్ల బారిన పడకుండా చేస్తుంది.ఎముకలు బలంగా: బ్రోకలీలో విటమిన్ కె, కాల్షియం ఎక్కువగా ఉంటాయి.

ఇవి ఎముకల ఆరోగ్యానికి చాలా ముఖ్యమైనవని ఆరోగ్యనిపుణులు చెబుతున్నారు. విటమిన్ కె ఎముకల సంబంధిత వ్యాధు బారిన పడకుండా సహాయపడుతుంది.చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది: బ్రోకలీలో ఉండే విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని ఫ్రీ రాడికల్స్ నుంచి రక్షించడంలో సహాయపడతాయి. ఇది చర్మం యవ్వనంగా , ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి.

కంటి చూపును మెరుగు పరుస్తుంది: బ్రోకలీలో లుటీన్, జియాక్సంతిన్ వంటి కెరోటినాయిడ్లు ఉంటాయి. ఇవి కళ్ళను వయస్సు సంబంధిత క్షీణత నుంచి రక్షించడంలో కూడా సహాయ పడతాయి.బ్రోకలీని ఉడికించి, ఆవిరిలో ఉడికించి లేదా పచ్చిగా సలాడ్‌లలో తీసుకోవచ్చు. కాబట్టి మీ ఆహారంలో బ్రోకలీని భాగంగా చేసుకోవడం చాలా మంచిదని వైద్యులు చెబుతున్నారు. మీరు దీంతో ఎన్నో రకాల వంటలు చేసుకోవచ్చు. పిల్లలు, పెద్దలు తినడం వల్ల ఈ పైన తెలిపిన లాభాలను పొందవచ్చు.

## మామిడి పండు కాల్షియం కార్బైడ్‌తో పండిందా..
## ఈ విధంగా తెలుసుకోండి..?



: వేసవికాలం రాగానే ముందుగా అందరికీ గుర్తొచ్చేది మామిడిపండ్లు. మండే వేడి, చెమట, వడదెబ్బ, నిర్జలీకరణం వంటివి వచ్చినప్పటికీ..సమ్మర్‌లో మామిడి పండ్లకు కూడా బాగా డిమాండ్ ఉంటుంది.అయితే మామిడి పండ్లు సహజంగా తీపిగా ఉన్నప్పటికీ.. కొన్నిసార్లు కాల్షియం కార్బైడ్‌ను ఉపయోగించి కృత్రిమంగా పండిస్తారు. కానీ భారతదేశంలో పండ్లను పండించడానికి కాల్షియం కార్బైడ్ వాడటం నిషేధించారు.భారత ఆహార భద్రత, ప్రమాణాల అథారిటీ (%ఖీూూ×%) విడుదల చేసే ఎసిటిలీన్ వాయువుతో సంబంధం ఉన్న ఆరోగ్య సమస్యల కారణంగా దీనిని ఉపయోగించడాన్ని నిషేధించింది. ఈ వాయువులో ఆర్సెనిక్, భాస్వరం వంటి హానికరమైనవి ఉంటాయి. అయినప్పటికీ ఈ రసాయనం మార్కెట్‌లోకి ప్రవేశిస్తుంది. దీనిని తరచుగా మామిడి పండ్లను పండించడానికి ఉపయోగిస్తారని సమాచారం. తద్వారా వినియోగదారులకు అనేక ఆరోగ్య ప్రమాదాలు ఎదురవుతాయని నిపుణులు చెబుతున్నారు.తొక్కలో ఏకరూపత ఉండేలా చూడండి: మామిడి పండు అంతటా ఏకరూపతతో కనిపించాలి. ఒక భాగం మరొక భాగం కంటే భిన్నంగా కనిపిస్తే.. అది హెచ్చరిక సంకేతం కావచ్చు. మామిడి తొక్క మీద నల్లటి చుక్కలు ఉన్నాయా అని చూడండి. అలాగే మామిడి పండు గట్టిగా ఉండాలి. మెత్తగా ఉండకూడదు (అది ఎక్కువగా పండినట్లయితే తప్ప). పండని మామిడి మెత్తగా అనిపించడం మంచి సంకేతం కాదు.నీటి పరీక్ష: ఒక కూజాలో నీళ్లు నింపి మామిడికాయను అందులో ముంచండి. అది మునిగిపోతే.. సాధారణంగా వెళ్లడం మంచిది. ఎందుకంటే కాల్షియం కార్బైడ్ వాడటం వల్ల మామిడిలో గుజ్జు పరిమాణం తగ్గుతుంది. దీంతో ఇది తేలికగా వెళ్లుతుంది. అందువల్ల అది మునిగిపోకుండా తేలుతుందని నిపుణులు వెల్లడిస్తున్నారు.



**గమనిక: పైవార్తలోని సమాచారం ఇంటర్నెట్ ఆధారంగా సేకరించబడింది. దిశ దీనిని ధృవీకరించలేదు. మీ అవగాహన సం నిపుణులు అందించిన సమాచారం మాత్రమే అందిస్తున్నాం. పై వార్తలో మీకు అనుమానాలు ఉంటే కనుక నిపుణులకు సం ప్రదించగలరు.**

## మార్నింగ్ రన్నింగ్, వాకింగ్ కంటే ముందుగా ఈ తప్పులు అసలే చేయకండి



: మార్నింగ్ రన్నింగ్ , వాకింగ్ అనేది హెల్తీ లైఫ్ కు మంచి అలవాటు. శరీరం, మనసు ఉత్తేజంగా, రోజంతా ఉత్సాహంగా ఉంచడంలో ఈ మార్నింగ్ వాక్, రన్నింగ్, జాగింగ్ ఎంతో ఉపయోగపడతాయి.

అంతేకాదు... అధిక బరువును తగ్గించడంతో పాటు అనేక ఆరోగ్య సమస్యలను దూరం చేస్తాయి. అయితే, అంతకంటే ముందు తెలుసుకోవాల్సిన ముఖ్యమైన విషయాలు కూడా కొన్ని ఉన్నాయి. అవి ఏంటంటే...

1) వాటర్ తాగడం తప్పనిసరి... ఎందుకంటే...

వాటర్ తాగకుండా వాకింగ్ వెళ్లకూడదు. ఎందుకంటే రాత్రంతా కనీసం 6 నుండి 8 గంటలపాటు నీరు తాగకుండా ఉండి ఉంటారు. అందుకే మీ శరీరం డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉండాలంటే ఉదయం నిద్ర లేవగానే కనీసం ఒకటి లేదా రెండు గ్లాసులు నీరు తాగాలి.నీరు తాగకుండా వాకింగ్ వెళ్తే, చమట రావడం వల్ల మీ ఒంట్లో ఉండే కొద్దిపాటి నీరు కూడా చమట రూపంలో బయటికి పోవడం వల్ల కొద్దిసేపట్లోనే మీరు అలసిపోతారు. మీ లక్ష్యాన్ని చేరకుండానే అలసటతో మధ్యలోనే వెనుదిరుగాల్సి వస్తుంది. కాదని ముందుకు వెళ్తే... కళ్లు తిరగడం, కండరాలు నొప్పి రావడం, తలనొప్పి లాంటి సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉంటుంది.

2) లైట్ డైట్

చాలామందివ్యాయామం, వాకింగ్ అనగానే ఖాళీ పొట్టతోనే చేయాలి అనే అపోహలో ఉంటారు. కానీ బలహీనంగా ఉండే వారికి లేదా నీరసంగా ఉన్న సమయంలో ఖాళీ కడుపుతో వాకింగ్ కు వెళ్లొద్దు. అలా చేయడం వల్ల త్వరగా అలసిపోతారు. కొన్నిసార్లు నీరసం ఎక్కువైతే కళ్లు తిరిగి పడిపోవడం కూడా జరుగుతుంది.

అందుకే పరిగడుపున తినగలిగే ఏదైనా ఒక పండు, లేదా జ్యూస్ లాంటి లైట్ డైట్ తీసుకుని వాకింగ్ కు వెళ్లాలి.

3) వాకింగ్ కు ముందు తప్పకుండా వామప్

రాత్రి పడుకున్న సమయంలో కొన్ని గంటల తరబడి కండరాల కదలిక లేకుండా శరీరం బిగుతుగా, పట్టేసినట్లుగా ఉంటుంది. అలాగే వాకింగ్ కు వెళ్తే దీర్ఘ కాలంలో మోకాలి నొప్పులు, కీళ్ల నొప్పులు వంటి సమస్యలు ఎదురవుతాయి. అయితే, 2 లేదా 3 నిమిషాలు వామప్ చేయడం వల్ల కండరాల్లో చలనం వచ్చి వాకింగ్ చేసేట ప్పుడు ఇబ్బంది లేకుండా ఉం టుంది. పాదాలు, మడమ, చేతులు, భుజాలు, నడుం అటు ఇటు తిప్పినా చాలు... ఆ తర్వాత అరగంట మీ శరీరం మీ మాట వింటుంది. సమస్యలు లేకుండా చూసుకుంటుంది.

4) టీ, కాఫీలు వద్దు... లెమన్ వాటర్, జీర వాటర్ ముద్దు

కొంతమందికి నిద్ర లేవగానే టీ లేదా కాఫీ తాగే అలవాటు ఉంటుంది. కానీ వాకింగ్ కు వెళ్ళే ముందు అవి తాగ డం మంచిది కాదు. ముఖ్యంగా కాఫీలోని కెఫైన్ మీ ఒంట్లోని నీటి శాతాన్ని పీల్చుకుంటుంది.

దానికితోడు వాకింగ్ చేసేట ప్పుడు వచ్చే చమట వల్ల బాడీ త్వరగా డీహైడ్రేట్ అయి అంతే త్వరగా అలసిపోతారు.

అది మీ లక్ష్యాన్ని దెబ్బ తీస్తుంది. ఒకవేళ టీ, కాఫీలు అల వాటు ఉంటే, వాటి స్థానంలో నిమ్మకాయ నీరు లేదా జీర వాటర్ లాంటివి తాగాలి.

లెమన్ వాటర్ వ్యాధి నిరోధక శక్తిని పెంచుతుంది. జీర వాటర్ జీర్ణ శక్తిని ఇంప్రూవ్ చేస్తుంది.







## తెల్ల రాగులతో అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు.. ఏంటో తెలుసుకోండి!

కరోనా మహమ్మారి తర్వాత ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపు తున్నారు. ఆరోగ్య కరమైన జీవనశైలిని అలవరుచు కోవటంతో పాటు పోషక విలువలతో కూడిన ఆహారాలను తినేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రధానంగా మిల్లెట్స్‌ను అధికంగా తింటున్నారు.

చిరు ధాన్యాల్లో అనేక రకాలు ఉన్నాయి. ఇందులో చాలా మంది తినేవాటిల్లో రాగులు కూడా ఒకటి. ఇక రాగుల అనగానే మనకు ఎరుపు రంగులో ఉండేవి గుర్తుకు వస్తాయి. కానీ తెలుపు రంగులో ఉండే రాగులు కూడా ఉంటాయి. వీటి వల్ల అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. తెల్ల రాగుల్లో జింక్, క్యాల్షియం అధికంగా ఉంటాయి.

అందువల్ల ఎముకలు బలంగా ఉంటాయి. ఇది రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. అలాగే శరీరాన్ని యాక్టివ్‌గా ఉంచుతాయి. ముఖ్యంగా జ్వరం వచ్చిన వారు తెల్ల రాగులతో జావ చేసి తాగుతుంటే ఎంతో ఉపశమనం లభిస్తుంది. జ్వరం నుంచి త్వరగా కోలుకుంటారు. అలాగే తెల్ల రాగులతో చేసిన జావ శరీరానికి చలువ చేస్తుంది. వేడిని తగ్గిస్తుంది. డీహైడ్రేషన్ బారి నుంచి రక్షించబడతారు. తెల్ల రాగుల్లో ఐరన్ కూడా అధికంగానే ఉంటుంది. ఇది హిమోగ్లోబిన్ ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. దీంతో రక్తం తయారవుతుంది.

రక్తహీనత తగ్గుతుంది. అలాగే నీరసం, అలసట తగ్గుతాయి. డయాబెటిస్ ఉన్నవారికి ఈ రాగులు ఎంతో మేలు చేస్తాయి. తెల్ల రాగుల్లో ఉండే ఫైబర్ షుగర్ లెవల్స్‌ను తగ్గిస్తుంది.

డయాబెటిస్‌ను అదుపులో ఉంచుతుంది. తెల్ల రాగుల్లో ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. ఇవి శరీరానికి శక్తిని అందిస్తాయి. శరీరం యాక్టివ్‌గా ఉండేలా చూస్తాయి.



RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy

లోకల్ గైడ్ ద్విభాషా దినపత్రిక



# హెచ్ సీయూ, మియాపూర్-1 డిపోలలో ఏఐటీయూసీ కూటమికి ఘన విజయం



అధిక మెజార్టీతో గెలుపు..కార్మిక ఐక్యతకు నిదర్శనమన్న సీపీఐ నేతలు

శేరిలింగంపల్లి, అక్టోబర్ 10 (లోకల్ ప్రతినిధి కృష్ణ): ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో హెచ్ సీయూ బస్ డిపోలో, మియాపూర్-1 డిపోలో ఏఐటీయూసీ కూటమి అభ్యర్థులు అధిక మెజార్టీతో ఘన విజయం సాధించారు. హెచ్ సీయూ డిపోలో అధ్యక్షులుగా లక్ష్మణ్, జనరల్ సెక్రటరీగా లాల్యా నాయక్, మియాపూర్-1 డిపోలో అధ్యక్షులుగా రాఘవేందర్, సెక్రటరీగా భాషా గౌడ్ విజయం సాధించారు. వారికి సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు టి.రామకృష్ణ, శేరిలింగంపల్లి నియోజకవర్గ కార్యదర్శి కె.చందు యాదవ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ విజయం ఆర్టీసీ కార్మికుల ఐక్యత, కార్మిక హక్కుల కోసం ఏఐటీయూసీ కూటమి సాగిస్తున్న పోరాటాలకు నిదర్శనమని సీపీఐ నాయకులు పేర్కొన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాడే సంఘానికే కార్మికులు పట్టం కడతారని ఈ ఫలితం స్పష్టం చేస్తోందన్నారు. ఆర్టీసీ కార్మికులకు న్యాయం జరిగేలా కృషి చేయాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం, మెరుగైన వేతనాలు, ఉద్యోగ భద్రత, మెరుగైన వైద్య సదుపాయాలు, కుటుంబాలకు సామాజిక భద్రత వంటి ప్రధాన డిమాండ్ల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్మికుల హక్కుల పరిరక్షణలో ఏఐటీయూసీ ముందుండి పోరాడుతుందని, కార్మికుల విశ్వాసాన్ని నిలబెడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు కె.వెంకటస్వామి, శేరిలింగంపల్లి నియోజకవర్గ సహాయ కార్యదర్శి జె.శ్రీనివాస్, ఏఐటీయూసీ అధ్యక్షులు బి.నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్చరీ ప్రీమియర్ లీగ్‌లో పాల్గొనేందుకు 86 మంది గిరిజన విద్యార్థులు

**విద్యార్థులను అభినందించిన ఐటీడీఏ పీవో బీ రాహుల్**




**భద్రాచలం, లోకల్ గైడ్ న్యూస్ :** ఆర్చరీ ప్రీమియర్ లీగ్‌లో పాల్గొనేందుకు గిరిజన సంక్షేమ శాఖ క్రీడా పాఠశాలలకు చెందిన 86 మంది విద్యార్థినీ విద్యార్థులను హైదరాబాద్‌కు పంపించినట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తెలిపారు. శనివారం కాచనపల్లి క్రీడా పాఠశాల నుంచి 43 మంది బాలికలు, కిన్నెరసాని క్రీడా పాఠశాల నుంచి 43 మంది బాలురు పీడీలు, పీఈటీలు, ఏఎస్ఓ సమక్షంలో హైదరాబాద్‌కు బయలుదేరినట్లు పేర్కొన్నారు. ఆర్చరీ ప్రీమియర్ లీగ్‌లో పాల్గొనడం ద్వారా గిరిజన విద్యార్థులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయి విలువిద్య క్రీడాకారులను ప్రత్యక్షంగా చూసే అవకాశం లభిస్తుందని పీఓ రాహుల్ అన్నారు. తద్వారా విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తి పెరగడంతో పాటు విలువిద్యలో రాణించేందుకు అవసరమైన స్ఫూర్తి, ప్రోత్సాహం లభిస్తాయని తెలిపారు. ప్రీమియర్ లీగ్‌లో పాల్గొనేందుకు అనుమతితో పాటు బస్సు సౌకర్యం కల్పించిన ఐటీడీఏ పీఓ బి. రాహుల్, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ చందనకు విద్యార్థినీ విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. విలువిద్యను ప్రోత్సహిస్తూ గిరిజన యువ క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు సహకరిస్తున్న ఆర్చరీ ప్రీమియర్ లీగ్ చైర్మన్, ఏపీఎల్ బృందం, యునైటెడ్ ఖమ్మం జిల్లా విలువిద్య సంఘానికి క్రీడా అధికారి గోపాలరావు, ఏఎస్ఓ వెంకటనారాయణ, సోయం నాగేశ్వరరావు, రాంబాబు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ఆర్టీసీలో ఏఐటీయూసీ విజయం




**హనుమకొండ జిల్లా ప్రతినిధి, అక్టోబర్10(లోకల్ గైడ్ న్యూస్) :** సిపిఐ హనుమకొండ జిల్లా కార్యాలయంలో విజయోత్సవ సంబురాలు,తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసి) గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో ఏఐటీయూసీ అనుబంధ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర స్థాయి గుర్తింపు సంఘంగా చారిత్రాత్మక విజయం సాధించడం పట్ల సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు.?ఈ విజయోత్సవ సందర్భాన్ని పురస్కరించుకుని హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏఐటియుసి, ఆర్టీసీ నాయకుల సమక్షంలో ఘనంగా విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్మికులు,నాయకులు కేక్ కటి చేసి, ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుని ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ"ఆర్టీసీ ఎన్నికల్లో లభించిన ఈ అపార విజయం కేవలం ఒక యూనియన్ విజయం కాదని, ఇది యావత్ ఆర్టీసీ కార్మికుల విజయం అని, ఎర్రజెండా, ఏఐటీయూసీ పోరాట పటిమపై కార్మికులకు ఉన్న అచంచలమైన విశ్వాసానికి ఈ తీర్పు ప్రత్యక్ష నిదర్శనం అని తెలిపారు. ఈ విజయం కోసం శ్రమించిన ఎంప్లాయిస్ యూనియన్ నాయకులకు, కార్యకర్తలకు, అలాగే కూటమిగా ఏర్పడి మద్దతు తెలిపిన ఎన్ఎంయూ,టిఎంయూ తదితర కార్మిక సంఘాల నాయకులకు హృదయపూర్వక అభినందనలు." అని తెలిపారు. ?ఇటీవల ముగిసిన సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలతో పాటు, ఇప్పుడు రాష్ట్రంలో అతిపెద్ద రవాణా సంస్థ అయిన ఆర్టీసీ ఎన్నికల్లోనూ ఏఐటీయూసీ అనుబంధ సంఘాలు విజయం సాధించడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికుల న్యాయబద్ధమైన డిమాండ్ల సాధనకు, ప్రభుత్వంలో విలీన ప్రక్రియ పూర్తిస్థాయి అమలుకు, కార్మికుల సంక్షేమానికి సిపిఐ నిరంతరం అండగా ఉంటుందని, అసెంబ్లీ లోపల, వెలుపల కార్మికుల గొంతుకగా నిలుస్తుందని స్పష్టం చేశారు.?ఈ వేడుకల్లో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి,మద్దెల ఎల్లేష్,ఏఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేల్పుల సారంగపాణి, జక్కు రాజు గౌడ్,జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి, జిల్లా నాయకులు బత్తిని సదానందం, కొట్టేపాక రవి, మాలోతు శంకర్ నాయక్, దర్శుల రామమూర్తి, గుంటి రాజేందర్, యాకయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గడ్డం కేశవమూర్తి జన్మదిన వేడుకలు

**ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘన సన్మానం**



**హనుమకొండ జిల్లా ప్రతినిధి, అక్టోబర్10(లోకల్ గైడ్ న్యూస్) :** హనుమకొండ: టీయూడబ్ల్యూజే ఐజేయు హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి జన్మదిన వేడుకలను శనివారం గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ ప్రతినిధులు ఆయనకు శాలువా కప్పి సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం ఆయన చేస్తున్న సేవలను పలువురు కొనియాడారు. జర్నలిస్టుల ఐక్యత కోసం ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలకు, జర్నలిస్టులకు మధ్య వారధిగా నిలుస్తూ వార్తా రంగంలో తనదైన పాత్ర పోషిస్తున్నారని అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారం సదయ్య, టీయూడబ్ల్యూజే ఐజేయు జిల్లా కార్యదర్శి ఉటుకూరు సాయిరాం, కోశాధికారి విష్ణు వర్ధన్, టీయూడబ్ల్యూజే ఐజేయు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంకణాల సంతోష్, తోట సుధాకర్, రాష్ట్ర హౌసింగ్ వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ వల్లాల వెంకటరమణ, తెలంగాణ డిజిటల్ మీడియా ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన నాగరాజు, సీనియర్ జర్నలిస్టులు వేముల రాజేశ్వర్ రావు, దండు మోహన్, రజాక్,, పాషా, సోమనర్సయ్య, దాసరి ధనుంజయ, సలెశీద్ర రవీందర్, చెలిక రాజేంద్ర ప్రసాద్, సిద్దోజు రాకేష్, పలువురు జర్నలిస్టులు పాల్గొని కేశవమూర్తికి శుభాకాంక్షలు తెలిపారు.

# రీజోనెన్స్ జూనియర్ కళాశాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలు.

**రీజోనెన్స్ కళాశాల చైర్మన్ లెక్కల రాజిరెడ్డి....వెల్లడి**



**హనుమకొండ జిల్లా ప్రతినిధి, అక్టోబర్10(లోకల్ గైడ్ న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర సంస్కృతి సాంప్రదాయాలకు పతికగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని హనుమకొండలోని రీజనెన్స్ జూనియర్ కళాశాలలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయుల తో పాటు మేనేజ్మెంట్ పాల్గొని బతుకమ్మ ఉత్సవాలను ఆనందోత్సవాల మధ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వందలాదిమంది విద్యార్థులు సంప్రదాయపద్ధంగా బతుకమ్మలను అలకరించి బతుకమ్మ పాటలతో నృత్యాలు చేస్తూ, దండియా, కోలాటం, తదితర సంస్కృతిక కార్యక్రమాలను అత్యంత ఉత్సాహంగా ప్రదర్శించారు. విద్యార్థుల సంప్రదాయ దుస్తులు రంగురంగుల బతుకమ్మలు పాటలు నృత్యాలతో కళాశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుందని అన్నారు. విద్యార్థుల సంస్కృతిక ప్రదర్శనలను వీక్షించేందుకు పిల్లల తల్లిదండ్రులు కూడా పెద్ద సంఖ్యలో హాజరై ఆనందించారు. విద్యార్థుల ప్రతిభను ఉత్సాహాన్ని అభినందించారు అలాగే పట్టణ ప్రజలు కూడా ఈ వేడుకలను ఆసక్తిగా వీక్షించి విద్యార్థులను అభినందించారు. బతుకమ్మ పండుగ తెలంగాణ మహిళల అనుబంధానికి ప్రకృతితో మన సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణకు ప్రతిగా నిలుస్తుందని ఇటువంటి పండగల ద్వారా విద్యార్థుల్లో మన సంస్కృతి సాంప్రదాయాల పట్ల అవగాహన, గౌరవ భావాలను పెంపొందించవచ్చని కళాశాల యాజమాన్యం పేర్కొంది అన్నారు. ఈ కార్యక్రమానికి రీజోనెన్స్ కళాశాల చైర్మన్ లెక్కల రాజిరెడ్డి ,కళాశాల డైరెక్టర్లు లెక్కల మహేందర్ రెడ్డి, మాదిరెడ్డి దేవేందర్ రెడ్డి, సీఈవో. లెక్కల రమ్య రాజిరెడ్డి,రీజోనెన్స్ కళాశాల డీన్. బిఎస్ గోపాలరావు, నయీమ్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుమలత, ఫ్యాకల్టీ సభ్యులు క్లాస్ టీచర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రీజోనెన్స్ కళాశాల చైర్మన్ లెక్కల రాజిరెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తమ రీజనెన్స్ కళాశాల విద్యార్థిని విద్యార్థుల్లో అనేకమంది జాతీయస్థాయిలో నిర్వహించే ప్రతిష్టాత్మకమైన జేఈఈ మెయిన్స్ అడ్వాన్స్ నీట్ ప్రవేశ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించడంతోపాటు దేశంలో ప్రతిష్టాత్మకమైన ఐఐటీలు, ఎన్ఐటీలు, వైద్య కళాశాలలో ఎంబిబిఎస్ సీట్లు సాధిస్తూ వరంగల్ కు గర్వకారణంగా నిలుస్తున్నారని తెలిపారు. బతుకమ్మ పండుగ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సంస్కృతిక వైభవం తెలంగాణ సాంప్రదాయాలకు అద్దం పట్టిందని భవిష్యత్తులోనూ ఇలాంటి సంస్కృతిక కార్యక్రమాలను మరింత ఘనంగా నిర్వహిస్తూ విద్యార్థుల్లో మన సంస్కృతి సాంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంపొందిస్తామని కళాశాల యాజమాన్యం తెలియజేశారు.



# సదాశివపేట పట్టణం లోని సిద్దాపూర్ రోడ్డుకు శాశ్వత పరిష్కారం చూపాలి: జగ్గారెడ్డి, నిర్మల

**కూల్చివేతలు లేకుండా, పాన్ షాప్ లు, పూల దుకాణాలు,మటన్,చికెన్ దుకాణాలకు ఇబ్బంది కలగకుండా పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మించాలి**

**అక్టోబర్ 30లోగా అంచనాలు సిద్ధం చేయాలని అధికారులకు సూచన**



**లోకల్ గైడ్/ సంగారెడ్డి :** సదాశివపేట పట్టణంలోని సిద్దాపూర్ రోడ్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అధికారులను ఆదేశించారు. నిర్మల జగ్గారెడ్డితో కలిసి ఆయన సిద్దాపూర్ రోడ్డును పరిశీలించారు. ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, పబ్లిక్ హెల్త్, మున్సిపల్ అధికారులతో రోడ్డు నిర్మాణం, వర్షపు నీటి పారుదల, కల్వర్టులు, డ్రైనేజీ పనులపై సమీక్ష నిర్వహించారు.మెయిన్ రోడ్డు నుంచి సిద్దాపూర్ కాలనీ చివరి వరకు పలుమార్లు పనులు చేపట్టినా రోడ్డు సమస్య పరిష్కారం కాకపోవడంపై జగ్గారెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. 2004లో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు సిద్దాపూర్ రోడ్డు వేయించానని గుర్తుచేశారు. గత పదేళ్లలో ఈ రోడ్డు విషయంలో ఏం జరిగిందో తెలియదన్నారు. ఇకపై సిద్దాపూర్ రోడ్డు సమస్య పదేపదే చర్చకు రాకుండా పటిష్ఠంగా పనులు చేపట్టాలని సూచించారు. మెయిన్ రోడ్డు నుంచి సిద్దాపూర్ ఈద్గా వరకు సుమారు 1.5 కిలోమీటర్ల మేర పూర్తిస్థాయిలో సీసీ రోడ్డు నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయాలని తెలిపారు. డిగ్రీ కళాశాల నుంచి మెయిన్ రోడ్డు జంక్షన్ వరకు సాంకేతికంగా సరైన లెవల్స్ తీసుకుని, వరద నీరు, డ్రైనేజీ నీరు సక్రమంగా వెళ్లేలా రోడ్డు నిర్మించాలని స్పష్టం చేశారు. రోడ్డు ప్రారంభం నుంచి చివరి వరకు ఎక్కడా వర్షపు నీరు నిలవకుండా డ్రైన్లు, అవసరమైన చోట్ల కల్వర్టులు ఏర్పాటు చేయాలన్నారు.



కల్వర్టులు అవసరమైన ప్రాంతాలను జగ్గారెడ్డి, నిర్మల స్వయంగా పరిశీలించారు. రోడ్డు వెడల్పు, అందుబాటులో ఉన్న స్థలాన్ని టేపుతో కొలిచి మరీ పరిశీలించారు. కూల్చివేతలు లేకుండా పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. 30 అడుగుల వెడల్పు ఉన్నచోట 30 అడుగులు, 40 అడుగులు ఉన్నచోట 40 అడుగులు, 60 అడుగులు అందుబాటులో ఉన్నచోట 60 అడుగుల మేర రోడ్డు నిర్మించాలని చెప్పారు. తనకు తెలియజేయకుండా సిద్దాపూర్ రోడ్డులో ఏ డబ్బానూ తొలగించవద్దని స్పష్టం చేశారు. చిరు వ్యాపారులు, పాన్‌షాపులు, పూల దుకాణాలు, మటన్, చికెన్ దుకాణాలకు ఇబ్బంది కలగకుండా పనులు జరగాలన్నారు.సిద్దాపూర్ కూడలిలో ప్రజలకు, వ్యాపారులకు ఇబ్బంది కలగకుండా జంక్షన్ అభివృద్ధి చేయాలని సూచించారు. మధ్యలో విగ్రహం ఏర్పాటుకు అనువుగా సర్కిల్ రూపకల్పన చేయాలని చెప్పారు. రోడ్డు పనులకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సిద్దాపూర్ రోడ్డు పనులకు సంబంధించి రూ.2 కోట్ల నిధులు మిగిలి ఉన్నాయని, మున్సిపాలిటీలో టీఎఫ్ఐడీసీకి చెందిన మరో రూ.5 కోట్ల నిధులు కూడా అందుబాటులో ఉన్నాయని సమీక్షలో ప్రస్తావించారు. కలెక్టర్‌తో సమావేశం అనంతరం సంబంధిత శాఖల సమన్వయంతో పనులను ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. సరైన లెవల్స్, డ్రైన్లు, కల్వర్టులతో కూడిన 1.5 కిలోమీటర్ల సీసీ రోడ్డు నిర్మాణానికి అక్టోబర్ 30లోగా అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పట్టణం, మండలంలోని సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు రోజూ ఒక ప్రాంతంలో పర్యటిస్తానని జగ్గారెడ్డి తెలిపారు. త్వరలో ఊబ చెరువును పరిశీలిస్తానన్నారు.

# వనపర్తిలో 'గరుడ" షాపింగ్ మాల్...!

**నేడు ఘనంగా ప్రారంభించనున్న గరుడ ఫ్యామిలీ వస్త్ర సిల్క్స్**

**ప్రముఖ నటి భాగ్యశ్రీ బోర్సే చేతుల మీదుగా ప్రారంభిశీచేందుకు ఏర్పాట్లు**

**హాజరు కానున్న ప్రజా ప్రతినిధులు,విశిష్ట వ్యక్తులు**




**వనపర్తి లోకల్ గైడ్ ప్రతినిధి అక్టోబర్ 10:** గరుడ వస్త్ర సిల్క్స్ తెలంగాణలో తన ప్రస్థానాన్ని మరింత విస్తరిస్తూ, నాణ్యత, అందం, వైవిధ్యమైన ఫ్యాషన్ కలెక్షన్లను వినియోగదారులకు మరింత చేరువ చేసేందుకు వనపర్తి నగరంలో మరో అడుగు వేసింది.సంప్రదాయ, ఆధునిక మరియు కుటుంబ అవసరాలకు అనుగుణమైన విస్తృత స్థాయి ఫ్యాషన్ కలెక్షన్లను ఒకే వేదికపై అందిస్తూ వినియోగదారులకు అత్యుత్తమమైన, ప్రీమియం షాపింగ్ అనుభూతిని అందించాలనే లక్ష్యంతో గరుడ వస్త్ర సిల్క్స్‌ను వనపర్తిలో ఏర్పాటు చేశారు.ప్రముఖ ఫ్యామిలీ షాపింగ్ మాల్ గరుడ వస్త్ర సిల్క్స్ వనపర్తిలో తన నూతన షోరూమ్‌ను అక్టోబర్ 11,(ఆదివారం )ఉదయం 10:00 గంటలకు ఘనంగా ప్రారంభించనుంది.ఈ గ్రాండ్ ఇనాగరేషన్ కార్యక్రమం జక్కా రఘునందన్ రెడ్డి, అనంత్ రెడ్డి, జక్కా శమన్తకామణి, జక్కా మానీషా మరియు జక్కా శ్రేయ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు.వనపర్తిలోని కొత్తకోట రోడ్డులో ఏర్పాటు చేసిన ఈ మాల్ బ్రాంచ్‌ను ప్రముఖ నటి భాగ్యశ్రీ బోర్సే చేతుల మీదుగా ప్రారంభించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. కార్యక్రమానికి ప్రముఖ ప్రజాప్రతినిధులు, విశిష్ట వ్యక్తులు, ఫ్యాషన్ ప్రియులు, వనపర్తి పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఈ వేడుకను మరింత ప్రత్యేకంగా నిలపనున్నారు.

## గరుడ వస్త్ర సిల్క్స్ లక్ష్యం

గరుడ వస్త్ర సిల్క్స్ బ్రాండ్ తన మూల సిద్ధాంతాన్ని హిందూ పురాణాల్లోని గరుడుడు మరియు అమృతం కథనం నుంచి ప్రేరణగా తీసుకుంది.దేవతల నుంచి అమృతాన్ని పొందేందుకు గరుడుడు చేసిన పోరాటం, ఆయనలోని కరుణ, బలం, భక్తి మరియు నిస్వార్థ ప్రేమకు ప్రతీకగా నిలుస్తుంది. అదే విలువలను ప్రతి కుటుంబంలో బలం, ప్రేమ, ఐక్యతగా తీసుకురావడంతో పాటు భవిష్యత్ తరాలకు స్ఫూర్తినివ్వాలన్నదే గరుడ వస్త్ర సిల్క్స్ లక్ష్యం.




## అద్భుతమైన సాంప్రదాయ చేనేత వస్త్రాలు

ఈ సందర్భంగా గరుడ వస్త్ర సిల్క్స్‌కు చెందిన జక్కా రఘునందన్ రెడ్డి,అనంత్ రెడ్డి లు మాట్లాడుతూ...వనపర్తిలోని గరుడ వస్త్ర సిల్క్స్‌లో బనారసీ, కాంచీపురం, ధర్మవరం, గద్వాల్ వంటి భారతదేశంలోని అద్భుతమైన సాంప్రదాయ చేనేత వస్త్రాల అందాన్ని ఒకే వేదికపైకి తీసుకువస్తున్నామని అన్నారు.భారతీయ చేనేత వారసత్వంలోని గొప్పతనాన్ని, నాణ్యతను మరియు ప్రామాణికతను ఆధునిక శైలితో మేళవించి వినియోగదారులకు అందించడమే మా లక్ష్యమన్నారు.వనపర్తి పరిసర ప్రాంతాల ప్రజలందరూ తమ కుటుంబ సభ్యులతో కలిసి నూతన షోరూమ్ లో ప్రత్యేక కలెక్షన్లు మరియు ప్రారంభోత్సవ ప్రత్యేక ఆఫర్లను ఆస్వాదించాలని కోరారు.

## "గరుడ" ఫ్యామిలీ షాపింగ్ మాల్

నూతన షోరూమ్‌లో అందమైన చీరలు, సంప్రదాయ వస్త్రాలు, ఆధునిక దుస్తులు, ఫ్యాషన్ వేర్ తదితర విస్తృతమైన కలెక్షన్లు అందుబాటులో ఉండనున్నాయి. ప్రతి సందర్భానికి, కుటుంబంలోని ప్రతి సభ్యుడికి అనువైన నాణ్యత, వైవిధ్యం, అందం మరియు తాజా ఫ్యాషన్ ట్రెండ్స్‌ను ఒకే చోట అందించే సంపూర్ణ షాపింగ్ డెస్టినేషన్‌గా ఈ షోరూమ్‌ను తీర్చిదిద్దారు.దీనివల్ల పెళ్లి షాపింగ్ కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, ఒకే చోట అన్ని రకాల వెరైటీలను వనపర్తిలో ప్రజలు పొందవచ్చు.నూతన విస్తరణతో గరుడ వస్త్ర సిల్క్స్ తెలంగాణలో తన ప్రస్థానాన్ని మరింత విస్తరిస్తూ, నాణ్యత, అందం, వైవిధ్యమైన ఫ్యాషన్ కలెక్షన్లను వినియోగదారులకు మరింత చేరువ చేస్తోందని డైరెక్టర్లు ధీమా వ్యక్తం చేశారు.

## హాజరుకానున్న ప్రముఖులు

వనపర్తిలోని ఈ గ్రాండ్ ఇనాగరేషన్ కార్యక్రమానికి పలువురు ప్రముఖ రాజకీయ నాయకులు మరియు విశిష్ట వ్యక్తులు హాజరుకానున్నారు. వనపర్తి ఎమ్మెల్యే.తూడి మేఘా రెడ్డి, ఎమ్మెల్యే.అల్లోటి మహేశ్వర్ రెడ్డి,ఎమ్మెల్సీ.దామోదర్ రెడ్డి,నవీన్ కుమార్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్.శివసేన రెడ్డి,మాజీ మంత్రి.నిరంజన్ రెడ్డి,చిన్నారెడ్డి,మాజీ ఎంపీ. రావుల,మున్సిపల్ చైర్మన్.మాధవి,లైబ్రరీ చైర్మన్.గోవర్ధన్ సాగర్,మున్సిపల్ వైస్ చైర్మన్.మధుసూదన్ గౌడ్,కౌన్సిలర్.అరుణ జ్యోతిలు హాజరుకానున్నారు.


Edited, Printed, Published & Owned by CH.RAM REDDYPublished from CRR publications, D.No.1-144/1, Near Apple Hospital Mothinagar, Balanagar Mandal, Ranga Reddy Dist.Telangana State and printed atGayatri Printers, near Apple Hospital Mothinagar, Balanagar Mandal, Rangareddy Dist,Telangana state.RNI NO:APBIL/2013/50718 Editor CH.RAM REDDYEMAIL: Localguide9999@gmail.com eb:www.local-guidenews.com,contact:8977761499\\\